

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 6-4-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 351 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: నవమి రా.7.24 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి పూర్తి, వర్జ్యం: మ.1.49-3.29, దుర్ముహూర్తం: సా.4.47-5.36, అమృతఘడియలు: రా.11.46-రా.1.26, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘కంచ’ దాటిన వివాదం!



కంచ గచ్చిబౌలి వద్ద ఉన్న చెరువు సమీపంలో నిర్మించే తాత్కాలిక జైలుకు వెళతారు అని సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హెచ్చరించింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదేశాలను పాటించని పక్షంలో అక్కడ కొత్తగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోసం జైలును నిర్మించాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తున్నదా? అలా ఆదేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉంటుందా?

ఆయా కేసుల విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయా? లేక కీడు చేస్తాయా? కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చట్టాలను మాత్రమే సమీక్షించాలా? లేదా వ్యక్తిగత అభిప్రాయాలను కూడా జోడించవచ్చా? అన్న దానిపై న్యాయ నిపుణులలో కొంత కాలంగా చర్చ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన పర్యటనకు బయలుదేరిన ప్రతిసారీ రహదారులపై చెట్లను నరికిపారేసేవారు. ఈ వ్యవహారంపై మీడియాలో పుంఖాను పుంఖాలుగా వార్తలు వచ్చాయి. అయినా ఏ న్యాయస్థానమూ పట్టించుకోలేదు. పర్యావరణ ప్రియులు కూడా స్పందించలేదు.

విశాఖపట్నంలో రుషికొండను నిబంధనలు పాటించకుండా ముఖ్యమంత్రి నివాసం కోసం బోడిగుండుగా మారుస్తున్నారని, సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. అప్పుడు సుప్రీంకోర్టు ఇంత వేగంగా స్పందించలేదు.

భూముల అమ్మకం సమర్థనీయమా? కాదా? అంటే ఎవరి వాదన వారికి ఉంటోంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగా మాట్లాడటం మన రాజకీయ పార్టీలకు పరిపాటే. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎన్నికల సందర్భంగా ఇస్తున్న అలవికాని హామీల అమలుకోసం ప్రభుత్వ భూములను విక్రయించడం వాంఛనీయం కాదు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక అగ్ర దేశాధినేతగా కాకుండా ఫక్తు రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ఆయన ఎడా పెడా సుంకాలు విధిస్తున్నారు. దిగుమతి అయ్యే వస్తువుల ధరలు పెరిగితే ఆ భారం అమెరికన్లపైనే పడుతుంది కదా?

రక్షిత ఆర్థిక విధానం అమలులో ఉన్నప్పుడు దేశ ప్రజలకు అంబాసిడర్ కారు మాత్రమే దిక్కుగా ఉండేది. కార్లను దిగుమతి చేసుకోవాలంటే 300 శాతానికి పైగా పన్ను చెల్లించాల్సి వచ్చేది. స్వేచ్ఛా వాణిజ్య విధానం అమల్లోకి వచ్చాక అంబాసిడర్ కార్లు.. టెక్నాలజీ విషయంలో దిగుమతి చేసుకున్న కార్లతో పోటీపడలేక కనుమరుగయ్యాయి.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

జన్మభూమిలా పీ4

నాడు గ్రామాల అభివృద్ధి.. నేడు పీ4తో పేదలకు అండ

- సమాజంలో ఎదిగిన ప్రతి ఒక్కరూ
- బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి
- సొంత కాళ్లపై నిలబడేలా సాయం చేయాలి
- ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో చంద్రబాబు
- సమస్యలు ఏకరువు పెట్టిన పేదలు
- ఆదుకుంటామన్న పారిశ్రామికవేత్తలు
- ఓ సామాన్యుడి ఇంటికి చంద్రబాబు
- స్వయంగా కాఫీ అందజేసిన సీఎం

సమాజం మనకు ఎంత ఇచ్చిందో మనం కూడా సమాజానికి అంత అందించాలి. ఎంత శక్తి ఉంటే ఆ మేరకు మనస్ఫూర్తిగా సాయం చేసేందుకు ముందుకు రావాలి. నేను చేపట్టిన ఈ యజ్ఞానికి (పీ4 కార్యక్రమం) సహకరించే వారందరికీ కూటమి ప్రభుత్వం, సమాజం రుణపడి ఉంటుంది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలోని ముప్పాళ్లలో బంగారు కుటుంబానికి చెందిన కొండ్రు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు కాఫీ అందిస్తున్న చంద్రబాబు



ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయవాడ/చందర్లపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎదిగిన ప్రతి ఒక్కరూ పేదరిక నిర్మూలనకు చేయూత నందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. గతంలో తాను జన్మభూమి కార్యక్రమం నిర్వహించి విజయం సాధించానని, తన పిలుపుతో పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలు, ప్రముఖులు గ్రామాలను అభివృద్ధి చేశారని అన్నారు. ఎప్పటికప్పుడు నూతన ఆలోచనలతో తాను ముందుకు సాగుతానని, ఈ క్రమంలోనే పీ4 కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. సమాజంలో ఎదిగిన ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిలను బట్టి ఈ కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని, భవిష్యత్‌లో వారు సొంత కాళ్లపై నిలబడేలా సాయం చేయాలని అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ల గ్రామంలో పీ4 కార్యక్రమం కింద ఎంపికైన

మిగతా 13వ పేజీలో...

పీ4తో ‘కొమ్మమూరు లిఫ్ట్’

- రూ.10 కోట్లు ఇవ్వనున్న ప్రసాద్ సీడ్స్ అధినేత
- తీరనున్న ఐదు గ్రామాల రైతుల సాగునీటి వెతలు
- సస్యశ్యామలం కానున్న 5,315 ఎకరాలు
- పలు గ్రామాలకు తీరనున్న దాహార్తి

13



రూ.10 కోట్ల విరాళం ఇస్తామని చంద్రబాబుకు తెలియజేస్తున్న ప్రసాద్ సీడ్స్ అధినేత

ట్రంప్ సృష్టించిన టారిఫ్ కల్లోలం

తిప్పికొడుతున్న సుంకాల నిర్ణయం



- అడ్డగోలు సుంకాల ప్రభావంపై అమెరికన్లలో దడ
- నిత్యావసరాల ధరలు పెరుగుతాయన్న ఆందోళన
- స్టోర్ల ముందు బారులు.. సూపర్ మార్కెట్లు ఖాళీ
- వస్త్రాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాల దాకా ఇదే పరిస్థితి
- ధరలు పెంచిన వ్యాపారులు.. పాత స్టాకుకు కొత్త రేట్లు
- తాహతుకు మించి కొంటూ అమెరికన్లు అప్పుల పాలు
- అమెరికాలోని భారతీయులపైనా ధరాఘాతం

కొత్త టారిఫ్‌లు అమెరికాకు మేలు చేస్తాయని అనుకోవడం లేదు. ఇలాంటి చర్యలే నేను తీసుకొని ఉంటే.. ఇప్పుడు మౌనంగా ఉన్నవారు అప్పుడెలా వ్యవహరించేవారో ఊహించడమే కష్టంగా ఉంది.

- బరాక్ ఒబామా, మాజీ అధ్యక్షుడు

ఇదొక ఆర్థిక విప్లవం. ఇందులో మేమే విజయం సాధిస్తాం. కానీ, ఇదేమీ అంత సులభం కాదు. తుది ఫలితం మాత్రం చరిత్రాత్మకంగా ఉంటుంది.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, ఏప్రిల్ 5: ప్రపంచ దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో అమెరికాలో కల్లోలం మొదలైంది. విదేశీ ఉత్పత్తులపై గంపగుత్తగా సుంకాలు పెంచి ట్రంప్ వాటికి ముకుతాడు వేయడం ఏమోగానీ.. ఆ అడ్డగోలు సుంకాల ప్రభావం అమెరికాలో అప్పుడే కనిపిస్తోంది. ఆ దేశంలో వినియోగించే సరుకులు, వస్తువులలో చాలా వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవే కావడంతో.. ధరలు పెరిగిపోతాయని స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఎందుకైనా మంచిదన్న ఉద్దేశంతో ధరలు తక్కువగా ఉన్నప్పుడే అవసరమైనవన్నీ కొనిపెట్టేసుకోవాలన్న ఆలోచన పెరిగింది. దీనితో అమెరికాలోని సూపర్ మార్కెట్లు, గ్రోసరీ స్టోర్లకు జనం ఎగబడుతున్నారు. చాలా స్టోర్లలో సరుకుల ర్యాక్స్ ఖాళీగా కనిపిస్తున్నాయంటూ అక్కడి మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో

మిగతా 12వ పేజీలో...



కసిరెడ్డికి ‘సిట్’ పిలుపు

- 9న విచారణకు రావాలని నోటీసు
- వైసీపీ మద్యం కుంభకోణం సూత్రధారి, వసూల్ ‘రాజ్’కు ఇప్పటికే 2 నోటీసులు
- ఎందుకో చెబితేనే వస్తానంటూ మెలిక
- సిట్ నోటీసులపై హైకోర్టుకు కసిరెడ్డి
- విచారణకు సహకరించాలన్న న్యాయస్థానం

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రూ.వేల కోట్ల మద్యం కుంభకోణానికి పాల్పడిన జగన్ దూరపు బంధువు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి(రాజ్ కసిరెడ్డి)కి సిట్ మరోసారి నోటీసు జారీ చేసింది. ఈ నెల 9న విచారణకు రావాలంటూ విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు నేతృత్వంలోని సిట్ ఆయనకు మూడోసారి నోటీసు ఇచ్చింది. ఇప్పటికే ఇచ్చిన రెండు నోటీసులపై హైకోర్టులో చుక్కెదురవడంతో ఆయన తప్పనిసరిగా విచారణకు హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది. 2019

మిగతా 13వ పేజీలో...

క్రమబద్ధీకరణ చేద్దామా?

ఫ్రీహోల్డ్ భూమి సమస్యకు పరిష్కారమిదే

- మార్కెట్ ధర వసూలు చేస్తే సరిపోతుంది
- పేదలకు కష్టం కలగకుండా చర్యలు
- ప్రభుత్వానికి అందుతున్న సూచనలు
- జగన్ హయాంలో ప్రహసనంలా ఫ్రీహోల్డ్
- రికార్డులే లేని భూములకూ ‘విముక్తి’
- వాటిని క్రమబద్ధీకరిస్తే ఖజానాకు ఆదాయం
- ఫీజు కట్టించుకుని కొన్నవారికే రెగ్యులరైజ్
- 17న కేబినెట్ ఉపసంఘం సమావేశం
- అన్నిరకాల సూచనలు, సలహాలపై దృష్టి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ఫ్రీ హోల్డ్ చేసిన భూమి 5.74 లక్షల ఎకరాలు. ఈ భూమి విలువ కనీసం 90వేల కోట్లపైనే. ఇందులో రికార్డులు లేకుండానే ఫ్రీహోల్డ్ చేసిన భూమి 2.69 లక్షల ఎకరాలు. దీని విలువ కనీసం 35వేల కోట్లపైనే ఉంటుందని రెవెన్యూ శాఖ అంచనా. ఇంత విలువైన భూమిని అక్రమంగా, అడ్డదిడ్డంగా ఫ్రీహోల్డ్ చేసిన జగన్ సర్కారు ఎవరికి

మిగతా 2వ పేజీలో...

ముంచిన అకాల వర్షం

- కోస్తాలోని పలు జిల్లాల్లో జోరు వాన.. పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులు
- తడిసిన వరి పనలు.. రాలిన మామిడి.. అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం
- కాకినాడ జిల్లాలో అత్యధికంగా 56.25 మి.మీ.వర్షపాతం
- మరో 2 రోజులు మోస్తరు వర్షాలు.. అదే సమయంలో వేడి పెరిగే అవకాశం
- జాగ్రత్తగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ

14



ఆదివారం ప్రధాని ప్రారంభించనున్న పాంబన్ కొత్త వంతెన. దాని పక్కన ఉన్నది 1914లో నిర్మించిన పాత రైల్వే వంతెన

ఆధునిక రామ సేతు!

ఇంజనీరింగ్ అద్భుతం పాంబన్ రైలు బ్రిడ్జి.. మండపం-రామేశ్వరం మధ్య సరికొత్త వారధి

- నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- 2.07 కి.మీ. పొడవు.. 535 కోట్ల వ్యయం
- తొలి ‘వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జి’గా ఖ్యాతి
- 22 మీటర్ల ఎత్తయిన ఓడలు కింద నుంచి వెళ్లే చాన్స్
- వంతెన మొత్తం సెన్సర్లతో అనుసంధానం
- గాలులు పెరిగితే ఆటోమేటిగ్గా మార్గం మూసివేత

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

దేశమంతా రాములోరి కల్యాణానికి సిద్ధమైంది. ఇదే సమయంలో శ్రీరాముడు నడయాడిన పాంబన్ దీవి మరో అద్భుత ఆవిష్కరణకు వేదికవుతోంది. రావణ లంకకు వెళ్లేందుకు నాడు వానరసేన నిర్మించినట్లు విశ్వసించే రామసేతు మొదలయ్యేది పాంబన్ నుంచే! పాంబన్ దీవిని ప్రధాన భూభాగంతో అనుసంధానించేందుకు నేడు నిర్మించిన అధునాతన రైలు మార్గాన్ని

మిగతా 12వ పేజీలో...

నేడు శ్రీరామనవమి



శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైన భద్రాచల రామాలయం

నీటిలో సైక్లింగ్!



సైకిల్ రోడ్డుపై తొక్కడం మామూలే. నీటిలో సైక్లింగ్ చేస్తే అది వినూత్నం. చిత్తూరులోని గంగినేని చెరువు ఇది. దీనిని అభివృద్ధి చేసి ఇందులో బోటింగ్ పెట్టేందుకు పర్యాటక, నీటి పారుదల శాఖలతో కలిసి నగరపాలక సంస్థ కృషి చేస్తోంది. ఈ క్రమంలో చెరువులో చేస్తున్న సైక్లింగ్ స్థానికులను ఆకట్టుకుంటోంది.



విద్యుత్ వెలుగుల్లో రామతీర్థం దేవస్థానం

నేడు రామతీర్థంలో రాములోరి పెళ్లి

- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి శ్రీనివాస్

నెల్లిమర్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకలకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానం సిద్ధమైంది. సీతారాముల కల్యాణోత్సవానికి దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. దేవస్థానం వెనుక ఉన్న ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం జరగనుంది. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేయనున్నారు.

నేడు భద్రాద్రి రామయ్యకు టీటీడీ పట్టువస్త్రాలు

తిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.



భద్రాచలంలో నేడే సీతారాముల కల్యాణం

- ఉదయం 10.30 గంటలకు ప్రారంభం
- ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించనున్న టీ-సీఎం రేవంత్‌రెడ్డి

భద్రాచలం, ఏప్రిల్ 5: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం భద్రాచలంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణమండపంలో ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్‌రెడ్డి సమర్పించనున్నారు. ఉత్సవాలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 1,800 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం 2 లక్షల లడ్డూలను, 200 క్వింటాళ్ల తలంబ్రాలను దేవస్థానం పంపిణీకి సిద్ధం చేసింది. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో భద్రాచలానికి 197 ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

లోకం తీరు



2029 తర్వాతే జమిలి ఎన్నికలు

- కేంద్ర నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడం ఎవరికీ సరికాదు
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

చెన్నై, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టతనిచ్చారు. 2029 పార్లమెంటు ఎన్నికల తర్వాతే జమిలి ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'(జమిలి) ప్రక్రియను 2029 తర్వాతే రాష్ట్రపతి ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. శనివారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంటుకు, శాసనసభకు ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించే ప్రక్రియ ద్వారా ప్రజల సొమ్మును ఆదా చేయొచ్చని చెప్పారు. గత ఏడాది జరిగిన ఎన్నికలకు దాదాపు రూ.లక్ష కోట్లకు పైగానే ఖర్చు చేయాల్సి వచ్చిందని వివరించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనేది కొత్త ఆలోచన కాదని, ఇది ఎప్పటి నుంచో ఉన్నదేనని తెలిపారు. రాజకీయంగా నేతలు, పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండవచ్చునని, కానీ, కేంద్రం ప్రతిపాదించిన ప్రతి విషయాన్నీ గుడ్డిగా ప్రతిఘటించడం ఎవరికీ సరికాదని వ్యాఖ్యానించారు.

పర్యాటక పెట్టుబడులకు కమిటీ

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024-29 ప్రకారం రాష్ట్రానికి వచ్చే పర్యాటక పెట్టుబడులను పరిశీలించి, ధ్రువీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఛైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సీఈవో, సభ్యులుగా మరో ఎనిమిది మంది ఉంటారు ఏపీటీడీసీ ఈడీ, చీఫ్ ఇంజనీరు తదితరులు ఉంటారు.

తిరుమల దారిలో..

అలిపిరి బేస్‌క్యాంప్

15 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళిక.. కొండపై వాహనాల రద్దీకి చెక్



అలిపిరిలోని టోల్‌గేట్ ప్రాంతం ఏరియల్ వ్యూ

- క్యాంప్‌లోనే వాహనాల పార్కింగ్.. బస్సుల్లో కొండపైకి భక్తులు
- పెరుగుతున్న భక్తులకు ఇక్కడే సౌకర్యాలు
- 25 వేల మందికి వసతి కల్పించేలా చర్యలు
- శేషాచలంలో పర్యావరణ పరిరక్షణకు కసరత్తు
- బేస్‌క్యాంప్ ప్లాన్‌కు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్
- ఇకపై పనుల్లో వేగం పెంచనున్న అధికారులు

తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కలియుగ వైకుంఠం తిరుమలలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ప్రశాంతంగా ఉండాల్సిన ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పెడుతోంది. గోవింద నామాలు వినబడాల్సిన చోట హారన్ల మోత మారుమోగుతోంది. పెరిగిపోతున్న భక్తులకు కొండపై వసతి కల్పించడం కష్టంగా మారుతోంది. పెరుగుతున్న రద్దీతో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది. వీటన్నింటికి చెక్ పెట్టడానికి అలిపిరిలో టీటీడీ ఏర్పాటు చేయాలని భావిస్తున్న బేస్‌క్యాంప్ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను తీర్చడంతో పాటు తిరుమల పవిత్రత, పర్యావరణాన్ని రక్షించడంలో ఆ ప్రాజెక్టు ప్రధాన పాత్ర పోషిస్తుందని టీటీడీ భావిస్తోంది. కొవిడ్ ముందు వరకు తిరుమలకు రోజుకు 5 వేల వాహనాలు చేరేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 10 వేలకు పెరిగింది. దీంతో తిరుమలలో పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు శబ్దకాలుష్యం కూడా రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ విషయంలో సైలెంట్ జోన్‌లో ఉండాల్సిన తిరుమల కమర్షియల్ జోన్‌లోకి వెళ్లిపోయింది. ఒక్కో సమయంలో ఇండస్ట్రియల్ జోన్‌లోకి కూడా వెళ్లిపోతూ ప్రశాంతమైన వాతావరణం కనుమరుగవుతోంది. ఈ పరిస్థితులు శేషాచలం కొండల ఎకో-సిస్టమ్‌కి తీవ్రమైన ముప్పుగా మారుతోంది. అలాగే, తిరుమలలో రోజుకు సగటున 68 వేల మంది భక్తులతో పాటు 20 వేల మంది స్థానికులకు నీటి, విద్యుత్ వనరులు సమకూర్చడం కూడా కష్టంగా పరిణమిస్తోంది. ఇక వసతి విషయంలో ప్రధానంగా తిరుమలలో 7,790 టీటీడీ గదులు, 1,105 మఠాల గదులు, 6,800 లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా కేవలం 55 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంటోంది. మిగిలిన భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం కోసమే టీటీడీ బేస్‌క్యాంప్ ప్రాజెక్ట్‌పై ప్రధాన దృష్టిసారించింది.

బేస్‌క్యాంపునకు లైన్ క్లియర్

తిరుమల విజన్-2047లో భాగంగా అలిపిరిలో బేస్‌క్యాంప్ ఎను ఏర్పాటు చేయాలని భావించిన టీటీడీ ఈవో శ్యామలరావు ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్ట్‌ను సిద్ధం చేశారు. దీనికోసం 10 నుంచి 15 హెక్టార్ల స్థలాన్ని వినియోగించనున్నారు. గతంలో వివిధ హోటళ్లకు ఇచ్చిన స్థలాన్ని కూడా రద్దు చేసి టీటీడీకే కేటాయించడంతో బేస్‌క్యాంప్‌కు లైన్ క్లియర్ అయింది. ఇటీవల టీటీడీపై సమీక్షలో ఈబేస్ క్యాంప్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నుంచీ గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఇక పనులు వేగంవంతంగా పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

బేస్‌క్యాంప్‌లో ఏముంటాయంటే..

1 ప్రధానంగా 25 వేల మంది భక్తులకు సకల సౌకర్యాలతో వసతి కల్పించేదిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో కొండపై భక్తుల రద్దీని క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుంది.

1 వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి చేరే ప్రైవేట్ వాహనాలను ఈ బేస్‌క్యాంప్‌కు మళ్లించి వాటిలో వచ్చిన భక్తులను టీటీడీ, ఏపీఎస్ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా తిరుమలకు పంపేందుకు ప్రత్యేక కేంద్రం.. మోడల్ ట్రాన్స్‌ఫర్ టెర్మినల్ ఏర్పాటు చేస్తారు

1 భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు, స్నానాలు చేసేందుకు, భోజనం హాళ్లు, లాకర్లు వంటి సదుపాయాలు కల్పిస్తారు.

1 భక్తులకు వసతి కేటాయింపు కార్యాలయాలతో పాటు వివిధ రకాల కౌంటర్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారు.

1 మ్యూజియం, కళాప్రదర్శన కేంద్రం, ఆధ్యాత్మికతను పెంచేలా వివిధ రకాల ఏర్పాటు ఉంటాయి.

1 ఈ బేస్‌క్యాంప్ అందుబాటులోకి వస్తే కొండపై వాహన కాలుష్యం తగ్గించడంతో పాటు నీటి, విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నియంత్రించవచ్చని టీటీడీ భావిస్తోంది.

1 ట్రాఫిక్ సమస్య కూడా తగ్గిపోయి తిరుమలలో కేవలం గోవింద నామస్మరణ మాత్రమే వినిపిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

క్రమబద్ధీకరణ చేద్దామా?

(మొదటి పేజీ తరువాయి)

పంచి పెట్టాలని చూసింది? ఎవరి ఖాతాలో ఆ భూములను వేయాలనుకుంది? ఎవరికి దోచిపెట్టాలనుకుంది? ఇవి తెలుసుకునే అవకాశం లేకుండానే జగన్ సర్కారు ప్రజాగ్రహానికి బలయింది. ఇప్పుడు ఈ భూముల అక్రమాలను ఏం చేయాలి? ఎలా పరిష్కరించాలో కూటమి సర్కారుకు బోధపడటం లేదు. జగన్ సర్కారు అక్రమాల పరంపరను నిలువరించగలిగినా, ప్రభుత్వం మారే నాటికే జరిగిన అక్రమాలను ఎలా సక్రమం చేయాలో ఓ పట్టాన అంతుచిక్కడం లేదు. ఇప్పటికే మార్గాన్వేషణ కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మరోవైపు రాష్ట్రంలో రెవెన్యూ నిపుణులు, మేధావులు, రిటైర్డ్ అఖిల భారత సర్వీసు అధికారులు, భూములపై అవగాహన ఉన్న పెద్ద మనుషుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రెవెన్యూ శాఖను ఆదేశించారు. మరోవైపు జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ నిపుణులు వేర్వేరు మార్గాల ద్వారా తమ సూచనలు, సలహాలు ప్రభుత్వానికి పంపిస్తున్నారు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం తొలిదఫా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించింది. ఈనెల 17న మరోసారి భేటీ కానుంది. అసైన్డ్ భూముల చట్టం-1977కు విరుద్ధంగా గత ప్రభుత్వం జీవో 596 తెచ్చింది. దీని ప్రకారం, 20 ఏళ్ల గడువు తీరిన అసైన్డ్ భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించాలి. ఆ తర్వాత ఆ భూముల యజమానులకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ అందించాలి. వాటి ఆధారంగా రైతులు తమ భూములను ఇతరులకు అమ్ముకోవచ్చు. అయితే, ఈ ప్రక్రియ సజావుగా సాగలేదు. 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తే అందులో 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారని రెవెన్యూశాఖ నిర్ధారించింది. ఫ్రీహోల్డ్, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసింది. కొత్తగా అక్రమాలు జరగకుండా నిరోధించింది. కానీ, అప్పటికే గుర్తించిన అక్రమాల విషయంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు వస్తున్నాయి. అందులో కొన్ని..

ఇలా చేద్దామా?

- అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో, పేదల ఆధీనంలో లేని వాటి విషయంలో క్రమబద్ధీకరించాలి. అంటే, నిజమైన పేదల్లో ఎకరం, రెండు ఎకరాల లోపు భూమి ఉన్నవారే ఎక్కువ. భూములను ఉన్నపళంగా ఫ్రీహోల్డ్ చేయించి అమ్ముకోవాల్సిన అవసరం వారికి ఉండదని ఓ కీలక మంత్రి ఇప్పటికే ఉపసంఘంలో సూచన చేసినట్లు తెలిసింది.
- రికార్డులే లేకుండా ఫ్రీహోల్డ్ చేసిన 2.69 లక్షల ఎకరాలతోపాటు, పేదలు, సామాన్యులతో సంబంధం లేని భూములను ఆ ప్రాంతంలో ఉన్న భూముల రేట్ల ఆధారంగా క్రమబద్ధీకరించాలని మరో సీనియర్ మంత్రి ప్రతిపాదించినట్లు సమాచారం.
- జగన్ సర్కారు అసైన్డ్ చట్టసవరణ చేయడానికి ముందే లక్షల ఎకరాలు చేతులు మారాయని రెవెన్యూశాఖ గుర్తించింది. ఇలా చేతులు మారిన భూములు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ కాలేదు. ఈ కోవలోకి వచ్చే భూములను గుర్తించి కొనుగోలు చేసిన వారి దగ్గర మార్కెట్ ఫీజు వసూలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలి. దీని వల్ల భారీ ఆదాయం వస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ ఒకరు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది.
- చట్టప్రకారం, జీఓ నం. 596 మార్గదర్శకాల మేరకు ఒరిజినల్ అసైనీలు పొజిషన్‌లో ఉన్న భూములను గుర్తించి వాటి వరకే ఫ్రీ హోల్డ్ చేయాలి. ఈ ప్రక్రియ కొంత సమయం తీసుకున్నా ఇదే అసలైన చట్టబద్ధమైన స్ఫూర్తిగా ఉంటుందని రెవెన్యూశాఖకు లిఖితపూర్వకంగా సూచనలు వచ్చాయి.
- పొజిషన్‌లో ఉన్న రైతులను గుర్తించి వారి భూములను ఫ్రీ హోల్డ్ చేసి, వారి పేరిటే రిజిస్ట్రేషన్ చేస్తే సరిపోతుందని, అప్పుడు భూ కబ్జాదారులెవరో సులువుగా కనిపెట్టవచ్చని రైతు కూలీ సంఘం నుంచి సూచన వచ్చింది.
- మొత్తంగానే ఫ్రీ హోల్డ్ విధానాన్ని రద్దుచేయాలని రిటైర్డ్ రెవెన్యూ అధికారి సురేంద్రనాథ్ ప్రభుత్వానికి సూచించారు.



తిరుమల ఆలయం ముందు శక్తికాంత దాస్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి శక్తికాంత దాస్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం కుటుంబ సభ్యులతో కలిసి మనోహర్ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు.

25 నుంచి చర్లపల్లి మీదుగా 'జన్మభూమి' రాకపోకలు

విశాఖపట్నం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (విశాఖపట్నం-లింగంపల్లి) రైళ్లు ఈ నెల 25 నుంచి చర్లపల్లి-అమ్ముగుడ-సనత్‌నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు ఈ నెల 25 నుంచి విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.05 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.40 గంటలకు లింగంపల్లి చేరుతుంది. 26 నుంచి లింగంపల్లిలో బయలుదేరి 7.15 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.45 గంటలకు విశాఖ చేరుతుంది.



తిరుచానూరు పద్మావతీ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా

తిరుమల చేరుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

» నేడు శ్రీవారిని దర్శించుకోనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా

తిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి శనివారం రాత్రి 8.15 గంటలకు చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా రాత్రికి తిరుమలలోనే బస చేసి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా.. శనివారం సాయంత్రం తిరుచానూరులోని పద్మావతీ దేవిని దర్శించుకున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా దంపతులకు టీటీడీ ఈవో శ్యామలరావు ప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. వేదపండితులు విష్వక్సేనారాధన, కలశ ప్రతిష్ఠ, కలశ పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, కనకధారణ చేశారు. అనంతరం ఆగమ పండితులు రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పుట్టమన్ను సేకరించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

రండి.. చేరండి!

ప్రభుత్వ ఇంటర్ కాలేజీల ప్రచార జోరు

» మొన్నటి దాకా పరీక్షా కేంద్రాల వద్ద
» ఇప్పుడు నేరుగా విద్యార్థుల ఇళ్ల వద్దకే
» తల్లిదండ్రులను కలిసి అవగాహన
» అడ్మిషన్లు పెంచేందుకు స్పెషల్ డ్రైవ్
» ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల ప్రచారం
» ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీకారం
» రేపటి నుంచి ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు
» మెరుగైన బోధన, ఉచిత పుస్తకాలు, భోజనం
» ఈ ఏడాది నుంచి ఎంసెట్ కోచింగ్ కూడా

(అనంతపురం-ఆంధ్రజ్యోతి)



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద కళాశాల అధ్యాపకుల ప్రచారం



అనంతపురంలో విద్యార్థుల ఇళ్ల వద్ద ప్రచారం చేస్తున్న పాతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది



శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో అధ్యాపకుల ప్రచారం

పదో తరగతి పరీక్షలు జరుగుతుండగానే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్..! 'మీ పిల్లలను మా కాలేజీలో చేర్పించండి' అంటూ ఆఫర్..! అంతేకాదు.. పరీక్షా కేంద్రాల వద్ద కరపత్రాలతో ప్రచారం..! ఇంకా హోర్డింగులు, ఫ్లెక్సీలతో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు హడావుడి చేయడం సర్వసాధారణం. ఇప్పుడు ప్రభుత్వ కాలేజీలు కూడా 'రూటు' మార్చాయి. అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది నేరుగా విద్యార్థుల వద్దకే వెళుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సరికొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ కాలేజీలలో చేరితే కలిగే ప్రయోజనాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు అధ్యాపకులు, సిబ్బంది వివరించి, చైతన్యపరుస్తున్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఇప్పటికే ప్రచారం పూర్తి చేశారు. ఇప్పుడు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళుతున్నారు. 'ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. కడుపు నిండా కమ్మని భోజనం పెడుతున్నాం. మంచి లెక్చరర్లు ఉన్నారు. ఫీజులు నామమాత్రమే. మన కాలేజీల్లో ఏం తక్కువ..? రండి.. చేరండి.. బాగా చదువుకోండి' అని ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ఆహ్వానం పలుకుతున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు జరగనున్న నేపథ్యంలో అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు

ఒకప్పుడు ప్రభుత్వ కాలేజీల్లో పుస్తకాలు ఇచ్చేవారు కాదు. ముఖ్యంగా జగన్ ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కలగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది సెలవులకు ముందే ఉమ్మడి అనంతపురం జిల్లాకు పుస్తకాలు చేరాయి. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు కాలేజీలకు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 4 నుంచి ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ పథకం కింద మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 11,244 మందికి మధ్యాహ్న భోజనం సమకూర్చారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంసెట్ కోచింగ్ కూడా ఇవ్వనున్నారు. వచ్చే నెలలో 'తల్లికి వందనం' ఇస్తామని ప్రకటించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కాలేజీల్లో అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నారు. అనంతపురం జిల్లాలో 23 జూనియర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్, ఒక ఒకేషనల్ కళాశాల ఉన్నాయి. అనంతపురం, ఉరవకొండ, కణేకల్లు, కదిరి, ధర్మవరం, రాయదుర్గం, కొత్తచెరువు, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో అధ్యాపకుల బృందం విస్తృతంగా ప్రచారం చేశారు.

ప్రచారంతో సత్ఫలితాలు



సురేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

గుంతకల్లు ఎస్కేపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ముమ్మర ప్రచారం చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఒకేషనల్, జనరల్ కోర్సుల్లో కలిపి 380 మంది విద్యార్థులు చేరారు. 2024-25లో ఆ సంఖ్య 460కి చేరింది. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. 'ప్రభుత్వ కాలేజీలు 20 ఏళ్ల కిందటి స్వర్ణయుగం దిశగా పయనిస్తున్నాయి. గడిచిన పది, పదిహేనేళ్లలో కార్పొరేటు, ప్రైవేటు కళాశాలల ప్రచారం కారణంగా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు మందగించాయి. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, తక్కువ ఫీజులు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందుతున్నాయి. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకుని తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వ కాలేజీల్లో చేరాలి' అని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేశ్ అన్నారు.

అడ్మిషన్లు పెంచేలా డ్రైవ్



ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు ఇస్తోంది. అన్ని రకాలుగా విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోంది. అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విస్తృతంగా డ్రైవ్ చేస్తున్నారు. అడ్మిషన్ కోసం వచ్చే ఏ విద్యార్థీ వెనక్కు వెళ్లకుండా చూస్తాం.

- వెంకటరమణ నాయక్, డీవీఈఓ, అనంతపురం జిల్లా

గ్లోబల్ లీడర్‌గా అవతరించిన నారాయణ

» అమెరికా ఎన్ఎస్ఎస్ పోటీల్లో 99 ప్రాజెక్టులకు అవార్డులు
» వరల్డ్ గ్రాండ్ ప్రైజ్, వరల్డ్ నంబర్ వన్ స్థానంలో 12 సెలక్షన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ పోటీల్లో ఈ విద్యా సంవత్సరంలో నారాయణ విద్యార్థులు సత్తాచాటడంతో గ్లోబల్ లీడర్‌గా అవతరించినట్లు ఆ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ తెలిపారు. వరల్డ్ గ్రాండ్‌ప్రైజ్‌తోపాటు వరల్డ్ నంబరు1 స్థానంలో 12 సెలక్షన్లను తమ విద్యార్థులు దక్కించుకున్నారని, భారత్‌లో ఏ ఇతర విద్యాసంస్థ ఇలాంటి అరుదైన ఘనత సాధించలేదన్నారు. వరల్డ్ నం.2 స్థానంలో 17, వరల్డ్ నం.3 స్థానంలో 14 సెలక్షన్స్‌తోపాటు 55 హానరబుల్ ప్రైజ్‌లను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. మొత్తంగా 99 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. తమ విద్యార్థుల విజయాల శాతం అంతర్జాతీయ స్థాయిలో 34.1 శాతం ఉండగా, జాతీయ స్థాయిలో 58.5శాతంగా ఉందన్నారు. నేషనల్ స్పేస్ సొసైటీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా వందలాది విద్యాసంస్థల నుంచి వేలాది ప్రాజెక్టులతో పాల్గొంటాయని విలేకరుల సమావేశంలో తెలిపారు. పోటీ పరీక్షలకోసం ప్రత్యేకంగా ప్రోగ్రామ్స్‌ను అమలుచేస్తున్న ఏకైక విద్యాసంస్థ నారాయణేనని తెలిపారు. దీనికోసం సిఓ స్పార్క్, ఒలంపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్స్‌తో శిక్షణ అందిస్తున్నామని, ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి మెటీరియల్‌ను రూపొందించామన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షల్లో తమ విద్యార్థులు సాధిస్తున్న విజయాల వెనుక నారాయణ ఉన్నతమైన ప్రణాళిక, బోధన వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా సీబీఎస్ఈతో కూడిన సమగ్ర పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టి విద్యనందించడం వల్లనే ఇలాంటి ఫలితాలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ అభినందించారు.

అంకితభావంతో లక్ష్యసాధన

» విద్యార్థులకు జస్టిస్ సుందరేశ్ పిలుపు
» ఘనంగా వీఐటీ యూనివర్సిటీ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎంఎం సుందరేశ్, డాక్టర్ జి.విశ్వనాథన్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో కష్టపడి విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం వేలూరులో జరిగిన వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) యూనివర్సిటీ డేకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుందరేశ్.. వివిధ క్రీడా, ప్రతిభా పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.1.4 కోట్ల విలువైన బహుమతులను వర్సిటీ అందజేసింది. జస్టిస్ సుందరేశ్ మాట్లాడుతూ.. శిక్షణ, అభిరుచి ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. చైనాకు చెందిన ఝూ వెన్‌జాన్ అనే అమ్మాయి చిన్న వయసులోనే చెస్ నేర్చుకుని గొప్ప ఆటగాళ్లందరినీ ఓడించి ప్రపంచ చాంపియన్‌గా నిలిచిందని తెలిపారు. యాపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ ఎన్నో పోరాటాల తర్వాత విజయాన్ని అందుకున్నారన్నారు. ఈ విజయాలకు కారణం వారి కఠోర శ్రమయేనని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాల్లో వివిధ విభాగాల్లో అవార్డులు పొందిన 3,200 మంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి లార్సన్ అండ్ టూబ్రో కార్పొరేట్ సెంటర్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గణేశన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, రమణి బాలసుందరం, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కాంచన భాస్కరన్, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.జయభారతి విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.



ల్యాబ్‌ను సందర్శించిన కేంద్ర బృందం సభ్యులు

గుంటూరులో బర్డ్‌ఫ్లూ రీజనల్ సర్వేలెన్స్ సెంటర్

» వైద్య కళాశాల వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో ఏర్పాటు
» ల్యాబ్‌ను సందర్శించిన కేంద్ర బృందం
» శాస్త్రవేత్తలతో వివిధ అంశాలపై చర్చ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరులో బర్డ్‌ఫ్లూ రీజనల్ సర్వేలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పనిచేసే స్టేట్ లెవెల్ వైరస్ రీసెర్చ్ అండ్ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీ (వీఆర్‌డీఎల్)కి అనుబంధంగా ఈ సెంటర్ పని చేస్తుంది. ఈ ల్యాబ్‌కు అవసరమైన డయాగ్నోస్టిక్ కిట్లను, కన్స్యూమబుల్స్‌ను పుణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్ (ఎన్ఐవీ) సరఫరా చేస్తుంది. ఈ రాష్ట్ర స్థాయి వైరస్ పరిశోధన, పరీక్షా కేంద్రానికి స్వైన్‌ఫ్లూ, ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ఏ, బీ తదితర వ్యాధులతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏలో రెండు సబ్ టైప్‌లను నిర్ధారించే సాంకేతిక పరిజ్ఞానం ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూ వైరస్‌తో మృతి చెందిన సంఘటన నేపథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్)కి చెందిన సెంట్రల్ టీమ్ సభ్యులు, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వెలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) స్టేట్ అధికారులు శనివారం గుంటూరు వైద్య కళాశాలకు వచ్చారు. మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న రాష్ట్రస్థాయి వైరస్ పరిశోధన, పరీక్షా కేంద్రాన్ని (వీఆర్‌డీఎల్) సందర్శించారు. వీఆర్‌డీఎల్‌కు చెందిన సైంటిస్టులు లోకేశ్, మైమూనా, డాక్టర్ వాణీశ్రీ తదితరులతో ఈ కేంద్ర బృందం సుమారు గంటన్నరపాటు సమావేశమై వివిధ అంశాలను చర్చించింది. ల్యాబ్ పని తీరుపై ఐసీఎంఆర్ వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. గతేడాది వ్యవధిలో వీఆర్‌డీఎల్‌లో జరిపిన వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. గడిచిన మూడు నెలల్లో 50 అనుమానిత ఇన్‌ఫ్లూయెంజా ఏ వైరస్ కేసులకు నిర్ధారణ పరీక్షలు జరిపినట్టు డాక్టర్ లోకేశ్ తెలిపారు. ఇకపై అనుమానిత కేసుల నమూనాలను ఐసీఎంఆర్, పుణేలోని నేషనల్ ల్యాబ్‌కు పంపాలని కేంద్ర బృందం సూచించింది.

యువతిపై కత్తితో దాడి

» విజయనగరం జిల్లాలో ఘటన

గరివిడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం గ్రామంలో శనివారం ఓ యువతిపై యువకుడు కత్తితో విచక్షణారహితంగా చేసిన దాడిలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. కడుపులో రెండుసార్లు పొడిచినట్లు సమాచారం. దాడి చేసిన వ్యక్తిని అదే గ్రామానికి చెందిన బూర్లె ఆదినారాయణగా పోలీసులు గుర్తించారు. ఆదినారాయణతోపాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. 18 ఏళ్ల కోండ్రు అఖిల ఇంటర్ ఫస్టియర్ చదివింది. ఆ తర్వాత చదువు ఆపేసి, ఇంటి వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బూర్లె ఆదినారాయణ (23), అఖిల స్నేహంగా ఉండేవారు. గత కొన్ని రోజుల నుంచి వీరి మధ్య స్నేహం చెడింది. దీంతో ఆ యువకుడు ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో అఖిల శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి పనులు చేసుకొనేందుకు తమ పెరట్లోకి వెళ్లింది. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఆదినారాయణ ఆమెపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఎవరూ గుర్తుపట్టకుండా ముఖానికి ముసుగు ధరించాడు. తీవ్ర గాయాలతో, రక్తపుమడుగులో ఉన్న అఖిల పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి ఆమెను 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై సమాచారం అందుకున్న ఎస్పీ వకుల్ జిందాల్, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి ఘటనపై ఎస్పీ మాట్లాడుతూ.. కేసు మిస్టరీ ఛేదించేందుకు 5 ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. అఖిల తండ్రి తోటనాయుడు, తల్లి సత్యవమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టు

» పోలీసుల అదుపులో ఒకరు.. 126 కిలోలు స్వాధీనం

విశాఖపట్నం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి విశాఖపట్నం మీదుగా ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును దువ్వాడ పోలీసులు రట్టు చేశారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 125.9 కిలోల గంజాయితో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు సభ్యులు పరారయ్యారు. డీసీపీ-2 మేరీ ప్రశాంతి శనివారం తెలిపిన వివరాలు..ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వస్త్ర వ్యాపారం చేసుకునే భరత్‌సింగ్, రాజ్‌సింగ్ ఇక్కడ ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువెళ్లి విక్రయిస్తే భారీగా డబ్బులు సంపాదించవచ్చని భావించారు. విశాఖలో ఉంటున్న రాజ్‌సింగ్ స్నేహితుడైన ఢిల్లీకి చెందిన అమిత్‌కుమార్‌సింగ్‌ను సంప్రదించారు. ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీకి రవాణా చేసేందుకు సహకరిస్తే కమీషన్ ఇస్తామన్నారు. దీనికి అమిత్‌కుమార్‌సింగ్ సరేననడంతో గత నెలలో ఏజెన్సీ నుంచి గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీ తీసుకువెళ్లారు. భరత్‌సింగ్, రాజ్‌సింగ్ మరోసారి గంజాయి తీసుకువెళ్లేందుకు ఈ నెల 2న విశాఖ వచ్చారు. ఏజెన్సీకి వెళ్లి 126 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. బ్యాగుల్లో గంజాయిని కూర్మన్నపాలెం వద్దకు తీసుకువచ్చిన భరత్‌సింగ్, రాజ్‌సింగ్ దానిని హైదరాబాద్ మీదుగా ఢిల్లీ చేర్చే బాధ్యతను అమిత్‌కు అప్పగించారు. అమిత్ హైదరాబాద్ వెళ్లేందుకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కిన తరువాత భరత్‌సింగ్, రాజ్‌సింగ్ విమానంలో ఢిల్లీ వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో అమిత్ శుక్రవారం ట్రావెల్స్ బస్సు ఎక్కేందుకు కూర్మన్నపాలెం వద్ద వేచి ఉండగా, గంజాయి తనిఖీ స్క్వాడ్‌కు సమాచారం అందింది. దువ్వాడ పోలీసులతో కలిసి అతన్ని అదుపులోకి తీసుకుని, ఆరు బ్యాగుల్లోని 125.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భరత్‌సింగ్, రాజ్‌సింగ్ పరారయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా వన్ రేసు నిర్వహణ కోసం ఐఎంజీ భారత్ అనే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాలను తీసుకుంది. ఈ 400 ఎకరాలకు బదులుగా మరోచోట 397 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ వర్సిటీకి కేటాయించింది. అంటే ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ఈ 400 ఎకరాలతో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేదనుకోవాలి. ప్రభుత్వం అమ్మాలనుకుంటున్న ఈ 400 ఎకరాలను ఎవరూ కొనవద్దని, కాదూ కూడదూ అని ఎవరైనా కొంటే తాము మూడేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చాక స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించిన తర్వాత దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని ఆయనకు తెలియదా? ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి 25 సంవత్సరాలు పట్టిన విషయం మరచిపోతే ఎలా?

'కంచ' దాటిన వ్యాఖ్యలు

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ఇంత వివాదాస్పదంగా, ఉద్రిక్తంగా మారడానికి కారణాలు ఏమిటి? ఈ భూములకు సంబంధించిన అసలు వాస్తవాలు ఏమిటి? చినికి చినికి గాలివానగా మారిన ఈ వ్యవహారంపై అటు న్యాయ వ్యవస్థ, ఇటు ప్రభుత్వం వ్యవహరించిన తీరు సమర్థనీయంగా ఉందా? కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుమోటోగా విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం చేసిన తీవ్ర వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ విశ్వసనీయత, ప్రతిష్ఠపై ప్రభావం చూపవా? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూములు, ఇతర అంశాలలో గోటితో పోయే దానిని గొడ్డలి దాకా ఎందుకు తెచ్చుకుంటోంది? ఈ భూముల విషయమై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఎందుకు ఆందోళన చేశారు? ఈ భూములకు, యూనివర్సిటీకి సంబంధం ఉందా? ఇత్యాది ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశంగా ఉన్నాయి. కంచ గచ్చిబౌలి భూముల వివాదాన్ని సుమోటోగా విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాలని, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే అక్కడ చెరువు వద్ద నిర్మించే జైలులో ఉండాల్సి వస్తుందని హెచ్చరించడం కూడా జరిగింది. అయితే, సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులలో ఈ వ్యాఖ్యలు ఏవీ లేవు. ఈ నెల 16 వరకు ఆ భూములలో ఎలాంటి పనులూ చేపట్టకూడదని మాత్రమే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఈ లోపుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమకు సమగ్ర నివేదిక అందివ్వాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు, వ్యాఖ్యలు పర్యావరణ ప్రియులతో పాటు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించే వారికి సంతోషాన్ని కలిగించాయి. అయితే ఆయా కేసుల విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయా? లేక కీడు చేస్తాయా? అన్న దానిపై న్యాయవాద వర్గాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చట్టాలను మాత్రమే సమీక్షించాలా? లేదా వ్యక్తిగత అభిప్రాయాలను కూడా జోడించవచ్చా? అన్న దానిపై కూడా న్యాయ నిపుణులలో కొంత కాలంగా చర్చ జరుగుతోంది. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు తుది తీర్పు లేదా ఆదేశాలలో భాగం కావడం లేదు. అయినప్పటికీ, మీడియాలో వాటికి విశేష ప్రచారం లభిస్తుండటంతో సామాన్య ప్రజానీకం ప్రభావితం అవుతున్నారు. సదరు వ్యాఖ్యలను తీర్పులలో భాగంగానే చూస్తున్నారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ విశిష్టతకు నష్టం చేస్తుందన్న అభిప్రాయం బలంగా ఉంది. కేసులను సుమోటోగా తీసుకుంటున్న విషయంలో కూడా ప్రజలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కంచ గచ్చిబౌలి వ్యవహారాన్ని సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా తీసుకుంది. ప్రతివాది అయిన ప్రభుత్వం అభిప్రాయం కూడా తెలుసుకోకుండా తదుపరి పనులపై ఈ నెల 16 వరకు స్టే విధించింది. సదరు భూములలో చెట్లు కొట్టివేయడానికి పర్యావరణ శాఖ నుంచి అనుమతి పొందారా? అని కూడా సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. నిజమే– అమలులో ఉన్న చట్టం ప్రకారం చెట్లు కొట్టివేయాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. అయితే, ఏ సందర్భంలో కూడా ప్రభుత్వాలు ఇలాంటి అనుమతులు పొందడం లేదు. గతంలో జాతీయ రహదారుల నిర్మాణం సందర్భంగా చెట్లు నరికివేయడంపై సుప్రీంకోర్టు స్పందించింది. అప్పుడు కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయాన్ని ఆ తర్వాత అందరూ మరచిపోయారు. ఇలాంటి చట్టం ఒకటి ఉందని చాలా మంది ప్రభుత్వ అధికారులకు కూడా తెలియదు. తెలిసినా పట్టించుకోరు. అందుకే వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు విద్యుత్ శాఖ అధికారులు రహదారులకు ఇరువైపులా ఉండే చెట్ల కొమ్మలను అడ్డదిడ్డంగా నరికి వేస్తుంటారు. ఇది సర్వసాధారణం. పర్యావరణ శాఖ అధికారులు కూడా చట్టం అమలు గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఏ హైకోర్టో లేదా సుప్రీంకోర్టో స్పందించినప్పుడు మాత్రమే అది ఒక వార్త అవుతోంది. న్యాయస్థానాలు కూడా ఎప్పుడో ఒకసారి స్పందిస్తుంటాయి.

జగన్ హయాంలో పచ్చదనంపై వేటు

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన పర్యటనకు బయలుదేరిన ప్రతిసారీ రహదారులపై చెట్లను నరికిపారేసేవారు. ఈ వ్యవహారంపై మీడియాలో పుంఖాను పుంఖాలుగా వార్తలు వచ్చాయి. అయినా ఏ న్యాయస్థానమూ పట్టించుకోలేదు. పర్యావరణ ప్రియులు కూడా స్పందించలేదు. రహదారులపై ఉన్న చెట్లను ముఖ్యమంత్రి భద్రత పేరిట నరికివేయడం తప్పు కాదన్నట్టుగా అధికారులు భావించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లలేదు కాబోలు! అప్పుడు ఏ న్యాయమూర్తి కూడా సుమోటోగా విచారణ చేపట్టలేదు. విశాఖపట్నంలో రుషికొండను నిబంధనలు పాటించకుండా ముఖ్యమంత్రి నివాసం కోసం బోడిగుండుగా మారుస్తున్నారని, సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. అప్పుడు సుప్రీంకోర్టు ఇంత వేగంగా స్పందించలేదు. ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా రుషికొండను తవ్వుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవడానికి మాత్రం ఒక కమిటీని నియమించింది. మామూలుగా ఇలాగే జరుగుతుంది. కానీ, కొన్ని సందర్భాలలో మాత్రం న్యాయస్థానాలు ఇప్పటిలా స్పందిస్తాయి. అంటే, ధర్మాసనంలో కూర్చున్న వారిని బట్టి కొన్నిసార్లు ఇన్‌స్టంట్ న్యాయం లభిస్తుందన్న మాట! న్యాయస్థానాల్లో న్యాయ సమీక్ష మాత్రమే జరగాలన్నది విస్తృత అభిప్రాయం. సర్వోన్నత న్యాయస్థానానికి మన రాజ్యాంగం కొన్ని విశేష అధికారాలు కల్పించింది. అదే సమయంలో సమాజ హితం దృష్టిలో పెట్టుకోవాలని సూచించింది. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు మాత్రమే అమలవుతాయి. న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలు ప్రజలపై అనుకూల, ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. తాజా వివాదంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. ఆమె కెరీర్ ఆసాంతం వివాదరహితంగా సాగింది. గతంలో ఏ హోదాలో కూడా ఆమె కోర్టు ధిక్కరణకు పాల్పడిన రికార్డు లేదు. తన పనేదో తాను చేసుకుపోతుంటారు. అలాంటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేయడం సముచితమా? లేదా? అన్నది న్యాయ వ్యవస్థ ఆలోచించుకోవాలి. నిబంధనలు, చట్టాల ఉల్లంఘన జరిగినప్పుడు న్యాయ వ్యవస్థ మౌనంగా ఉండకూడదు. అలా అని వివాదం పూర్వాపరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందా? లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. కంచ గచ్చిబౌలి వద్ద ఉన్న చెరువు సమీపంలో నిర్మించే తాత్కాలిక జైలుకు వెళతారు అని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హెచ్చరించింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదేశాలను పాటించని పక్షంలో అక్కడ కొత్తగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోసం జైలును నిర్మించాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తున్నదా? అలా ఆదేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉంటుందా? సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు తుది ఆదేశాలలో లేకపోవడం గమనార్హం.

వ్యాఖ్యలు.. వివాదాలు!

ఏదేమైనా తుది ఆదేశాలలో, తీర్పులలో కనిపించని వ్యాఖ్యలను విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేయడంపై చాలా కాలంగా అభ్యంతరాలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఈ వ్యాఖ్యలు పరిధి దాటుతున్నాయి. కానీ, సామాన్య ప్రజలు మాత్రం ఆ వ్యాఖ్యలను న్యాయస్థానాల తీర్పులో భాగంగానే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ, విశ్వసనీయత మసకబారిపోయే ప్రమాదం లేకపోలేదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటానికి న్యాయస్థానాలే చొరవ తీసుకోవాలి.

> **న్యాయమూర్తుల వ్యాఖ్యలు కొన్ని సందర్భాలలో పరిధి దాటుతున్నాయి. సామాన్య ప్రజలు మాత్రం ఆ వ్యాఖ్యలను న్యాయస్థానాల తీర్పులో భాగంగానే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ, విశ్వసనీయత మసకబారిపోయే ప్రమాదం లేకపోలేదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటానికి న్యాయస్థానాలే చొరవ తీసుకోవాలి.**

అసలు వివాదం...

ఇప్పుడు కంచ గచ్చిబౌలి భూముల పూర్వాపరాల్లోకి వద్దాం! ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐఎంజీ భారత్ అనే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాలను తీసుకుంది. ఈ 400 ఎకరాలకు బదులుగా మరోచోట 397 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ వర్సిటీకి కేటాయించింది. అంటే ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ఈ 400 ఎకరాలతో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేదనుకోవాలి. ఇక చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూములు కూడా వివాదంలో చిక్కుకున్నాయి. చంద్రబాబు తర్వాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ భూముల కేటాయింపుపై విచారణకు ఆదేశించింది. దీంతో ఆ వ్యవహారం అటకెక్కింది. ఆ తర్వాత ఐఎంజీ సంస్థకు కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ వివాదం న్యాయస్థానానికి చేరుకుంది. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత సదరు భూమి ప్రభుత్వానికే చెందుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ప్రస్తుతం వివాదంగా మారిన 400 ఎకరాలను వనరుల సమీకరణలో భాగంగా విక్రయించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ఈ సందర్భంగా ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరించడం వల్ల వివాదం ముదిరింది. విక్రయించాలనుకున్న 400 ఎకరాల చుట్టూ ముందుగా ఫెన్సింగ్ వేసి భూమిని ప్రభుత్వం తన ఆధీనంలోకి తెచ్చుకొని ఉండాల్సింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఈ భూములపై వివాదం నడవడం వల్ల అందులో చెట్లు పెరిగాయి. దీంతో వన్యప్రాణులు కూడా అక్కడ చేరాయి. ఏ భూమి అయినా నిరుపయోగంగా పడి ఉంటే అడవిలా మారడం సహజం. ఈ భూమిని విక్రయానికి అనుగుణంగా చదును చేయాలనుకున్న అధికార యంత్రాంగం అందులో వన్యప్రాణులు ఉన్నాయా? లేవా? అన్నది ముందుగా నిర్ధారించుకోవాల్సింది. అలా చేయకుండా హడావిడిగా డజన్లకొద్దీ జేసీబీలతో భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే పెరిగి ఉన్న చెట్లను కూల్చివేశారు. నిజానికి హైదరాబాద్ నగరంలో జింకలు, నెమళ్లకోసం ప్రత్యేక పార్కులు ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి పార్కులో వందల సంఖ్యలో నెమళ్లు ఉన్నాయి. జింకలకోసం వనస్థలిపురం, మొయినాబాద్ రోడ్డు ప్రారంభంలో, రింగు రోడ్డు సమీపంలో మరో పార్కు ఉంది. వివాదాస్పద భూముల్లో జింకలు, నెమళ్లు ఉన్న విషయం నిజమైతే వాటిని ఈ పార్కులకు తరలించి ఆ తర్వాత భూమిని చదును చేసి ఉండాల్సింది. అలా కాకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరించడం వల్ల వివాదం ఇంతదూరం వచ్చింది. చివరకు సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.

పథకాల కోసం అమ్మకాలు

ఇక భూముల అమ్మకం సమర్థనీయమా? కాదా? అంటే ఎవరి వాదన వారికి ఉంటోంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగా మాట్లాడటం మన రాజకీయ పార్టీలకు పరిపాటే. హైదరాబాద్‌లో అభివృద్ధి పనులకోసం భూములను అమ్మే ప్రక్రియకు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. అప్పుడు ఇళ్ల స్థలాలను మాత్రమే విక్రయించారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూములు విక్రయించారు. తర్వాత రాష్ట్రం విడిపోయి కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఆయన హయాంలో సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వ భూములను విక్రయించారు. ఈ విధంగా వందల, వేల కోట్ల రూపాయలు సమీకరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎన్నికల సందర్భంగా ఇస్తున్న అలవికాని హామీల అమలుకోసం ప్రభుత్వ భూములను విక్రయించడం వాంఛనీయం కాదు. అయినా అన్ని పార్టీలకూ ఈ పాపంలో భాగం ఉంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ 400 ఎకరాలను విక్రయించడాన్ని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిజానికి కేసీఆర్ హయాంలో ఈ భూముల వివాదం పరిష్కారమై ఉంటే అప్పుడే సదరు భూమిని వేలం వేసేవారు. విశ్వవిద్యాలయాలకు వందల వేల ఎకరాలు అవసరమా? మనం రాచరికంలో ఉన్నామా? అని అప్పట్లో కేసీఆర్ ప్రశ్నించారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇకనైనా ఇలాంటి సున్నితమైన విషయాలలో ఆచితూచి వ్యవహరించాలి. లేనిపక్షంలో ప్రతిపక్షాల చేతికి ఆయుధాలు ఇచ్చిన వారవుతారు. ప్రభుత్వం అమ్మాలనుకుంటున్న ఈ 400 ఎకరాలను ఎవరూ కొనవద్దని, కాదూ కూడదూ అని ఎవరైనా కొంటే తాము మూడేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చాక స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించిన తర్వాత దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని ఆయనకు తెలియదా? ఐఎంజీ భారత్‌కు కేటాయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి 25 సంవత్సరాలు పట్టిన విషయం మరచిపోతే ఎలా? కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కోకాపేట వద్ద పెద్ద మొత్తంలో భూములు విక్రయించారు. అప్పుడు ఈ అమ్మకాన్ని ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అలా అని సదరు భూముల్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకోగలదా? తాము చేసేది సంసారం– ఇతరులు చేసేది వ్యభిచారం అన్నట్టుగా రాజకీయ పార్టీలు వ్యవహరించడం వల్లనే ప్రతిదీ వివాదం అవుతోంది. దీంతో ప్రజలు కూడా ఏది మంచి? ఏది చెడు? ఏది న్యాయం? ఏది అన్యాయం? అనేది తేల్చుకోలేక స్పందించడం మానేశారు.



'ట్రంపరి తనం'...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయమే తీసుకుందాం. ఆయన ఒక అగ్ర దేశాధినేతగా కాకుండా ఫక్తు రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. సుంకాల విషయంలో ఆయన తన రాజకీయ జాణతనాన్ని ప్రదర్శిస్తున్నారు. వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ఆయన ఎడా పెడా సుంకాలు విధిస్తున్నారు. నిజానికి ఈ సుంకాల భారాన్ని అమెరికన్లే భరించాలి. దిగుమతి అయ్యే వస్తువుల ధరలు పెరిగితే ఆ భారం ప్రజలపైన పడుతుంది కదా? అయితే తన చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా 'అమెరికాకు విముక్తి కల్పిస్తున్నాను. దోపిడీ నుంచి కాపాడుతున్నాను' అని డొనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తున్నారు. అమెరికన్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులు కొనుగోలు చేస్తున్న దేశాలు అధిక పన్నులు వసూలు చేస్తున్నది వాస్తవమే. దీనివల్ల ఆయా దేశాల్లో వాటి ధరలు అధికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. స్వదేశీ కంపెనీలను కాపాడుకోవడానికి ఆయా దేశాలు ఈ పన్నుల శాతాన్ని నిర్ణయిస్తాయి. ఒకప్పుడు మన దేశంలో రక్షిత ఆర్థిక వ్యవస్థ ఉండేది. అప్పుడు స్వదేశీ కంపెనీలు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టలేదు. తర్వాత స్వేచ్ఛా వాణిజ్య విధానం అమలులోకి వచ్చింది. అంబాసిడర్ కారునే ఉదాహరణగా తీసుకుందాం! రక్షిత ఆర్థిక విధానం అమలులో ఉన్నప్పుడు దేశ ప్రజలకు అంబాసిడర్ కారు మాత్రమే దిక్కుగా ఉండేది. కార్లను దిగుమతి చేసుకోవాలంటే 300 శాతానికి పైగా పన్ను చెల్లించాల్సి వచ్చేది. స్వేచ్ఛా వాణిజ్య విధానం అమల్లోకి వచ్చాక అంబాసిడర్ కార్లు టెక్నాలజీ విషయంలో దిగుమతి చేసుకున్న కార్లతో పోటీపడలేక కనుమరుగయ్యాయి. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగితే పెరగవచ్చుగానీ ప్రజల జేబుకు చిల్లు పడుతుంది. ఫార్మా ఎగుమతులపై కూడా సుంకాలు వేయబోతున్నట్టు ట్రంప్ తాజాగా ప్రకటించారు. పర్యావరణ చట్టాల కారణంగా అమెరికా వంటి దేశాలలో మందుల కంపెనీలు ఆయా ఉత్పత్తులను చేపట్టలేని స్థితి. ఈ కారణంగానే మన దేశంలో ఫార్మా రంగం అభివృద్ధి చెందింది. ఫార్మా ఉత్పత్తుల వల్ల నీరు, భూమి కలుషితం కాకుండా కాపాడుకున్నందుకుగాను అమెరికా ప్రభుత్వం ఇప్పటి వరకు ఫార్మా కంపెనీలపై తక్కువ పన్నులు విధించింది. ఇప్పుడు సుంకాలు పెంచితే దాని భారం ప్రజలే భరించాలి. ఈ చర్యలన్నీ అంతిమంగా అమెరికాకు నష్టం చేయవచ్చు. అయితే, తన నిర్ణయాల వల్ల అన్ని దేశాలు దారికొస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రపంచంలో అత్యధిక దేశాలు అమెరికాను తమ పెద్దన్నగా గుర్తించి గౌరవించడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో సుంకాలు తక్కువగా విధించడం కూడా ఒక కారణం. వివిధ రూపాలలో అమెరికా నుంచి సహాయం పొందుతున్న దేశాలన్నీ అమెరికాను పెద్ద దిక్కుగా అంగీకరించాయి. ఇప్పుడు అమెరికాకు పోటీగా చైనా ఎదుగుతోంది. ట్రంప్ చర్యల వల్ల వాణిజ్య యుద్ధం ముదిరితే ఇప్పటి వరకు అమెరికా పంచన ఉన్న దేశాలు చైనా వైపు చూసే అవకాశాలు లేకపోలేదు. ట్రంప్ విధించిన సుంకాలకు పోటీగా చైనా కూడా 34 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ చర్య కూడా అమెరికన్లకు నష్టం కలిగిస్తుంది. ట్రంప్ చర్యల వల్ల ఆయనకు బలమైన మద్దతుదారుగా ఉన్న ఎలాన్ మస్క్ కూడా భారీగా నష్టపోతున్నారు.

> **డొనాల్డ్ ట్రంప్ తీరు చూస్తుంటే ఆయన మన దేశంలోని రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరని పిస్తోంది. ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం మన రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అదే విధానం అందిపుచ్చుకున్నారు. నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ మేడిపండు చందంగా ఉంది. దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తున్నానంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే ప్రయత్నం ట్రంప్ చేస్తున్నారు. తాము ఇంతకాలం నిజంగానే దోపిడీకి గురయ్యామని అమెరికన్లు ఆయన ప్రచారాన్ని నిజంగా నమ్మితే భవిష్యత్తులో తమపై పడబోతున్న భారాన్ని ఇప్పట్లో గుర్తించలేరు. చాలామంది ట్రంప్‌ను 'మెంటల్' అని నిందిస్తున్నారు. అయితే ఆయన పిచ్చివాడు కాదు. ఫక్తు రాజకీయ నాయకుడి అవతారం ఎత్తారు. ట్రంప్ చర్యలు అంతిమంగా అమెరికాకు మంచి చేస్తాయా? కీడు చేస్తాయా? అన్నది కాలమే చెప్పాలి.**

పిచ్చితనం కాదు... అది రాజకీయం!

డొనాల్డ్ ట్రంప్ తీరు చూస్తుంటే ఆయన మన దేశంలోని రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరనిపిస్తోంది. ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం మన రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అదే విధానం అందిపుచ్చుకున్నారు. నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ మేడిపండు చందంగా ఉంది. దోపిడీ నుంచి విముక్తి కల్పిస్తున్నానంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే ప్రయత్నం ట్రంప్ చేస్తున్నారు. తాము ఇంతకాలం నిజంగానే దోపిడీకి గురయ్యామని అమెరికన్లు ఆయన ప్రచారాన్ని నిజంగా నమ్మితే భవిష్యత్తులో తమపై పడబోతున్న భారాన్ని ఇప్పట్లో గుర్తించలేరు. చాలా మంది ట్రంప్‌ను 'మెంటల్' అని నిందిస్తున్నారు. అయితే ఆయన పిచ్చివాడు కాదు. ఫక్తు రాజకీయ నాయకుడి అవతారం ఎత్తారు. మన నాయకుల వలె ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి పిచ్చివాళ్లను చేస్తున్నారు. ట్రంప్ చర్యలు అంతిమంగా అమెరికాకు మంచి చేస్తాయా? కీడు చేస్తాయా? అన్నది కాలమే చెప్పాలి. ఆయన మొదలెట్టిన వాణిజ్య యుద్ధం ముదిరితే అది ప్రపంచ మానవాళిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే వివిధ దేశాల స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. అమెరికా మార్కెట్లు కూడా నష్టపోతున్నాయి. ఈ పతనం ఇలాగే కొనసాగితే బ్యాంకింగ్ వ్యవస్థ కూడా కుప్పకూలుతుంది. అప్పుడు ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టే ప్రమాదం ఉంది. అమెరికా ఇప్పటికే ఆర్థిక మాంద్యం అంచున ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం వేరు, వ్యాపారం వేరు. వ్యాపారులు లాభాలు మాత్రమే చూస్తారు. ప్రభుత్వాధినేతలు ప్రజల హితాన్ని చూస్తారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్, మస్క్ వంటి వ్యాపారవేత్తలు అధికారంలోకి వచ్చారు. అందుకే వారు ప్రతి దానినీ లాభాల కోణంలోనే చూస్తున్నారు. అగ్ర రాజ్యంగా తాము చెలామణి అవడానికి కారణాలు ఏమిటి? అగ్రరాజ్యం బాధ్యతలు ఏమిటి? అని గుర్తించలేకపోతున్నారు. అమెరికా తన విధానాలను సవరించుకోని పక్షంలో ఇప్పటి వరకు మిత్ర దేశాలుగా ఉన్నవారు సైతం శత్రు దేశాలుగా మారే ప్రమాదం లేకపోలేదు. అదే సమయంలో ప్రస్తుతం అమెరికాకు ప్రత్యర్థిగా ఉన్న చైనా కొత్త మిత్రులను చేరదీసి మరింత బలపడవచ్చు. అమెరికా భవిష్యత్తు మాత్రమే కాదు, ప్రపంచ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నది డొనాల్డ్ ట్రంప్ చేతుల్లోనే ఉంది!

తెలుగు బొమ్మలో తెలంగాణ శోభ

'నా పల్లె నా కాన్వాసు, నా ప్రజలే నా వస్తువు, వాళ్ల జీవనమే నా ప్రేరణ, ఈ ప్రకృతే నాకు గురువు, నా సమాజాన్ని, సంస్కృతిని, దేశాన్ని, విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం'– 1945లో హైదరాబాద్‌లో ఒక చిత్రకళా ప్రదర్శనలో యువ రాజయ్య వ్యక్తం చేసిన మనోరథమది. ఆ మాటలను ఆయన తదనంతర జీవితమంతా నిజం చేసి చూపించారు. తెలంగాణ సంస్కృతి అన్నా, జీవనశైలి అన్నా, సంప్రదాయం అన్నా, బోనాలన్నా, బతుకమ్మ అన్నా ముందుగా గుర్తుకు వచ్చేది రాజయ్య జానపద చిత్ర రాజాలే.

జానపద చిత్రాలను సాధారణంగా పురాణాలు, ఇతిహాసాలతో చిత్రిస్తారు. రాజయ్య మాత్రం అందుకు పూర్తి భిన్నంగా తెలంగాణ తెలుగు సంస్కృతిని, కాన్వాస్‌పై ప్రాథమిక రంగుల్లో ఆవిష్కరించారు. స్వస్థలమైన సిద్దిపేట గ్రామీణులు, వారి వృత్తులు, ఉత్సవాలు, పండుగలకు సమకాలీనతను తన చిత్రాల్లో చూపించారు. తెలంగాణ సంస్కృతిని తన చిత్రాలతో విశ్వవ్యాప్తం చేశారు. రాజయ్య అంటే తెలంగాణ చిత్రం, తెలంగాణ అంటే రాజయ్య అనే విధంగా ఆయన సృజన వర్ధిల్లింది.

సిద్దిపేటలో ఒక నిరుపేద కుటుంబంలో 1925, ఏప్రిల్ 7న జన్మించిన రాజయ్య చిన్నతనంలో మట్టి ముద్దలతో బాతులు, ఎద్దులు వంటి బొమ్మలు చేసేవారు. పాఠశాలలో 7వ తరగతి చదివేటప్పుడు రాజయ్యను ఒక టీచర్ బాంబే ప్రభుత్వం నిర్వహించే ఇంటర్మీడియట్ డ్రాయింగ్ పరీక్షలకు పంపించారు. తర్వాత కుబేరుడు అనే డ్రాయింగ్ టీచర్ హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ స్కూల్ అఫ్ ఆర్ట్స్ క్రాఫ్ట్‌లలో ఐదేళ్ల పెయింటింగ్ డిప్లొమాలో చేర్పించారు.

సంగారెడ్డి మిడిల్ పాఠశాలలో 1947లో రాజయ్య డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. చిత్రకళ పట్ల ఆసక్తి చూపిన వారిని డ్రాయింగ్ పరీక్షలకు పంపి వారిని చిత్రకారులుగా, చిత్రకళోపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ఆయన చిత్రరచన ప్రధానంగా మూడు దశలుగా జరిగింది. ప్రారంభంలో చిత్రకళ నేర్చుకున్నప్పుడు అందరిలా కాగితాలపై వాష్ టెక్నిక్‌లో చిత్రాలు గీశారు. 1960 నుంచి టెంపరరీ రంగులు అలవాటు చేసుకున్నారు. 1970 నుంచి అంతర్జాతీయ మీడియం అయిన నూనె రంగులు వాడకం ప్రారంభించారు. రాజయ్య చిత్రరచన ఏ మీడియంలో కొనసాగినా తన సంస్కృతిని, మూలాల్ని మర్చిపోలేదు. పేపర్లు, రంగులు మార్చారు గాని భావం, చిత్రీకరణలను, తనదైన జానపదాన్ని వీడలేదు. అదేవిధంగా నీటి రంగుల నుంచి నూనె రంగులకు మారినా ప్రాథమిక రంగులే కొనసాగించారు. రంగుల శోభ, లావణ్యం, మృదుత్వం, సహజత్వం ఆయన ప్రత్యేకత. వెలుగు నీడలు ఆయన చిత్రాల్లో ఉండవు.

> **తెలంగాణ సంస్కృతి అన్నా, జీవనశైలి అన్నా, సంప్రదాయం అన్నా, బోనాలు అన్నా, బతుకమ్మ అన్నా ముందుగా గుర్తుకు వచ్చేది రాజయ్య చిత్రాలే. రంగుల శోభ, లావణ్యం, మృదుత్వం, సహజత్వం ఆయన సృజనాత్మక ప్రత్యేకత.**



తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో విరివిగా సంచరించడం, పల్లె ప్రజల జీవనశైలిని సన్నిహితంగా పరిశీలించడం వల్ల రాజయ్య చిత్రాల్లో సహజత్వం కనబడుతుంది. ఆయన చిత్రాలు చూస్తే తెలంగాణ పల్లెలో ఉన్న అనుభూతి కలుగుతుంది. పెళ్ళి వేడుకలకు సంబంధించిన చిత్రాలు ఆయన సూక్ష్మ పరిశీలనకు నిలువెత్తు నిదర్శనం. 'నా చిత్రకళకు పట చిత్రకళే ప్రేరణ' అని ఆయన తరచు చెప్పేవారు.

రాజయ్య సృజించిన 'బోనాలు' ముఖచిత్రంగా ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ మ్యాగజైన్ 'స్టూడియో లండన్' ఒకసారి వెలువడింది. ఆ సంచికలో ప్రముఖ చిత్రకళా విమర్శకులు ఎ.ఎస్. రామన్ రాజయ్య చిత్రకళ విశిష్టత గురించి ఒక విపుల వ్యాసం రాశారు. 'దేశ కాలాపేక్ష లేని, శాశ్వతమైన, సార్వజనీనమైన, లోకంలో ఏ శక్తి అంతరింప చేయలేని, నిత్య నూతన సౌందర్యం కోసం అన్వేషిస్తున్న రాజయ్యకు తన చుట్టూవున్న జానపద రూపాల్లోనూ, జాతీయాల్లోనూ అలాంటి శాశ్వత సౌందర్యం సాక్షాత్కరించింది' అని రామన్ ప్రశంసించారు.


రాజయ్య చిత్రించిన చిత్రాల్లో బతుకమ్మ, పంటపొలాలు, శ్రమజీవులు, రిస్కీ లైఫ్, ముస్తాబు, నీలి భాగవతం, అంపశయ్యపై భీష్ముడు, జీవాత్మ పరమాత్మ వైపు తదితరాలు ఆయనకు అత్యంత ఇష్టమైనవిగా చెప్పుకున్నారు. వేంకటేశ్వర స్వామిపై ఆయన పాతికకు పైగా చిత్రాలు సృజించారు. రిస్కీలైఫ్ చిత్రానికి జాతీయ అవార్డు లభించింది. సిద్దిపేటలోనే ఆయన మూడున్నర దశాబ్దాల పాటు చిత్రకళోపాధ్యాయుడుగా పనిచేశారు. 1963లో లలితకళా సమితిని ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహించి, ఔత్సాహికుల్ని విరివిగా ప్రోత్సహించారు. 1956–88 సంవత్సరాల మధ్య హంగేరీ, బల్గేరియా, రొమేనియా, చెకొస్లోవేకియా, ఆస్ట్రేలియా, క్యూబా, మెక్సికో, రష్యా, ఇటలీ, బ్రిటన్ తదితర దేశాలలో నిర్వహించిన ఆయన చిత్రకళా ప్రదర్శనలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజయ్య సృజన జీవన వ్యాసంగాలు తెలంగాణాకు మాత్రమే పరిమితం కాలేదు. విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, వెల్లటూరు తదితర ప్రాంతాలలో జరిగే చిత్రకళా ప్రదర్శనలకు హాజరై యువ, బాల చిత్రకారులను ప్రోత్సహించేవారు. కేంద్ర లలితకళా అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా రాజయ్య మా విశాఖ చిత్రకళా పరిషత్‌కు సహాయ సహకారాలు అందించారు. పరిషత్ పునరుద్ధరణకు, ఇంకా చిత్రకళా రత్నాలు, చిత్రకళా చరిత్ర, వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు తదితర గ్రంథాల ముద్రణకు, సింహాచలం, భీమిలి, కోణార్క్ తదితర ప్రాంతాలలో వర్కుషాపుల నిర్వహణకు లలితకళా అకాడమీ గ్రాంట్లు ఇప్పించడానికి సహకరించారు. 'కుంచెపదాలు' కవిగా ఆయన కవిలోకంలో కూడా ప్రసిద్ధులు. 2013లో 9వ తరగతి తెలుగు ఉపవాచకంలో స్ఫూర్తిదాతలు పేరిట ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. 1978లో ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ వీరి కళాజీవితాన్ని మోనోగ్రాఫ్‌గా ప్రచురించింది.. సిద్దిపేట ప్రజలు 2019లో తమ ఊరికి గర్వకారణమైన రాజయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆయన పట్ల తమ గౌరవాదరాలు చాటుకున్నారు. రాజయ్య 2012, ఆగస్టు 20న తన 87వ ఏట మరణించారు. ఆయన కళాకృతులు జాతి ఆస్తులు. వాటిని సేకరించి భద్రపరచాలి.

▪ సుంకర చలపతిరావు

(ఏప్రిల్ 7: కాపు రాజయ్య శతజయంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025



ఇగోలు వద్దు

ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవద్దు

నేను అన్నీ గమనిస్తున్నా.. నాకన్నీ తెలుసు

'నాకేం తెలియదు.. నేనేం చూడట్లేదని అనుకోవద్దు. మీరేం చేస్తున్నారో నాకు ఎప్పటికప్పుడు రిపోర్టు వచ్చేస్తుంది. నాకు కార్యకర్తలే ముఖ్యం. ఇగోలను పక్కన పెట్టండి. ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుని పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దు. ఎవరేమిటన్నది నా దగ్గర సమాచారం ఉంది. అవినీతిని సహించను. ప్రజలు మనల్ని గమనిస్తూ ఉంటారు. మనం ఏం చేస్తున్నామో పరిశీలిస్తూ ఉంటారు. సామాజిక న్యాయం చేస్తున్నామా లేదా? మంచి పనులు చేస్తున్నామా లేదా? మనం ఎలా ఉంటున్నామనేదీ ప్రతీదీ చూస్తారు. అంచనా వేస్తారు. కాబట్టి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు. నియోజకవర్గంలో అన్ని తరగతుల వారు ఓట్లు వేస్తేనే విజయం సాధించామన్నది గుర్తు పెట్టుకోవాలి. అసెంబ్లీయే కాదు పార్లమెంట్ నియోజకవర్గాలపై కూడా దృష్టిపెడతా..' అని సీఎం చంద్రబాబు నందిగామ నియోజకవర్గ పార్టీ నేతలను సుతిమెత్తగా హెచ్చరించారు.

- పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- కార్యకర్తలంటేనే నాకు ఎక్కువ ప్రేమ
- నాయకులు అటూ ఇటూ పోయినా..
- కార్యకర్తలు పార్టీని భుజాన వేసుకుంటారు
- ఇక 2029 ఎన్నికల కోసం పనిచేయండి
- పార్లమెంట్ నియోజకవర్గాలపైనా దృష్టి
- నందిగామ కార్యకర్తలు, నేతలతో సీఎం చంద్రబాబు
- పార్టీ నాయకులకు సుతిమెత్తగా క్లాస్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/చందర్లపాడు) : కార్యకర్తలపైనే తనకు అభిమానం ఉంటుందని, నాయకులు అవకాశవాదంతో ఉంటారని, వారు అటూ ఇటూ మారినా.. కార్యకర్తలు మాత్రం పార్టీని భుజాలకెత్తుకుని పనిచేస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల వచ్చిన ఆయన మిగతా 6లో..

గెలిచాక పనిచేయకపోతే ఎలా..?

2024 ఎన్నికల్లో అందరూ పనిచేశారని, మంచి ఫలితాలు వచ్చాయని, గెలిచాక పనిచేయటం తగ్గించారని చురకలు అంటించారు. నందిగామ నియోజకవర్గంలో ప్రజలకు అందాల్సినవి అందుతున్నాయని, అర్జీలు కూడా పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు.





సీఎంను చూసిన ఆనందంలో మహిళల సందడి, జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య, లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు



మీ వెంటే మేమూ..
గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి నడుస్తున్న సీఎం చంద్రబాబు

ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకానికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ పథకానికి మరమ్మతులు చేసేందుకు సీఎం చంద్రబాబు నిధులు కేటాయించడంపై నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదికలో పాల్గొన్న సీఎం కీలకమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పాటు పీ4 కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ల అభివృద్ధికి ముఖ్యమైన సూచనలు చేయడంపై హర్షం వ్యక్తమైంది.

వరాల జల్లు

వేదాద్రి-కంచెల ఎత్తిపోతలకు ఇక విముక్తి

రూ.15 కోట్లు మంజూరుచేసిన సీఎం చంద్రబాబు

- మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశాలు
- ఇకపై ఎత్తిపోతల బాధ్యతలు రైతు సంఘాలకు..
- ఏటూరు-మోగులూరు వద్ద మునేటిపై కాజ్‌వే నిర్మాణం
- ఏనుగుగడ్డ వాగుపై వంతెనల నిర్మాణానికీ నిధులు
- సుబాబుల్, మిర్చి సమస్యలు పరిష్కారిస్తామని హామీ
- పీ4 కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ల అభివృద్ధికి ప్రణాళిక

చందర్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.15 కోట్లు మంజూరు చేశారు. మెట్ట రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు చూపుతో గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పథకం మూలన పడటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు పట్టించుకోలేదని, ఒక్కపైసా కూడా కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. సాగునీటి ఎత్తిపోతల పథకాలను మూలనపెట్టారని మిగతా 6లో..





ప్రజావేదిక సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) ముప్పాళ్లలో కోండ్రు వెంకటేశ్వరరావు ఇంట్లో కాఫీ కాస్తున్న సీఎం

గురుకుల పాఠశాల సందర్శన

6లో

వెనుకబడిన వర్గాల అభివృద్ధే పీ4 లక్ష్యం

- ఎంపీ శివనాథ్ వెల్లడి

ప్రజాబలం ఉన్నవాళ్లే నాయకులు

- ఎమ్మెల్యే కాలికపూడి శ్రీనివాసరావు

6లో

అహంకారం ఉంటే ప్రజలు దూరమవుతారు

- టీడీపీ నాయకుడు శావల దేవదత్
- జగ్జీవన్‌రామ్ జయంతిలో ఎమ్మెల్యే కార్యక్రమానికి నాయకుల డుమ్మా
- ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణ

ఓఆర్ఆర్ కోసం గ్రామాల ఎఫ్ఎంబీల సేకరణ

8లో





కల్యాణ వైభోగమే..

సీతారాముల కల్యాణ మహోత్సవానికి జిల్లా ముస్తాబైంది. పలు ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి సీతారాముల కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని బీసెంట్ రోడ్డును అందంగా అలంకరించారు. చలువ పందిళ్లతో పాటు విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కల్యాణ వేదిక సిద్ధమైంది.

ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు

టెండర్లు ఖరారు

చంద్రబాబు నివాసంలో 46వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం

- అసెంబ్లీ పనులు ఎల్అండ్‌టీ, హైకోర్టు పనులు ఎన్‌సీసీకి..
- ఎల్‌వోఏలు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు అనుమతి

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. అసెంబ్లీ నిర్మాణ పనులను ఎల్అండ్‌టీ, హైకోర్టు నిర్మాణ పనులను ఎన్‌సీసీ దక్కించుకున్నాయి. ఈ రెండు టెండర్లలో ఎల్-1గా నిలిచిన ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ సంస్థలకు ఎల్‌వోఏ ఇచ్చేందుకు సీఆర్‌డీఏ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ 46వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా రాజధాని అమరావతిలో ఐకానిక్‌గా నిర్మించే అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు పిలిచిన టెండర్లలో ఎల్-1 నిలిచిన సంస్థలకు ఎల్‌వోఏలను ఇచ్చే అంశంపై చర్చ జరిగింది. ఐకానిక్ అసెంబ్లీని.. బేస్‌మెంట్‌తో పాటు జీప్లస్3 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీనికి వ్యూయింగ్ ప్లాట్‌ఫాంలు, పనోరమిక్ వ్యూ వంటివి కూడా ఉంటాయి. మొత్తం 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తారు. దీని ఎత్తు 250 మీటర్లుగా ఉంటుంది. హైకోర్టును.. బేస్‌మెంట్‌తో పాటు జీ ప్లస్ 7 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీని బిల్డప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ఎత్తు 55 మీటర్లుగా ఉంటుంది. ఈ రెండు ఐకానిక్ నిర్మాణాల కోసం పిలిచిన టెండర్లకు సంబంధించి ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ఎల్-1గా నిలిచిన సంస్థలకు ఎల్‌వోఏలు ఇవ్వాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు ముఖ్యమంత్రి ఆదేశించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఇంకా అవసరమైన నిధుల సమీకరణ అంశంపై కూడా అథారిటీ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధులు సమీకరించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతులు ఇస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. చేపట్టాల్సిన మిగిలిన పనులకు కూడా ఎలాంటి నిధుల కొరత రాకుండా త్వరగా ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు చేపట్టేందుకు వీలుగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు అన్ని రకాల అనుమతులను కల్పిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది.

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి మరోసారి పరీక్ష

- పక్షం రోజుల్లో అమరావతికి నిపుణుల బృందం

8లో

పుష్పార్చన



8లో

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న చైత్రమాస వసంత నవరాత్రుల్లో భాగంగా శనివారం దుర్గమ్మకు ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరులు, సన్న జాజులతో అర్చన చేశారు. లలిత సహస్రనామ పారాయణతో ఈ పూజలు జరిగాయి.



రాజీ మేతలు

వివాదాస్పదంగా వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగ సంఘాల నేతల తీరు

- తప్పు చేసిన వారికి వత్తాసుగా రహస్య ఒప్పందాలు
- కొద్దిరోజుల క్రితం ఓ అధికారిపై సంఘంలోని నేత వీరంగం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'ఫిర్యాదులొస్తాయి. అధికారులు విచారణకు ఆదేశిస్తారు. ప్రాథమిక నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటారు. అసలు నివేదిక రాకుండానే రాజీ కథలు సిద్ధమైపోతాయి.' ఇదీ వాణిజ్య పన్నుల శాఖలో జరుగుతున్న కథలు. ఈ కథలు నడపడంలో ఉద్యోగ సంఘాలకు నేతలుగా వ్యవహరిస్తున్న వారు ఆరితేరుతున్నారు. రాజీల కోసం వరుసగా సిట్టింగ్‌లు నిర్వహించి అధికారుల వద్దకు ప్రతిపాదనలు తీసుకెళ్తున్నారు.

నాడు.. నేడు..

నున్న ప్రాంతానికి ఓ మహిళా పారిశ్రామికవేత్తపై గొల్లపూడి సర్కిల్‌లో పనిచేస్తున్న జీఎస్టీవో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ఆ మహిళ అధికారులకు ఫిర్యాదు చేసింది. జీఎస్టీ నెంబరు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మిగతా 6లో..



మురిసిన ముప్పాళ్ల

• ప్రజావేదిక కార్యక్రమం నిర్వహణ • సమస్యలు అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు • అక్కున చేర్చుకుని అభిమానం చాటుకున్న గ్రామస్థులు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాకతో ముప్పాళ్ల గ్రామం మురిసిపోయింది. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికపై గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించిన చంద్రబాబును స్థానికులు అక్కున చేర్చుకుని తమ అభిమానం చాటుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ముప్పాళ్ల గ్రామస్థులు



ముప్పాళ్లలో ప్రజావేదిక సభకు తరలివస్తున్న ప్రజలు

చందర్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణ ప్రసాద్, కొలికిపూడి శ్రీనివాసరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు, ఆర్డీవో బాలకృష్ణ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవి, టీడీపీ నాయకురాలు ఆచంట సునీత, ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మునిసిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబు, డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

జగ్జీవన్‌రామ్‌కు చంద్రబాబు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు ఘనంగా నివాళులర్పించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల ప్రజావేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా యాభై సంవత్సరాలు ఎంపీగా సేవలు అందించటం గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు.

వర్చువల్‌గా ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభం

ముప్పాళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం ముప్పాళ్ల వచ్చిన ఆయన సభా వేదిక వద్ద నుంచి రిమోట్ సాయంతో విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పని చేయాలని కోరారు.

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే సౌమ్య

సీఎం చంద్రబాబు నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కంటతడి పెట్టారు. సభ ప్రారంభించిన సౌమ్య మాట్లాడుతూ తన తల్లి చంద్రబాబు అభిమాని అని, ఆయన పాలనా విధానాలు, నిజాయితీ పట్ల తమకు ఎప్పుడూ చెపుతూ ఉండేదన్నారు. అమ్మ నేడు ఉండి ఉంటే తన అభిమాన నాయకుడి వద్ద ఆమె కుమార్తైన నేను ఎమ్మెల్యేగా ఉండడం చూసి ఎంతో సంతోష పడేదంటూ ఉద్విగ్నానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. ఈ ఘటనతో సభ మొత్తం ఒక్కసారిగా సైలెంట్ అయింది.

దళితుల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం : ఎమ్మెల్యే సౌమ్య

దళితుల అభ్యున్నతి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా 27 పథకాలు అమలు చేస్తున్నట్టు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజావేదిక సభలో ఆమె మాట్లాడుతూ దళితుల ఆరాధ్యదైవం చంద్రబాబు అంటూ కొనియాడారు. బాలయోగి, ప్రతిభా భారతిలను స్పీకర్లుగా చేసి, దళితులను రాజకీయంగా ఉన్నతస్థాయికి తీసుకు వెళ్లారన్నారు. ఉపకులాలకు కూడా రిజర్వేషన్ ఫలాలు అందించాలని, ఆయన ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వటం దళితుల అదృష్టమన్నారు. వైసీపీ విధ్వంసానికి గురైన వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకంతో పాటుగా నియోజకవర్గంలో పలు సమస్యలను ప్రస్తావించి నిధులు కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ముప్పాళ్ల గ్రామం టీడీపీకి కంచుకోటగా ఉందని, ఎన్నికల్లో పార్టీకి 1600 ఓట్లు అత్యధిక మెజార్టీ ఇచ్చిన ముప్పాళ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. సుబాబుల్, విర్రి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రత్యేకంగా చొరవ చూపాలని కోరారు. పెద్దవరం గ్రామంలో ఏపీఐఐసీ ఆధీనంలో 500 ఎకరాల భూములు ఉన్నాయని, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తొమ్మిది నెలల కాలంలో నియోజకవర్గంలో రూ.వంద కోట్ల మేర అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. తాగునీటి పథకానికి, నందిగామ ప్రభుత్వఆస్పత్రి అప్‌గ్రేడ్ చేసి నిధులు కేటాయించి నందుకు ఆమె సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాల సందర్శన

ముప్పాళ్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం పాఠశాలకు చెందిన తొమ్మి దవ తరగతి విద్యార్థినులు వెన్నెల, కార్తీకలతో ఆయన ముచ్చటించారు. వారిని వెంటబెట్టుకొని వెళ్లి పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేశారు. వసతి గదులను, స్టోర్‌రూమ్‌ను సందర్శించారు. పాఠశాల నిర్వహణ, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలసి టీ తాగిన చంద్రబాబు వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫొటోలు దిగారు. ముఖ్యమంత్రి విద్యార్థులు ఆనందంగా గడిపారు. సుమారు గంట పాటు ముఖ్యమంత్రి అక్కడే గడిపారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు



గురుకుల విద్యార్థినులను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వెనుకబడిన వర్గాల అభివృద్ధే పీ4 లక్ష్యం : ఎంపీ శివనాథ్

వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు విప్లవాత్మకమైన పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీ4 గురించి ఢిల్లీ స్థాయిలో అందరూ ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. దేశానికి మార్గదర్శకులైన నలుగురైదుగురు నాయకుల్లో చంద్రబాబు ఒకరని కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో టీడీపీ నడుస్తుందన్నారు. సామాజిక న్యాయం సీఎం ధ్యేయమన్నారు. చంద్రబాబు ఆలోచన 20 సంవత్సరాల ముందుంటుందనటానికి ఐటీ విప్లవం ఒక ఉదాహరణ అని చెప్పారు. హైదరాబాదులో ఐటీతో పాటుగా ఫార్మా రంగాన్ని, కన్‌స్ట్రక్షన్ పరిశ్రమను అభివృద్ధి చేసారని, ప్రత్యేకంగా స్పోర్ట్స్ విలేజ్ నిర్మించారని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో యువత సాఫ్ట్‌వేర్ రంగం వైపు అడుగులు వేయటానికి ఆనాటి చంద్రబాబు ఆలోచనే కారణమన్నారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న చంద్రబాబు నినాదం ఒక విప్లవం తీసుకువచ్చిందన్నారు. ప్రజలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తయారయ్యేందుకు ముందుకు అడుగులు వేస్తున్నారని చెప్పారు. వికసిత్ భారత్ కోసం ఒకవైపు ప్రధాన మంత్రి మోదీ, 2047 స్వర్ణాంధ్ర కోసం మరోవైపు చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఏపీకి ప్రత్యేకంగా ఏ బ్రాండ్ లేకపోయినప్పటికీ బ్రాండ్ సీబీఎన్ ఉందని గర్వంగా చెప్పుకుంటున్నట్టు చెప్పారు. నందిగామ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు.

ఇగోలు వద్దు

(5వ పేజీ తరువాయి)

నందిగామ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులకు ఆయన ర్యాంకులు కేటాయించారు. బూత్ కన్వీనర్ల ర్యాంకులు తగ్గటాన్ని ప్రశ్నించారు. తమను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయట్లేదని పలువురు బూత్ కన్వీనర్లు తెలిపారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. వైసీపీ నుంచి వచ్చిన వారికి సభ్యత్వాలు ఇస్తున్నారని, మళ్లీ వారే పదవుల కోసం పోటీలు పడుతున్నారని, ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తున్న తమకు ఇబ్బందికరంగా ఉంటోందని తెలిపారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ కార్యకర్తల మనోభావాల ప్రకారమే తనతో పాటు పార్టీ కూడా నడుచుకుంటుందన్నారు. మొదటి నుంచీ పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన వారికి ఎప్పుడూ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. నేటి మొదలు.. 2029 ఎన్నికలే లక్ష్యంగా అంతా పనిచేయాలని సూచించారు.

అహంకారమొద్దు.. సమన్వయంతో పనిచేయండి

అనంతరం చంద్రబాబు.. నందిగామ నియోజకవర్గం గురించి కొద్దిసేపు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల్లో కేవలం రెండుసార్లే ఇక్కడ పార్టీ ఓడిపోయిందని, మిగిలిన అన్నిసార్లూ విజయదుందుభి మోగించిందని తెలిపారు. ఆ రెండు సందర్భాల్లోనూ నాయకుల మధ్య సమన్వయం లేకపోవటమే కారణమని చెప్పారు. మనల్ని మనమే ఓడించుకోవటం జరిగిందే తప్ప.. బయటి వారు ఓడించలేదన్నారు. కాబట్టి నియోజకవర్గంలో అందరూ సమన్వయంతో, సమష్టిగా పనిచేయాలని సూచించారు. అహంకారం దరిచేరనివ్వొద్దన్నారు. ఇగోలతో ఉండే వారిని తాను ఉపేక్షించబోనన్నారు. ఈ ఐదేళ్లలో తాను 175 నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్, బూత్‌లవారీగా నాయకుల పనితీరుపై సమీక్షిస్తానని చెప్పారు. పార్టీ కోసం మంచి పనులు చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వటం ద్వారా తగిన గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ కోసం పనిచేయని వారిని పక్కన పెట్టేస్తానన్నారు. ప్రతి ఒక్కరిపై పర్యవేక్షణ ఉంటుందని, గెలిచే అభ్యర్థులకే సీట్లు ఇస్తామన్నారు. గెలవలేని వారిని నిర్దాక్షిణ్యంగా పక్కనపెడతామన్నారు. వచ్చే మహానాడు కడపలో జరుగుతుందని, భవిష్యత్తులో అక్కడ కూడా ఘన విజయం సాధిస్తామన్నారు. అధికారం వచ్చిందన్న ధీమాతో నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దీనివల్ల పార్టీకి నష్టం జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో

నేడు మనగుడి



అర్చకులకు పూజా సామగ్రి అందజేస్తున్న టీటీడీ అధికారి ప్రసాద్

లబ్బీపేట, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఎన్టీఆర్, కృష్ణాజిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నిర్మించిన ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ కృష్ణాజిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మనగుడి కార్యక్రమంలో భాగంగా పలు ఆలయాల అర్చకులకు పూజా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 16 ఆలయాల్లో మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి వచ్చిన కంకణాలు, కుంకుమ, గోవింద నామాలు, మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకం భక్తులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమేతలు

(5వ పేజీ తరువాయి)

రూ.10 వేలు లంచం తీసుకోవడంతో పాటు కార్లో ఎక్కించుకుని అసభ్యంగా ప్రవర్తించాడని ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ప్రాథమిక విచారణ చేయించాక అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆ జీఎస్టీవోను విధుల నుంచి సస్పెండ్ చేశారు. కొద్దినెలల క్రితం జరిగిన ఘటన ఇది. ఉన్నట్టుండి ఉద్యోగ సంఘాల నేతలకు ఈ జీఎస్టీవోపై కనికరం కలిగింది. ఓ ఉద్యోగ సంఘ నేత ఆయనకు న్యాయం చేయాలని కంకణం కట్టుకున్నాడు. నాడు ఫిర్యాదు చేసిన మహిళతో దాన్ని వెనక్కు తీసుకునేలా చేయడానికి రంగం సిద్ధం చేశాడు. దీనికి సంబంధించి సస్పెండ్ అయిన జీఎస్టీవోతో పలు దఫాలుగా రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో చర్చ నడుస్తోంది. సస్పెన్షన్‌ను రద్దు చేయించే బాధ్యత తనదని జీఎస్టీవోకు అభయమిచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సిట్టింగ్‌ల్లో ముడుపుల అజెండా కొనసాగినట్టు తెలుస్తోంది. సంఘాల్లో పదవులను అడ్డుకుని కొందరు నేతలు సీట్లలో కూర్చోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రశ్నించిన అధికారులను సంఘంలో ఉన్న హోదాలను ఉపయోగించుకుని బెదిరిస్తున్నట్టు తెలుస్తోంది.

అధికారిపై నేత దురుసుతనం

కొద్దిరోజుల క్రితం ఓ సంఘ నాయకుడు డివిజన్ ఉన్నతాధికారి పట్ల దురుసుగా ప్రవర్తించినట్టు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ నాయకుడిపై అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో సంబంధిత అధికారి ఆ నాయకుడ్ని పిలిపించారు. ఈ సమాచారం చెప్పిన ఉద్యోగిపై రుసరుసలాడిన నాయకుడు తర్వాత సంబంధిత అధికారితో పరుష పదజాలంతో మాట్లాడినట్టు తెలిసింది. ఉద్యోగుల సంఘానికి నాయకుడిగా ఉన్న తనపైనే విచారణ చేస్తారా అని ఎదురుతిరిగినట్టు సమాచారం. తానంటే ఏమిటో చూపిస్తానని సవాల్ కూడా చేసినట్టు చర్చ నడుస్తోంది.

ప్రజాబలం ఉన్నవాళ్లే నాయకులు

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు



జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబలం ఎవరికి ఉంటే వాళ్ళే నాయకులు, ప్రజాబలం లేకుండా ఏదైన చేద్దామనుకుంటే అది వారి భ్రమ అని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవనరామ్ జయంతి పురస్కరించుకొని తిరువూరులోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆ మహనీయుడి ఆశయ సాధన దిశగా కృషి చేయడమే మన ముందున్న కర్తవ్యం అన్నారు. జగజ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఎన్నో వివక్షతలు ఎదుర్కొంటూ ఉన్నత స్థాయికి చేరుకున్నారంటే, వారికున్న చదువు, విజ్ఞానం, ఆత్మగౌరవం, వారి మీద వారికి ఉన్న ఆత్మవిశ్వాసం వారిని ఉన్నత స్థానానికి చేర్చిందన్నారు. మన సొంత బలమే మనల్ని నిలబెడుతుందని, వెనుక ఎవరో నలుగురు ఉండి నువ్వు నాయకుడివి అంటే ఎవరూ నాయకుడు కాడు అంటూ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాయకుడు అనే వాడు స్వయంగా ఎదుగుతాడు, నాయకుడు అనే వాడు ఆత్మగౌవరంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతాడు అని ఆయన పేర్కొన్నారు. తాను రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి ఆనంద్‌స్వరూప్, దుబ్బాకు వెంకటేశ్వరరావు, మార్కేండేశ్వరరావు, మీనుగు శ్రీనివాసరావు, సింధు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అహంకారం ఉంటే ప్రజలు దూరమవుతారు

» టీడీపీ నాయకుడు శావల దేవదత్
» ఎమ్మెల్యే కార్యక్రమానికి నాయకుల డుమ్మా!
» ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణ

తిరువూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు అహంకారపూరితంగా వ్యవహరిస్తే ప్రజలు దూరమవుతారని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్, టీడీపీ నాయకుడు శావల దేవదత్ అన్నారు. తిరువూరులో టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. శనివారం స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ(కూటమి)నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకను నిర్వహించడంతో పాటు, ఎస్సీ వర్గానికి చెందిన పార్టీ సీనియర్లను శాలువాలతో సన్మానించి, స్వీట్లు అందించారు. ఫ్యాక్టరీ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శావల దేవదత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పి4 పథకం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొందరు పదవి ఉంది కదా అని అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, పదవి ఒక బాధ్యతగా గుర్తించాలని హితవు పలికారు. ఎవ్వరైన అహంకార పూరితంగా వ్యవహరిస్తే ప్రజలు దూరమవుతారనే విషయం తెలుసుకోవాలన్నారు. అటువంటి వారి వెంట వెళ్లకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకుడు శావల దేవదత్, నాయకులు

వరాల జల్లు

(5వ పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను పదేళ్ల పాటు అవుట్‌సోర్సింగ్ విధానంలో రైతు సంఘాలకు అప్పగించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అడిగిందే తడవుగా ఆయన వరాల జల్లు కురిపించారు. చందర్లపాడు మండలం ఏటూరు-కంచికచర్ల మండలం మోగులూరు గ్రామాల మధ్య రాకపోకల నిమిత్తం మునేటిపై కాజ్‌వే నిర్మాణం కోసం రూ.2.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో యేనుగుగడ్డ వాగుపై వంతెనలు నిర్మించేందుకు రూ.2.13 కోట్లు, కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద వాగులపై వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. సుబాబుల్, విర్రి రైతుల సమస్యలు తనకు తెలుసని, మార్కెట్ పరిస్థితులను సమీక్షించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తానన్నారు. అమెరికా ఆంక్షలతో ఆక్వాకు దెబ్బతగిలే పరిస్థితి ఏర్పడిందని చెప్పిన ఆయన వారు ఏమాత్రం నష్టపోకుండా ఆదుకుంటామన్నారు. రైతులకు లాభసాటిగా ఉండేందుకు వ్యవసాయంలో సాంకేతికను జోడించేందుకు గేట్ ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు.

ముప్పాళ్ల అభివృద్ధికి హామీ

ముప్పాళ్లను అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించిన ఆయన వాటిని పరిష్కరించే బాధ్యత కలెక్టర్ లక్ష్మీశకు అప్పగించారు. 64 కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలు ఇస్తామన్నారు. 11 కుటుంబాలకు టాయిలెట్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. 223 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వటంతో పాటు పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. 909 కుటుంబాలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అయితే ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమ ఇంటిపై రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ అమర్చుకోవాలని చెప్పారు. ఇందుకోసం పైసా కూడా ఖర్చు కాదని, నిర్వహణ బాధ్యతలు కూడా ఏజెన్సీ సంస్థ చూస్తుందని, ఒకవేళ విద్యుత్ మిగిలితే యూనిట్‌కు రూ.2.09 వంతున తీసుకుంటామని, సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని చెప్పారు. బీసీ, ఓసీలు కూడా సోలార్ సిస్టమ్ బిగించుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవటం లాభదాయకమని, ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లు కూడా రీచార్జి చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది ముప్పాళ్ల గ్రామంలో 4 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు వేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నామని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

డాన్‌బాస్కోలో డ్రోన్‌ఫెస్ట్ 8 నుంచి ప్రారంభం

పటమట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గురునానక్ కాలనీలోని డాన్‌బోస్కో స్కూల్లో ఈనెల 8, 9వ తేదీల్లో ఏఐ రోబో డ్రోన్ ఫెస్ట్ 2025ను నిర్వహిస్తామని పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ శనివారం తెలిపారు. 2020 డిసెంబరులో నేషనల్ ఇన్నోవేషన్ హబ్‌లుగా తీర్చిదిద్దేందుకు దేశంలో కొన్ని పాఠశాలలను అటల్ ఇన్నోవేషన్ స్టార్టప్ ల్యాబ్‌లుగా ఎంపిక చేశారన్నారు. వాటిలో తమ పాఠశాల ఒకటన్నారు. స్కూల్‌స్థాయిలో సాంకేతిక ప్రదర్శన జరగడం ఇదే ప్రథమమన్నారు. డ్రోన్ టెక్నాలజీ, త్రీడి ప్రింటింగ్, రోబోటిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్ అభివృద్ధి చేశామన్నారు. 60కి పైగా ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచుతున్నట్టు చెప్పారు. ప్రదర్శకులు ముందుగానే డ్రోన్ విడిభాగాలను బిగించి సందర్శకుల ముందు ఎగురవేస్తారన్నారు. 8, 9న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.



హ్యూమనాయిడ్ రోబో

● హ్యూమనాయిడ్ రోబో: సుమారు 5 అడుగుల ఎత్తులో ఉండే ఈ రోబో మన నోటి సూచనలకు అనుగుణంగా రిమోట్ ద్వారా మనుషుల అవసరాలు తీర్చుతూ ఎవరి ప్రమేయం లేకుండా పని చేస్తుంది.



ట్రాఫిక్ లైన్ ఫాలోయింగ్ రోబో

● వ్యవసాయ రోబో: ఇది సోలార్ ప్యానల్ సాయంతో పనిచేస్తుంది. మొక్క ఎదుగుల, కలుపు నివారణ చర్యలు, భూసార పరిరక్షణ విషయంలో రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తుంది.

● ట్రాఫిక్ లైన్ ఫాలోయింగ్ రోబో: ఏదైనా వాహనం రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు లైన్ దాటి మరో లైన్‌లోకి ప్రవేశించేలా ఉంటే డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. ఇది అల్గారిథమ్ సాయంతో పని చేస్తుంది.

దుర్గగుడిలో అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదిక మీద శనివారం విజయవాడకు చెందిన కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య వేదాంతం పార్థసారధి ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు 25 మంది కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

తల్లీ బిడ్డ సంరక్షణతోనే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు

- డాక్టర్ సమరం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ సంరక్షణతోనే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ వైద్యులు జి. సమరం అన్నారు. ఈనెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం బెంజిసర్కిల్‌లోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లీ బిడ్డలు సంరక్షణ సక్రమంగా ఉంటే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. దీనికి ప్రభుత్వం కూడా తమ వంత పాత్ర పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల మార్కులు బహిర్గతం చేయాలి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కులు క్యాటగిరీ ప్రకారం బహిర్గతం చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ శని వారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దీని వల్ల ఎవరికి ఎన్ని మార్కులు వచ్చేయో అభ్యర్థులు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ మార్కులు వచ్చిన వారు తమ లోపాలను తెలుసుకొని భవిష్యత్‌లో జరిగే పరీక్షల్లో మార్కులు పెంచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె

పటమట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు తెలిపారు. శనివారం తూర్పు నియోజక వర్గంలోని 10వ డివిజన్‌లో వారు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ మారుతీ కో-ఆపరేటివ్ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన అక్కినేని పూర్ణచం ద్రరావు నగరపాలక ఉద్యానవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్, ఇతరశాఖ అధికారులతో నగరాభివృద్ధి గురించి చర్చించి రూపొందించిన



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె

మాస్టర్ ప్లాన్‌తో రావాలని సీఎం తమకు చెప్పారన్నారు. కాలనీ వాసుల కోరిక మేరకు ఎమ్మెల్యే గద్దె, కార్పొరేటర్ అపర్ణలు కలిసి నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి పార్క్ నిర్మాణ పనుల్ని వేగవంతంగా పూర్తి చేయించినట్లు ఎంపీ తెలిపారు. గత 25 ఏళ్లుగా ఆ స్థలం ఆశ్రమం ఆధీనంలో ఉందన్నారు. అధికారులతో మాట్లాడి కౌన్సిల్‌లో చర్చించి ఆశ్రమాన్ని ఖాళీ చేయించి పార్క్, జిమ్ ఏర్పాటు చేసినట్లు గద్దె చెప్పారు. కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కె.ఆర్‌బాబు, ఎం.నాగేశ్వరరావు, మన్నె జయప్రకాశ్, తిలక్, కోనేరు బసవేశ్వరరావు, అంజనాదేవి, కార్పొరేషన్ డీఈ రమేష్, ఏఈ రాగ, పాల్గొన్నారు.

ఏకాగ్రతకు చిత్రలేఖనం దోహదం

స్పా కళాశాల డైరెక్టర్ కొండా రమేష్

మొగల్రాజపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి చిత్రలేఖనం పోటీలు దోహదం చేస్తాయని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ (స్పా)కళాశాల డైరెక్టర్ కొండా రమేష్ చెప్పారు. డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ, లయన్స్ డిస్ట్రిక్ట్ 316డీ, ఏపీ అటవీ శాఖ సంయుక్తంగా రమేష్ ఆసుపత్రి రోడ్డు లోని స్పా కళాశాల ఆవరణలో శనివారం 12వ జాతీయ స్థాయి ఆర్ట్ ఫెస్ట్ అండ్ ఆర్ట్ క్యాంప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారం భించిన ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, ముఖ్యంగా సృజనాత్మకత అలవడుతుందని చెప్పారు. డ్రీమ్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రలేఖనం మీద ఆసక్తి పెంచడానికి, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి ఏటా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రకృతిని మనం కాపాడుకుందాం, సేవ్ ఎర్త్ అనే అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీయగా వాటిని ప్రదర్శించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండలి అధ్యక్షుడు ఎన్.రాంబాబు, మా జ్యూయలరీ డైరెక్టర్ కె. సుధాకర్, సింగరీ ఆసుపత్రి వైద్యురాలు అరుణకుమారి, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషా, చిత్ర కారులు జయన్న, మోహన్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వస్త్ర ప్రేమికులను ఆకట్టుకున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

లబ్బీపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వివాహ, వేసవి సీజన్‌లో భారతీయ చేనేత సంప్రదాయ వస్త్రాల ప్రదర్శన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో వస్త్ర ప్రేమికుల కోసం ఎ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైందని, ఈ నెల 8 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు,



ఎక్స్‌పోలో వస్త్రాలు తిలకిస్తున్న సందర్శకులు

కుర్తీలు, మహారాష్ట్ర పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక, బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, చందేరి, మహేశ్వరి సిల్క్, బలూచారి, టాంగైల్, ఢకాయ్ మస్లిస్ సిల్క్ చీరలు, లినెన్ శారీ, కాంతా వర్క్ స్టిచ్ చీరలు, కంజీవరం చీరలు, గుజరాత్ బాందిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా చీరలు, బెనారస్, జాందానీ, షిఫాన్ చీరలు, లక్నో వర్క్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు, దుప్పట్లు, సల్వార్ మెటీరియల్స్ ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

గుణదల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యువతి అనుమానాస్పద స్థితిలో చనిపోయిన ఘటన శుక్రవారం సాయంత్రం ఫిలిమ్ కాలనీలో జరిగింది. వివరాల ప్రకారం స్థానిక 5వ డివిజన్ ఫిలిమ్ కాలనీలో ఉంటున్న మచ్చ సరస్వతి, చైతన్యలకు ముగ్గురు పిల్లలు సరస్వతి(36) హెల్ప్ హాస్పటల్లో డాక్టర్‌గా, భర్త చైతన్య అయుర్వేద డాక్టర్‌గా పనిచేస్తున్నారు. సరస్వతి ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి వస్తారు. సరస్వతి చిన్న కుమారుడిని చూసుకునేందుకు కడప జిల్లా బద్వేల్లో ఉంటున్న అక్క కూతురు బెల్లం శరణ్య(19) 3 నెలల నుంచి ఇక్కడే ఉంటుంది. సరస్వతి ప్రతి రోజూ డ్యూటీకి వెళ్లాక సాయంత్రం సమయంలో ఇంటికి ఒకసారి ఫోన్ చేసి మాట్లాడుతుంది. ఇదే క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటికి ఫోన్ చేయగా శరణ్య స్పందించలేదు. ఫోన్ ఎంతకీ తీయకపోవడంతో ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలకొట్టి లోనికి వెళ్లి చూడగా శరణ్య బెడ్‌రూమ్‌లో చున్నీతో ఫ్యానుకు ఉరేసుకుని ఉంది. 108కి కాల్ చేయగా వారు వచ్చి చూసి అప్పటికే చనిపోయినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శిఖామణి సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ చిన్ని



ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



రామవరప్పాడు రింగ్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎస్‌బీఐ సేవా అధ్యక్షుడు కొత్తపల్లి సతీష్, విజయవాడ డీజీఎస్ విజయమాధవి తదితరులు

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆటోనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడుతో వెళ్తున్న వ్యాన్‌ను పటమట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం జెన్ను రవి అనే డ్రైవర్ కృష్ణలంక నుంచి 30 బస్తాల పీడీఎస్ బియ్యం లోడుతో గంగూరు వైపు వెళ్తుండగా పటమట హైస్కూల్ రోడ్డు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా సుబ్రహ్మణ్యానికి చెందినదిగా తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.పవన్ కిషోర్ తెలిపారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన చంద్రబాబు పీ4తో సాధ్యం

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

మొగల్రాజపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కులరహిత సమాజం కోసం పోరాడిన వైతాళికుడు బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన పీ4తోనే సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని 7వ డివిజన్ శిఖామణి సెంటర్‌లో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి లక్ష్మణరావు, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, జిల్లా కార్యదర్శి దోమకొండ రవి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, 2,3,6 డివిజన్ అధ్యక్షులు గాబ్రియేల్, బాబురావు, గంగాధర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● 8వ డివిజన్‌లో పిటింగేల్‌పేట రాజధాని టీ స్టాల్ వద్ద డివిజన్ పార్టీ కార్యదర్శి మల్లె రామకృష్ణ అధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ తదితరులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ● 7వ డివిజన్ శిఖామణి సెంటర్‌లో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వడ్లమూడి సంపత్, పాటిబండ్ల హరీష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు. ●కులవివక్ష పోరాటసమితి (కేవీపీ ఎస్) ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సమితి రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ , కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నటరాజ్, తూర్పు నగర అధ్యక్షుడు శ్యాంబాబు, నాయకులు పాల్గొన్నారు. ● మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ పూల మాలవేసి నివాళులు అర్పించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

బెజవాడ బార్‌లో...

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కె.బాషా, కేవీ రంగారావులు ముందుగా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ బార్ అధ్యక్షులు వి.గురునాథం, సంపర శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ జేవీ లక్ష్మీ, న్యాయవాదులు వరప్రసాద్, పీడీఎస్ నారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో ...

వన్‌టౌన్: ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, తూర్పు ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి అంజనేయులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికి గాంధీజీ చేస్తున్న కృషి జగ్జీవన్‌రామ్‌కు ఆదర్శప్రాయమైందన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వర రావు, జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

పది మూల్యాంకన బడ్జెట్ కేటాయింపు జరగాలి

డెమోక్రటిక్ పీఆర్‌టీయూ నేత శ్రీను

గవర్నర్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకన పారితోషికాల చెల్లింపునకు బడ్జెట్ కేటాయింపు జరగాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. శనివారం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ కెవీ శ్రీనివాసులురెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులకు సకాలంలో పారితోషికాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని విధులకు ఒక రోజు సెలవు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు అక్బర్ బాషా, కుమార్ రాజా, మధుకర్, ఎడం శ్రీను, సర్వేశ్వరరావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.





శ్రీరామనవమి వేడుకలకు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న రామాలయం సిద్ధమైంది. రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మే 1 నుంచి ఉద్యోగుల చైతన్య యాత్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాల్సిందేనన్న డిమాండ్‌తో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1 నుంచి ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులందరూ ఏకం కావాలన్న పిలుపుతో ఉద్యోగుల చైతన్య యాత్ర జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ పఠాన్, కార్యదర్శి కడిమి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గాల సహకారంతో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 20 జిల్లాల్లో సుమారు వెయ్యి కిలోమీటర్లు మూడు విడతలుగా చైతన్య యాత్ర జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల కలెక్టరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాలు ఇస్తారన్నారు. మే డేన తిరుపతిలో చైతన్య యాత్ర ప్రారంభమవుతుందన్నారు. సీపీఎస్ ఉద్యోగులను కలిసి సీపీఎస్ ఉద్యోగులు ఏ విధంగా నష్టపోతున్నారో పాత పెన్షన్ విధానంలో ఏ సౌకర్యాలున్నాయి, ఇటీవల ప్రభుత్వాలు తీసుకువచ్చిన గవర్నమెంట్ పెన్షన్ స్కీమ్, యూనియన్ పెన్షన్ స్కీమ్ వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. సెప్టెంబరు 1న పెన్షన్ మార్చ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.వి. జనార్ధన్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. శాంతిబాయి, ఆర్థిక కార్యదర్శి జహీర్ అబ్బాస్, సహ అధ్యక్షుడు కిరణ్ ఉన్నారు.

మహిళల వ్యాపారాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● వర్క్‌షాపులో మంత్రి నారాయణ



మెప్మా చేపట్టిన 2025-26 కార్యాచరణ ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల ద్వారా మహిళల వ్యాపారాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు చేపట్టిందని, అందులో భాగంగానే మెప్మా 2025-26 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక చేపట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని బందరు రోడ్డులో ఉన్న అమరావతి కన్వెన్షన్ హాల్లో మహిళా వ్యాపారాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు జరిగింది. మంత్రి నారాయణ ప్రారంభించారు. కేంద్ర మాజీమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి నారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. నంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని 30వేల మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఏడాది 80 వేల సంఘాలకు రూ.8 వేల కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా పట్టణ పేద కుటుంబాలకు అందించే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినట్టు తెలిపారు. అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.143.55 కోట్లు, పీఎం స్వానిధి ద్వారా మంజూరైన రూ.2.21 కోట్ల రుణాల మెగా చెక్‌ను మంత్రి నారాయణ చేతుల మీదుగా ఎస్సీ లబ్ధిదారులకు అందించారు. ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రశంస అండ్ ఎక్సలెన్స్ పత్రాలు అందజేశారు. స్వయం సహాయక సంఘ మహిళల కోసం మెప్మా అధికారిక వెబ్‌సైట్, మహిళాకాశం యాప్, పట్టణ నిరాశ్రయుల వసతి గృహం కోసం నివాసం యాప్, సంఘాల్లోని లోన్ సదుపాయం కోసం మెప్మా లోన్ చార్జి క్రియేషన్ మెకానిజం (ఎంఎల్‌సీసీ), మెప్మా సిబ్బంది కోసం హెచ్‌ఆర్‌ఎంఎస్ డాష్ బోర్డులను ప్రారంభించారు. అనంతరం ఎంఎ అండ్ యూడీ శాఖ ప్రధాన కార్యదర్శి సమక్షంలో అసంఘటిత రంగాల కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పథకంతో అనుసంధానం చేస్తూ, వారికి ఆర్థిక భద్రత కల్పించేందుకు మెప్మా, కార్మిక శాఖల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పారిశ్రామికవేత్తల వార్షిక ప్రణాళికను ప్రారంభించారు. మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టనున్న వినూత్న కార్యక్రమాలు ఈ-కామర్స్ ప్రమోషన్ పాలసీ, ఈఏపీ వర్టికల్, డిజిటల్ ఇనిషియేటివ్స్, పరిపాలనా సంస్కరణలు-ఆర్థిక విషయాలు, సీబీ-ఐబీ వర్టికల్, ప్రత్యేక ప్రాజెక్టులు, సామాజిక మౌలిక సదుపాయాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు, మిషన్ డైరెక్టర్ (మెప్మా) ఎన్.తేజ్ భరత్, జాయింట్ డైరెక్టర్ ఐ.మాధవి, ఉన్నతాధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్లు, స్వయం సహాయక మహిళలు, స్టేట్ మిషన్ మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడకు రానున్న ఉద్యోగావకాశాలు: ఎంపీ చిన్ని


స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న శివనాథ్, బొండా ఉమా

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విజయవాడకు ఎన్నో ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఏ దేశం ఆలోచించని విధంగా క్వాంటమ్ కంప్యూటరైజేషన్ గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమెరికాలో మాత్రమే క్వాంటమ్ కంప్యూటరింగ్ ఉందన్నారు. తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ స్టూడెంట్ హోమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శారద కళాశాలలో 250 మంది విద్యార్థులకు శనివారం సాయంత్రం స్కాలర్‌షిప్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధనకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఎంపీ చిన్నిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ జంధ్యాల శంకర్ అధ్యక్షతన ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.ఈశ్వర్, ఎం సత్యనారాయణరావు, కార్యదర్శి జీవీఎస్ఎన్. రాఘవరావు, కోశాధికారి మోగులూరు కృష్ణ, కార్యవర్గ సభ్యులు యాబలూరు లోకనాథ శర్మ, జీవీఎస్ చలపతిరావు, బలరామకృష్ణమూర్తి, రామనారాయణ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప సంఘసంస్కర్త, రాజకీయవేత్త బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పేదవర్గాల సంక్షేమానికి ఎంతో కృషిచేశారని, విలువలతో కూడిన రాజకీయ జీవితం గడిపారన్నారు. సమాజంలో అంటరానితనం, కులవివక్షను రూపుమాపేందుకు కృషి చేశారని, ఆ స్ఫూర్తితో దేశాభివృద్ధికి యువత కృషిచేయాలన్నారు.

నగరంలో 'జాక్' సందడి



లబ్బీపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో జాక్ మూవీ టీమ్ సందడి చేసింది. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మూవీ ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. చిత్ర కథనాయకుడు సిద్ధూ జొన్నలగడ్డ మాట్లాడుతూ విజయవాడ రావడం సంతోషంగా ఉందని, జాక్ చిత్రం లో కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు పుష్కలంగా ఉన్నాయని, హీరోయిన్ వైష్ణవి చైతన్య వేసే పంచులు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. టిల్లు క్యూబ్, తెలుసు కదాతో త్వరలో ప్రేక్షకుల ముందుకి వస్తానన్నారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ హీరో సిద్ధూ జొన్నలగడ్డతో కలిసి నటించడం సంతోషంగా ఉందని, జాక్ స్టోరీ డిఫరెంట్‌గా ఉంటుందన్నారు. చిత్ర నిర్మాత బీవీఎస్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ సినిమా ఖచ్చితంగా మంచి కలెక్షన్స్ అందుకోబోతుందన్నారు. పవన్ కల్యాణ్ డేట్స్ ఇస్తే ఖచ్చితంగా ఆయనతోనూ చిత్రాన్ని తీస్తామన్నారు.

80 కేజీల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు


గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆటోనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శివారు ప్రాంతమైన ఎనికేపాడు వద్ద 80 కేజీల గంజాయి, పుంగనూరుకు చెందిన ఇద్దరు నిందితుల్ని పటమట పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వల్లభనేని పవన్ కిషోర్ మాట్లాడుతూ షేక్ షాజిద్, షేక్ ఫయాజ్ వైజాగ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి బొలేరో వాహనంలో బెంగుళూరు తరలిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ కె. దామోదర్ పర్యవేక్షణలో ఎస్.ఐ హరికృష్ణ వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు కారును పక్కన ఆపి పారిపోయేందుకు యత్నించారన్నారు. ఎస్.ఐ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. వాహనాన్ని, 80 కేజీల గంజాయిని సీజ్ చేసి నిందితుల్ని రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. ఎస్.ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గమ్మ పుష్పార్చనకు పుష్పాలు తీసుకెళుతున్న భక్తులు, ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చన

దుర్గమ్మకు ప్రత్యేక పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గాదేవికి చైత్ర మాస వసంత నవరాత్రుల క్రమంలో శనివారం అమ్మవారికి ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరులు, సన్నజాజులతో లలిత సహస్రనామాన్ని అనుసంధానించి పూజలు చేశారు. దుర్గగుడిలో వసంత నవరాత్రుల్లో అమ్మవారికి రోజుకొక రకం పుష్పాలతో అర్చన చేయటం జరుగుతోంది. ఉగాది పండుగనాడు ప్రారంభించిన ఈ ప్రత్యేక పుష్పార్చన శనివారం నాటికి ఏడు రోజులు పూర్తయ్యింది. పద్మాలలో ఆశీనురాలైన లక్ష్మీదేవి స్వరూపం కూడా దుర్గాదేవియేనని పూజలు చేస్తారు. దివ్యారత్నాభరణ భూషిత అయిన దుర్గమ్మ వరదాభయ హస్తంతో భక్తులను నిత్యం దీవిస్తుంటారు. మహాదేవి, మహేశ్వరి, నిత్యానందకరి అయిన మహాలక్ష్మి రూపం దుర్గాదేవి అని చెప్పడానికి దుర్గగుడిలో ముఖ్య ఆలయం చుట్టూ అష్ట లక్ష్మీదేవిల విగ్రహాలుంటాయి. ఈ అష్టలక్ష్మీదేవిలకు కూడా నిత్యం అలంకారం, అర్చన, తదితరాలను నిర్వహిస్తుంటారు. చైత్రమాస వసంత నవరాత్రుల్లో శనివారం అష్టమి తిథి రావటంతో ప్రాముఖ్యత ఏర్పడింది. అష్టమి నాడే దుర్గమ్మ జనించారని ప్రతీతి. పంచభూతాత్మిక అయిన దుర్గమ్మను భక్తులు తమ మనోఫలకాల్లో నిలుపుకుని సన్నజాజులు, కలువలు, ఎర్రగన్నేరు, ఎర్ర తామర పూలను సమర్పించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు

ఇంద్రకీలాద్రికి క్షేత్ర పాలకుడుగా ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. శ్రీరామనవమికి ముందురోజు ఆంజనేయ స్వామికి ప్రత్యేకంగా తమలపాకులతో అర్చన చేయటం జరుగుతుంది. దుర్గమ్మ ప్రధాన ఆలయం ఎదురుగా ఓ చిన్న మందిరంలో ఆంజనేయ స్వామి కొలువై ఉన్నారు. అలాగే ఘాట్ రోడ్డులోని మెట్ల మార్గం వద్ద, మహామండపం మెట్ల మార్గం వద్ద ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. ఈ అన్నింటా శనివారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి తమలపాకులతో పూజలు చేశారు. తమలపాకులను నాగవల్లీదళాలని పిలుస్తారు. స్వామికి నాగవల్లీ దళాలతో పాటు, ఆయనకు అత్యంత ఇష్టమైన అరిసెల దండలను సమర్పించారు. అర్చనకు ముందు స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలలో భక్తులు పాల్గొని స్వామివారిని తమ ఇష్ట కామ్యాలు సిద్ధించాలని కోరుకున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్
అడుగుజాడల్లో నడుద్దాం

● కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమతావాదానికి పునాది వేసి ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన బాబూ జగ్జీవన్‌రామ్ పలువురికి స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగుజాడల్లో అందరూ నిలవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా గుప్తాసెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ బాలాజీ, మాజీ ఎంపీ, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మలకాపట్నంలోని సమీకృత వసతిగృహంలోని చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిదశలో చిన్నప్పుడే తండ్రి చనిపోయి ఆర్థిక ఇబ్బందులకు గురైన జగ్జీవన్‌రామ్ పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కుమార్తె మీనాకుమారి స్పీకర్‌గా ఉన్న సమయంలో తాను ఎంపీ గా పార్లమెంటులో సేవలందించానన్నారు. డీఆర్వో చంద్రశేఖర్ మాట్లాడుతూ వసతి గృహాల అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు చేశారన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ ఇన్‌చార్జి అధికారి ముదిగొండ ఫణిధూర్జటి ఆధ్వర్యంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, ఎస్సీ సంఘాల నేతలు మాచవరపు ఆదినారాయణ, కొడాలి శర్మ, డొక్కా జగన్‌మోహనరావు, గంద్రపు సీనయ్య, వంపుగడల చౌదరి, పి. కొండయ్య, గుమ్మడి విద్యాసాగర్, కొడాలి అజయ్‌కుమార్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు. అలాగే జడ్పీ సమావేశపు హాలులో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ రాగయుక్తంగా సీస పద్యం పాడి వినిపించారు. కలెక్టర్ బాలాజీ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, లింగం ఫిలిప్, రత్నం మాట్లాడారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించండి

● కర్ణాటక ప్రభుత్వానికి మహ్మద్ గౌస్ పీర్ విజ్ఞప్తి



కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు బయలుదేరు ఆంధ్రప్రదేశ్ హాజీలకు కర్ణాటక ప్రభుత్వం ద్వారా వసతి, సౌకర్యాలు కల్పించాలంటూ కర్ణాటక మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సల్మా ఫాతిమాను ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వాహక అధికారి మహ్మద్ గౌస్ పీర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు శనివారం బెంగళూరులోని వికాస్ సౌధాలో కర్ణాటక మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా సల్మా ఫాతిమాను కలిశారు. బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా 454మంది ఏపీకి చెందిన హజ్ యాత్రికులు హజ్ యాత్రకు వెళ్లనున్నారు. గౌస్ పీర్ అభ్యర్థనను మన్నించిన సల్మా యాత్రికులకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని, ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించండి

● సీఎస్‌ను కలిసిన కేయూ ఉప కులపతి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కేయూ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ కోరారు. శనివారం వెలగపూడి సచివాలయంలో విజయానంద్‌ను ఆయన కలిసి పూలమొక్కను ఇచ్చి సత్కరించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి చెందిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి మరోసారి పరీక్ష

● పక్షం రోజుల్లో అమరావతికి నిపుణుల బృందం

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టనున్న సచివాలయ టవర్ల నిర్మాణ పనులకు టెండర్ల దశకు వెళ్తున్న సమయంలో మరోమారు ఐఐటీ నిపుణులతో పరీక్షలు చేయించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. రాజధానిలో నిర్మించబోయేది గ్రాండ్ ఐకానిక్ భవనాలు కావటంతో టెండర్లకు వెళ్లే ముందు ఈ ప్రక్రియ పూర్తి చేయాలనుకుంటున్నారు. గతంలో ఐఐటీ నిపుణులు వచ్చినపుడు ఇవి పూర్తిగా నీటితో ఉన్నాయి. ప్రస్తుతం నీటి తోడివేత పనులు పూర్తయ్యాయి. దీంతో మరోమారు పరిశీలించాలని నిర్ణయించారు. పక్షం రోజుల్లో వారు అమరావతి వచ్చి తుది పరీక్షలు జరపనున్నారు. ఈ టవర్లకు సంబంధించి 4 చోట్ల తుది పరీక్షలు నిర్వహిస్తారు. బేస్‌మెంట్ స్టీల్, బేస్‌మెంట్ కాంక్రీట్ ఎలా ఉందన్నది పరిశీలిస్తారు. గత పరీక్షల్లో నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బంది లేదని ఐఐటీ నిపుణుల బృందం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో నీరుండటంతో బేస్‌మెంట్ స్టడీ చేయలేదు.

50 శాతం పెరగనున్న అంచనా వ్యయం

అత్యంత భారీ హైరైజ్ టవర్ల పనులకు 50శాతం అదనంగా అంచనా వ్యయం పెరగనుంది. వైసీపీ హయాంలో ఐదేళ్లలో ఈ టవర్ల పనులను గాలికొదిలేయటంతో స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు (ఎస్ఎస్ఆర్) పెరిగిపోయాయి. ఐకానిక్ టవర్లకు పెద్ద మొత్తంలో స్టీల్ ఉపయోగించాల్సి రావటంతో పెరిగిన ధరల ప్రకారం అంచనాల కంటే 50శాతం అదనంగా ఖర్చు కానుంది.

అన్నీ అపోహలే..

సచివాలయాల టవర్ల దగ్గర నీరు తోడినప్పటికీ ఇంకా కొద్దిగా నీరుండటంతో సోషల్ మీడియాలో వస్తున్న అనుమానాలు అపోహలేనని సీఆర్‌డీఏ వర్గాలు స్పష్టం చేశాయి. నీటి తోడివేత సందర్భంలో పైపులైన్ లీకేజీ కారణంగా ఈ నీరు వచ్చిందే తప్ప మరొకటి కాదన్నారు. హైకోర్టు వద్ద మాత్రమే స్వల్పంగా ఊట వచ్చినా నిర్మాణ పనులకు ఎలాంటి ఇబ్బందులు లేవని సూపర్‌వైజింగ్ సిబ్బంది చెబుతున్నారు.

ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ సేవలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వజ్రా జ్యోతి పేర్కొన్నారు. ఆసుపత్రి సౌజన్యంతో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్‌లో సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈఎస్ఐ, రమేష్, కామినేని, అమరావతి కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు వైద్య సేవలందించారు. యూనియన్ విజయవాడ అధ్యక్షుడు చావా రవి, ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పూజారి రాజేష్, ఐజేయూ జాతీయ సమితి సభ్యుడు షేక్ బాబు, యూనియన్ విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ కోసం గ్రామాల ఎఫ్ఎంబీల సేకరణ

● ఐదు జిల్లాల్లో రెవెన్యూ శాఖ నుంచి ఎఫ్ఎంబీల సేకరణ

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను గ్రౌండ్ ఫిక్సేషన్ చేయటానికి వీలుగా జాతీయ రహదారి సంస్థ అధికారులు గ్రామాల ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్స్ (ఎఫ్ఎంబీ) కాపీలను సేకరిస్తున్నారు. ఈ రోడ్డు వెడల్పు ఎంతనే దానిపై ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులకు స్పష్టత రాకపోవటంతో ముందస్తుగా ఎఫ్ఎంబీల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కోరినట్టుగా 150 మీటర్లు కానీ, 140 మీటర్లు కానీ ఇస్తే అందుకనుగుణంగా భూములను పెగ్ మార్కింగ్ చేయటానికి వీలుగా ఐదు జిల్లాల రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌హెచ్ అధికారులు ఎఫ్ఎంబీలు సేకరిస్తున్నారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు 140 మీటర్ల మేరకు ప్రాథమికంగా అనుమతులిచ్చినట్టుగా ప్రచారం జరుగుతున్నా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు) నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. మోర్తు నుంచి వచ్చే మినిట్స్ కోసం అమరావతి ఎన్‌హెచ్ అధికారులు ఎదురుచూస్తున్నారు. మినిట్స్ వస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 140 మీటర్లకు అనుమతినిస్తే ఎలా అన్నది తెలియాల్సి ఉంది. 70 మీటర్లు కేంద్రం, 70 మీటర్లు రాష్ట్రం భూసేకరణ వ్యయం భరించేలా ఉంటుందా..? మరో రకంగా ఉంటుందా..? అనేది వేచి చూడాలి. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు 70 మీటర్లకు అనుగుణంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేసుకున్నారు. ఒకవేళ అదనంగా 70 మీటర్లు ఇస్తే దానికి అనుగుణంగా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేసుకోవటానికి వీలుగా ఎఫ్ఎంబీలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 70 మీటర్ల ప్రాతిపదికన చూస్తే 1,300 హెక్టార్ల భూములు అవసరమవుతాయి. ఎన్‌హెచ్ రెండున్నర రెట్ల పరిహారం ఇవ్వనుంది కాబట్టి సుమారు రూ.2,600 కోట్లు ఖర్చవుతుంది. అదే 140 కిలోమీటర్లకు అనుమతిస్తే మరో రూ.2,600 కోట్లు అవుతుంది. అదనంగా ఇచ్చే 70 మీటర్ల భూసేకరణ వ్యయం కేంద్రమే ఖర్చు చేయాలనుకుంటే మాత్రం ఒక్క భూసేకరణకే రూ.5,200 కోట్లు ఖర్చవుతుందని తెలుస్తోంది. కేంద్రం నుంచి మినిట్స్ బుక్ వచ్చే వరకు వేచి చూడాలని ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు భావిస్తున్నారు.

సమయస్ఫూర్తితో మహిళను కాపాడిన సీఐ


వాటర్ ట్యాంకు ఎక్కిన మహిళతో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు


చల్లపల్లి, ఏప్రియల్ 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలు, మానసిక ఆందోళనతో ఓ మహిళ వాటర్ ట్యాంకు ఎక్కి దూకేందుకు ప్రయత్నించగా స్థానిక యువత సహాయంతో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సమయస్ఫూర్తితో వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడారు. స్థానిక నారాయణరావునగర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన కొద్దిసేపు ప్రజలందరికీ హైటెన్షన్‌ను కలిగించింది. పుట్టింటి వద్ద ఉన్న ఓ మహిళ మధ్యాహ్నం కాలనీలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఏడుస్తూ ఉండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో చెంబురెడ్డి మణి, తుళ్లూరు విష్ణుభరత్ తదితర యువకులు ట్యాంకు ఎక్కి మహిళకు దించేందుకు ప్రయత్నించినా రాలేదు. తండ్రి వచ్చి కోరినా రాలేదు. సమాచారం అందుకున్న సీఐ ఈశ్వరరావు అక్కడకు వచ్చిన ట్యాంకు ఎక్కి సమస్యలుంటే చెప్పాలంటూ మాటల్లో పెట్టారు. అయినప్పటికీ ట్యాంకు అంచున కాళ్లు కిందకు వేలాడేసి కూర్చుండిపోయింది. భర్త నెంబరు చెబితే ఫోన్ చేస్తామంటూ అక్కడే ఉన్న మణి అనే యువకుడికి డైరెక్షన్ ఇవ్వటంతో మణి చాకచక్యంగా ట్యాంకు చుట్టూ తిరిగివెళ్లి మహిళను గట్టిగా పట్టుకుని వెనక్కులాగేశాడు. దీంతో ట్యాంకు పైకివెళ్లిన వారంతా ఇవతలకు తీసుకురాగా, సీఐ ఈశ్వరరావు జాగ్రత్తగా కిందకు దింపి తండ్రికి అప్పగించారు. ధైర్యంగా ముందుకువచ్చిన యువకుడు మణిని సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం అభినందించారు. సీఐ ఈశ్వరరావు సమయస్ఫూర్తితో మహిళను కాపాడటంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఒకవేళ మహిళ కిందపడితే ప్రమాదం జరగకుండా ఉండేలా స్థానికులందరూ కలిసి పెద్దపరజాలను పట్టుకోగా, సన్‌సైడ్ మాదిరిగా ఉన్న శ్లాబ్ భాగంలోని ఇనుప సువ్వలను వంచి అప్రమత్తం చేశారు. అదృష్టవశాత్తూ మహిళను సురక్షితంగా తీసుకువచ్చారు.

పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టుకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ సెట్ 2025కు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులతో పాటు డిగ్రీ ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అవకాశం కల్పించామన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో ఎంఏ ఇంగ్లీషులో 33, ఎంకాంలో 44, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40, ఎంఎస్సీ అనాలిటికల్ కెమిస్ట్రీలో 40, గణితశాస్త్రంలో 33, ఎంఎస్సీ భౌతికశాస్త్రంలో 33, ఎంఎస్సీ బోటనీలో 33, ఎంఎస్సీ జువాలజీలో 33, ఎంఎస్సీ బయోటెక్నాలజీలో 33, ఎంబీఏలో 66, ఎంసీఏలో 66 సీట్లు ఉన్నాయన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. ఇందుకు కేయులో సమాచార కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

ప్రజలకు ఎంపీ చిన్ని శ్రీరామనవమి శుభాకాంక్షలు

గాంధీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఒంటిమిట్ట, భద్రాది ఆలయాలతో పాటు ప్రతి ఇంట శ్రీరామనవమి పర్వదినాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



మన రాముడు ఆనంద స్వరూపుడు

'రామో విగ్రహవాన్ ధర్మః' అని రామాయణం చెబుతోంది. అంటే రాముడు ధర్మానికి ప్రతి రూపం. రాముడు అంత ధర్మబద్ధంగా జీవించాడు. 'మరి అంత ధర్మబద్ధంగా జీవించిన రాముడికి ఎందుకు అన్ని బాధలు, కష్టాలు? ధర్మాచరణ అంటే అలా కష్టాలు, బాధలు అనుభవించాలా? సాక్షాత్తూ పరమాత్మ అయిన రాముడే ధర్మాచరణ కోసం అన్ని కష్టాలు ఎదుర్కోవలసి వస్తే మరి మనలాంటి సామాన్య మానవుల పరిస్థితి ఏంటి? ధర్మాచరణలో వచ్చే కష్టాలు, బాధలు మనం తట్టుకోగలమా?'- ఇలాంటి సందేహాలు కొందరికి కలుగుతూ ఉంటాయి. ఇదే విధంగా - 'ధర్మం కోసం ఆనందాన్ని పణంగా పెట్టడమా లేక ఆనందం కోసం ధర్మాన్ని తప్పడమా?' అనే సంకోచం కూడా కలుగుతుంది. అలాంటి సందర్భాలలో ఎక్కువ మంది రెండో వైపే మొగ్గు చూపుతారు. దీనికి ప్రధాన కారణం- ధర్మాచరణ గురించి సరైన అవగాహన లేకపోవటమే!

అంటే ఏమిటి?

ధర్మాచరణ అంటే శాస్త్ర నియమాలను పాటించడం. ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించడం. ఇటువంటి జీవనం మనకు ఇహలోకంలో సుఖసంతోషాలు ఇవ్వడమే కాకుండా, మరణానంతరం ఉన్నత గతులను ప్రసాదిస్తుంది. అంతేకాని ధర్మం అంటే కష్టాలు మోయడం కాదు, బాధలు అనుభవించడం అంతకన్నా కాదు. నిజానికి ధర్మం వలన మాత్రమే మనం అసలైన ఆనందాన్ని పొందగలం, సుఖప్రదమైన జీవితం అనుభవించగలం. అధర్మం వలన, అనగా ప్రకృతి విరుద్ధ చేష్టల వలన, మనకు వచ్చేది కేవలం క్షణికమైన ఆనందం మాత్రమే. ఉదాహరణకు మద్యపానం మనకు ఆనందాన్ని, సుఖాన్ని ఇస్తుంది. కానీ హ్యాంగోవర్‌లు మిగులుస్తుంది. విషవలయంలోకి నెడుతుంది. కానీ ధర్మం వలన వచ్చే ఆనందం అమృత పానం లాంటిది. దానికి 'హ్యాంగోవర్' లాంటి దుష్ప్రభావాలు ఉండవు. నిలకడ అయిన ఆనందం లభిస్తుంది.

ఎందుకన్ని కష్టాలు?

మరి మన రాముడు ధర్మాచరణ చేసి కూడా ఎందుకు అన్ని కష్టాలు అనుభవించాడు? నిజానికి మనం ఊహించుకున్నట్లు రాముడు అన్ని కష్టాలూ పడలేదు, అంత దుఃఖమూ అనుభవించలేదు. రాముడు అయోధ్యను పాలించే సమయంలో ప్రజలందరూ ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించారు. అలానే రాముడూ ఆనందంగా జీవించాడు. కాకపోతే పట్టాభిషేకానికి ముందు పద్నాలుగు ఏళ్ళు వనవాసం చేయవలసి వచ్చింది. విలాసవంతమైన రాజభోగాలు వదిలి అలా 14 ఏళ్ళు వనవాసానికి వెళ్లడం మనలాంటి మనుషులకు నిజంగా చాలా బాధాకరమైన విషయమే అవుతుంది. కానీ రాముడు మహాజ్ఞాని, చిన్న వయస్సులోనే వసిష్ఠుడు వంటి మహర్షుల నుంచి బ్రహ్మ జ్ఞానాన్ని పొందినవాడు. అటువంటి జ్ఞానులకు రాజభోగాలు, అధికారం వంటివి తృణప్రాయాలు. రాముని వంటి పరాక్రమవంతులకు వనవాసం ఒక విహారయాత్ర అవుతుంది.

కాబట్టి రాముడు వనవాసం చేసి బాధలు అనుభవించాడు అనుకోవడం పొరపాటు.

ఇక పోతే తండ్రి మరణం, సీతా వియోగం, రావణ పీడ... వాటి వలన రాముడు కొంత దుఃఖాన్ని అనుభవించాడు. కానీ జ్ఞాని కాబట్టి తండ్రి మరణాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాడు, సీతా వియోగాన్ని సహనంతో భరించాడు. ధైర్యంగా శత్రువుతో పోరాడి విజయం సాధించాడు. రాముడు కూడా కొన్ని కష్టాలు, బాధలు, సవాళ్లు ఎదుర్కొన్నాడు. కానీ వాటిని తప్పించుకోడానికి అయన ధర్మాన్ని తప్పలేదు. ఇదే రామకథలో ముఖ్యమైన అంశం.

నిజానికి కష్టాలు, బాధలు అనేవి అసలు లేకపోతే, జీవితంలో సుఖాల్ని, ఆనందాల్ని ఆస్వాదించలేం. ఏసీ యొక్క సుఖాన్ని ఆస్వాదించాలంటే మనం కనీసం అప్పుడప్పుడు ఎండలో తిరగాలి. కాబట్టి మనం జీవితంలో అప్పుడప్పుడూ వచ్చే కష్టాలను, బాధలను తలుచుకుని కుమిలిపోకుండా ధైర్యంతో, సహనంతో ధర్మ మార్గంలో ముందుకు సాగాలి. అప్పుడూ మన జీవితం కూడా శ్రీరాముడి జీవితంలా అధిక శాతం ఆనందమయమవుతుంది.

అందరికీ తప్పవు..

మానవులందరూ ఇలాంటి క్లిష్ట పరిస్థితులు ఎప్పుడో ఒకసారి ఎదుర్కొనాల్సి ఉంటుంది. మనం కూడా భోగాల్ని వదిలి వేయాల్సిన సందర్భాలు వస్తాయి, మనకు కూడా ఆప్తుల వియోగం కలుగుతుంది. అలానే రావణుడి లాంటి పెద్ద శత్రువులు కాకపోయినా మన స్థాయిలో మనకూ శత్రువుల నుంచి బాధలు తప్పవు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే మనం జ్ఞానం సంపాదించుకోవాలి, సహనం అలవర్చుకోవాలి, ధర్మ సూక్ష్మాలు తెలుసుకోవాలి, ధైర్యంగా పోరాడాలి. అంతేకాని కష్టాలు, బాధలు తప్పించుకోడానికి మనం అధర్మాన్ని ఆశ్రయిస్తే, అంతకు పది రెట్లు కష్టాలు, బాధలు కొనితెచ్చుకుంటాం.

డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు
నరసరావుపేట, ఫోన్: 9989749075

తెలుగులో సీక్వెల్స్ సంస్కృతికి విజయవంతంగా తెరతీసిన నిర్మాత, సితార ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత నాగవంశీ. ప్రస్తుతం తెలుగులో అగ్ర నిర్మాతల్లో ఒకరైన నాగవంశీ సోషల్ మీడియాలో తరచూ కనిపిస్తూ ఉంటారు. ప్రస్తుతం తెలుగు నిర్మాతలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి.. పరిశ్రమకు ఉన్న అవకాశాల గురించి ఆయన 'నవ్య'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలలోకి వెళ్తే...

ఇప్పుడు సినిమాలు తీయడం కష్టమే..!

'మ్యాడ్ 2' విజయం మీకు ఎలాంటి అనుభూతి మిగిల్చింది?

చాలా ఆనందంగా అనిపించింది. ఎందుకంటే ఒక సీక్వెల్ తీసి ప్రేక్షకులను మెప్పించటమనేది అంత సులభం కాదు. 'మ్యాడ్ 2'- హిందీలో బ్లాక్‌బస్టర్ అయిన 'గోల్‌మాల్' ఫ్రాంచైజ్ సినిమాల మాదిరిగా ఉంటుంది. దీనిలో స్టోరీ లైన్ ఉండదు. ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే ఉంటుంది. ఈ సినిమాకు 'మ్యాడ్' కన్నా నాలుగైదు రెట్లు వసూళ్లు వచ్చాయి. నా వరకు చాలా సంతృప్తిగా ఉన్నా.

హాలీవుడ్‌లో సీక్వెల్స్ బంగారు గుడ్లు పెట్టే బాతులు... ఆ తరహా వ్యూహంతోనే మీరు ఈ సినిమాలు తీసారా?

'టిల్లు', 'మ్యాడ్' సినిమాలు తీసే సమయంలో అవి సీక్వెల్స్‌గా మారతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. రెండో పార్ట్ విజయవంతమయిన తర్వాత మాత్రమే వీటిని ఫ్రాంచైజ్‌గా మార్చాలనుకున్నా. ఎందుకంటే- సినీ రంగంలో విజయం సాధించే సినిమాలు ఐదు శాతం మాత్రమే. ఎంత మంచి కంటెంట్‌తో సినిమా తీసినా- అది హిట్ అవుతుందని మనం చెప్పలేం. ఏవైనా పరాజయాలు ఎదురయితే - సీక్వెల్స్ ట్రంప్ కార్డ్‌గా ఉపయోగపడతాయి. ఎందుకంటే సీక్వెల్స్‌ను ఎప్పుడూ తీసినా అవి తప్పనిసరిగా విజయవంతమవుతాయి.

సినీ నిర్మాణం చాలా కష్టమయిపోయింది.. నిర్మాతలు సమస్యలు ఎదుర్కొంటున్నారనే వార్తలు వింటుంటాం.. వీటిలో నిజమెంత?

సినీ నిర్మాణం చాలా కష్టమయిపోయింది. ఇది వాస్తవం. ఎందుకంటే నిర్మాణ వ్యయం పెరిగిపోతోంది. ఆదాయ మార్గాలు మాత్రం మూసుకుపోతున్నాయి. ఉదాహరణకు శాటిలైట్ రైట్స్ (టీవీలలో ప్రసారాల ద్వారా) నుంచి వచ్చే ఆదాయం దాదాపు సున్నా అయిపోయింది. హిందీ డబ్బింగ్ నుంచి వచ్చే ఆదాయం కూడా రావటం లేదు. ఇక ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటున్నాయి. వీటికి తోడు - సినిమా చాలా బావుంటే తప్ప ప్రేక్షకులు థియేటర్‌కు రావటం లేదు. కొన్ని సినిమాలకు ఓపినింగ్స్ కూడా ఉండటం లేదు. ఈ కారణాల వల్ల నిర్మాతకు ఆదాయ మార్గాలు తగ్గాయి.

మరి నిర్మాణ వ్యయం తగ్గించుకోవచ్చు కదా...

నిర్మాణ విలువలు ఒక స్థాయిలో ఉంటే తప్ప ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమాలు చూడటం లేదు. సాంకేతిక విలువలు కావాలంటే ఖర్చు పెట్టాల్సిందే. అందుకే సినీ నిర్మాణం రిస్కీగా మారింది.

వందల కోట్ల కలెక్షన్లు వచ్చేస్తున్నాయని పోస్టర్లు పడుతున్నాయి కదా...

ఒక సంవత్సరంలో 100 సినిమాలు విడుదల అయ్యాయి అనుకుందాం. మీరు చెప్పిన వందల కోట్లు ఐదారు సినిమాలకే వస్తున్నాయి. మిగిలిన నిర్మాతలందరూ దెబ్బతింటున్నారు కదా..

మరి ఇంత రిస్కీ అయినప్పుడు సినిమాలు ఎందుకుతీస్తున్నారు?

మిగిలిన వారి గురించి నేను మాట్లాడను. కానీ నాకు కానీ.. మైత్రీ మూవీ మేకర్స్‌కు కానీ తెలిసిన పని ఇదే! "తెలిసిన పని ఫ్రీగా చేయకూడదు.. రాని పని చేయకూడదు" అని 'జులాయి'లో ఒక డైలాగ్ ఉంది. దాన్నే ఫాలో అవుతున్నాం. వేరే వ్యాపారాల్లోకి వెళ్లి దెబ్బతినటం కన్నా.. తెలిసిన ఈ పని బాగా చేయటం మంచిది కదా!

నిర్మాణ వ్యయం పెరిగిపోవటానికి ఎక్కువ రోజులు షూటింగ్ చేయటమే కారణమంటున్నారు కదా...

వర్కింగ్ డేస్ తగ్గించాలని ప్రయత్నిస్తున్నాం. కానీ కొన్ని సినిమాలకు తప్పదు. కంటెంట్‌పై రాజీ పడితే మొత్తానికే మోసం వస్తుంది. అందువల్ల కొన్ని సినిమాలకు ఖర్చు పెట్టక తప్పటం లేదు.

సినిమా విడుదలయిన వెంటనే 'ఐబొమ్మ' లాంటి వాటిలో పైరసీ ప్రింట్స్ వచ్చేస్తున్నాయి.. వీటిని అరికట్టలేరా?

గత కొన్ని నెలలుగా పైరసీ బాగా పెరిగింది. మంచి క్వాలిటీ ఉన్న ప్రింట్స్ బయటకు వచ్చేస్తున్నాయి. నా ఉద్దేశంలో పైరసీ చూసే వారు ఓ ఐదు శాతం మాత్రమే ఉంటారేమో.. ఎక్కువ మంది థియేటర్లలోనే సినిమా చూడాలనుకుంటారు.

అయినా కలెక్షన్లకు ఇది పెద్ద ప్రమాదంగా మారింది. ప్రస్తుతం ఛాంబర్‌లో ఉన్న యాంటీ పైరసీ విభాగం ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి సరిపోదు. ఇంతకు ముందు థియేటర్లలో ప్రింట్స్ తీసేవారు. ప్రస్తుతం పైరసీ అవుతున్నవి అలాంటివి కావు. మంచి క్వాలిటీ ఉన్న ప్రింట్స్. ఎక్కడి నుంచి లీక్ అవుతున్నాయో 'క్యూబ్' ద్వారా కనుక్కొవటానికి ప్రయత్నిస్తున్నాం.

సోషల్ మీడియా ప్రేక్షకుల అభిప్రాయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుందని మీరు భావిస్తున్నారా?

సోషల్ మీడియా వల్ల మంచి, చెడు- రెండూ ఉన్నాయి. మంచి విషయానికి వస్తే ఏదైనా కంటెంట్ వైరల్ కావాలంటే సోషల్ మీడియానే కావాలి. సోషల్ మీడియా యుగంలో దేనిని దాచుకోవాలనుకున్నా దాచుకోలేం. ఇక చెడు విషయానికి వస్తే- వ్యక్తిగత అభిప్రాయాలే ఎక్కువ ప్రచారంలోకి వస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఒక సినిమా బావుందా? లేదా అనే విషయంలో 40 మంది బావుంది అంటారు.. 40 మంది బావులేదంటారు. 20 మంది తటస్థంగా ఉండిపోతారు. ఇది పర్వాలేదు. కానీ ఎవరో ఒకరి అభిప్రాయం విస్తృతంగా ప్రచారమైతేనే సమస్య.




ఉండాలనుకుంటాం... కానీ

తెలుగు పరిశ్రమలో ఉన్న నిర్మాతలందరూ అన్ని విషయాల్లో ఏకాభిప్రాయంలో ఉండాలనుకుంటాం. మీటింగ్‌లలో మాట్లాడుకున్నప్పుడు ఏకాభిప్రాయమే ఉంటుంది. బుధవారం వరకు ఒక మాటపైనే ఉంటారు. గురువారం- అంటే సినిమా విడుదలవ్వటానికి ఒక రోజు ముందు నిర్మాతపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. కమిట్‌మెంట్స్ ఉంటాయి. అప్పటి దాకా ధైర్యంగా ఉన్న నిర్మాతలో ఎక్కడో చిన్నపాటి అభద్రతాభావం మొదలై 'ఇంతింతై వటుడింతై..' అన్నట్లు పెరిగిపోతుంది. ఈ సమయంలో వారిపై పీఆర్‌ఓలు ఒత్తిడి పెట్టడం మొదలుపెడతారు. "ఇది చేయకపోతే వాళ్లు ఇలా చేస్తారు..అలా చేస్తారు.." అని భయపెడుతూ ఉంటారు. దీంతో కొన్ని విషయాల్లో నిర్మాతలు రాజీపడిపోతారు. 'సినిమా బావుంటే చూస్తారు. బావుండకపోతే చూడరు'.. ఈ విషయం అందరి నరనరాల్లో జీర్ణమయిపోతే- ఇలాంటి ఒత్తిళ్లకు భయపడటం మానేస్తాం. దానికి చాలా ధైర్యం కావాలి..

కార్పొరేట్ పెట్టుబడులు రావటం వల్ల మంచి సినిమాలు ఎక్కువగా తీయగలుగుతాం. సితారలో 'మైహోం' సంస్థ పెట్టుబడులు పెట్టింది.. 'మైహోం' రాముకు సినిమాలపై మంచి అభిరుచి ఉంది. ఏదో చేయాలనే తపన ఉంది. అందుకే 'ఆహా' కూడా ప్రారంభించారు. ఇక సృజనాత్మకమైన నిర్ణయాలు విషయంలో కలగజేసుకోరు కాబట్టి ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

● సివిఎల్ఎన్ ప్రసాద్



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కిల్ టోనీ	హాలీవుడ్‌మూవీ	ఏప్రిల్ 07
ఛావా	హిందీ చిత్రం	ఏప్రిల్ 11
అమెజాన్ ప్రైమ్		
జీ 20	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 10
ఛోరీ 2	హిందీ చిత్రం	ఏప్రిల్ 11
జియో హాట్‌స్టార్		
ది లెజెండ్ ఆఫ్ హనుమాన్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 11
పీస్ బై పీస్	యానిమేషన్ సిరీస్	ఏప్రిల్ 11
సోనీ లివ్		
ప్రవీణ్‌కూడు షాప్పు	మలయాళ చిత్రం	ఏప్రిల్ 11

ఛోరీకి సీక్వెల్

అతీంద్రియ శక్తులు, సామాజిక దురాచారాల నుంచి తన బిడ్డను కాపాడుకునేందుకు ఓ తల్లి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో తెరకెక్కిన సూపర్ నేచురల్ హారర్ 'ఛోరీ 2'. గతంలో వచ్చిన హిందీ చిత్రం 'ఛోరీ'కి ఇది సీక్వెల్. ఓ మారుమూల గ్రామంలోని పాడుపడిన కోట నేపథ్యంలో బీభత్సరస ప్రధాన కథాంశంగా రూపుదిద్దుకుంది. నుస్రత్ భరూచా లీడ్‌రోల్ పోషించారు. విశాల్ ఫ్యూరియా దర్శకుడు. భూషణ్‌కుమార్ నిర్మించారు.



శిరోజాల కుదుళ్లు బలంగా...



పోషకాహార లోపం, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల కుదుళ్లు బలహీనమై శిరోజాలు రాలిపోతాయని నిపుణులు చెబుతున్నారు. కుదుళ్లు బలంగా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

- మాడు మీద చర్మం పొడిబారకుండా చూసుకుంటే కుదుళ్లు బలపడతాయి. ఆముదం, కొబ్బరినూనె, బాదం నూనె, ఆలివ్ నూనెల్లో ఒకదానితో తలంతా మర్దన చేసుకుంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఆ నూనెని కొద్దిగా వేడిచేసి ఉపయోగించడం వల్ల మాడు మీద రక్తప్రసరణ పెరిగి కుదుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.
- ప్రోటీన్లు, ఐరన్, బయోటిన్ లాంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలి. గుడ్లు, పాల ఉత్పత్తులు, తాజా కూరగాయలు, ఆకు కూరలు, పళ్లను ఆహారంలో చేర్చుకుంటే శిరోజాల కుదుళ్లు బలపడతాయి.

వెండి తెర రాముడు

తెలుగు సినిమాలకు, శ్రీరామునికి ప్రత్యేక అనుబంధం ఉంది. సినిమాల్లో రాముడు అనగానే మొదట గుర్తుకొచ్చే పేరు నందమూరి తారక రామారావు. నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు తెలుగులో తొలిసారిగా రాముడి పాత్రను పోషించినవారు యడవల్లి సూర్యనారాయణ. ఆ తర్వాత పారుపల్లి సుబ్బారావు. కానీ, రాముడి పాత్రలో ఎంత మంది నటించినా గుర్తొచ్చేది ఒక్క ఎన్టీఆర్ మాత్రమే.

1932లో వచ్చిన 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం'లో యడవల్లి సూర్యనారాయణ తొలిసారిగా రాముని పాత్రలో కనిపించారు. అప్పటికే రంగస్థల నటుడిగా పేరున్న సూర్యనారాయణ ఈ చిత్రం ద్వారా సినీ రంగంలోకి ప్రవేశించారు. బాదామి సర్వోత్తం దర్శకత్వంలో సాగర్ స్టూడియోస్ నిర్మించింది. తెలుగులో రెండో టాకీ చిత్రంగా తెరకెక్కింది. ఆ తర్వాత 1934లో వచ్చిన మొదటి 'లవకుశ'లో పారుపల్లి సుబ్బారావు రాముడి పాత్రను పోషించారు. 1959లో ఎస్.ఎ స్.ఎ. ఆచార్య దర్శకత్వంలో తెరకెక్కిన 'శ్రీ రామాంజనేయ యుద్ధం'లో అమర్‌నాథ్ రాముడిగా నటించారు.

- 'సీతారామ కల్యాణం', 'శ్రీరామ కథ' చిత్రాల్లో హరనాథ్ రాముడి పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకుల మనసులు దోచుకున్నారు.
- తొలి తరం తెలుగు నటుల్లో ఒకరైన కాంతారావు 'వీరాంజనేయ'లో రాముడిగా కనిపించారు.
- కృష్ణ తన తొలి చిత్రం 'తేనె మనసులు'లో రాముడి అవతారంలో కన్పించారు. 'అల్లూరి సీతారామరాజు'లో కూడా ఓ చోట రాముడి పాత్రను పోషించారు.
- 'రామదాసు' సినిమాలో సుమన్, 'దేవుళ్లు' చిత్రంలో శ్రీకాంత్ రాముడిగా అలరించారు.
- రామాయణం నేపథ్యంలో చివరగా వచ్చిన చిత్రం 'ఆదిపురుష్'. ఈ చిత్రంలో కథను ఆధునిక రీతిలో చెప్పే ప్రయత్నం చేశారు.



రెండో రాముడు ఏఎన్ఆర్

1944లో వెండితెరకు రెండో రాముడిగా అక్కినేని నాగేశ్వరరావు పరిచయమయ్యారు. 'సీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను ఆయన చక్కగా పోషించారు. ఈ సినిమా తర్వాత 1945లో వచ్చిన 'పాదుకా పట్టాభిషేకం'లో సీఎస్ఆర్ ఆంజనేయులు రాముడిగా కనిపించారు.

అదే మొదటిసారి

'చరణదాసి' అనే సాంఘిక కథా చిత్రంలో ఎన్టీఆర్ తొలిసారిగా రాముడి వేశంలో కన్పించారు. 1958లో విడుదలైన తమిళ 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముని పాత్రలో పూర్తి స్థాయిలో నటించారు. ఆ తర్వాత వచ్చిన 'లవకుశ' ఎన్టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. రామాంజనేయ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం చిత్రాల్లోనూ ఎన్టీఆర్ శ్రీరాముడి పాత్రలో నటించారు. 'శ్రీరామ పట్టాభిషేకం', 'సీతారామ కల్యాణం' చిత్రాలకు ఎన్టీఆర్ దర్శకత్వం కూడా వహించారు.

శోభన్‌బాబు

'భక్త పోతన'లో శోభన్‌బాబు తొలిసారిగా రాముడి పాత్రలో ఓ ఐదు నిమిషాలు కన్పిస్తారు. అలాగే బాపు దర్శకత్వంలో రూపొందిన 'సంపూర్ణ రామాయణం'లో పూర్తి స్థాయిలో రాముడి పాత్రను పోషించారు. ఈ సినిమా శోభన్‌బాబుకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఎన్టీఆర్ తరవాత రాముడి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన ఘనత ఒక్క శోభన్‌బాబుకే దక్కుతుంది. బాపు దర్శకత్వంలోనే వచ్చిన మరో సినిమా 'సీతాకల్యాణం'. ఇందులో జయప్రద సీతగా, మలయాళ నటుడు రవి రాముడిగా నటించారు. బాపు తెరకెక్కించిన చివరి చిత్రం 'శ్రీరామరాజ్యం'లో నందమూరి బాలకృష్ణ రాముడిగా నటించారు. 'లవకుశ'కు రీమేక్‌గా తీసిన ఈ చిత్రంలో బాలకృష్ణ అద్భుతంగా నటించి ఎన్టీఆర్‌ను మైమరపించారు.

బాల రాముడు

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణం(1996)'లో జూనియర్ ఎన్టీఆర్ రాముడిగా కనిపించారు. అన్ని పాత్రలనూ బాలలతో తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

కౌర్‌కు స్వర్ణం.. ఇషాకు రజతం

షూటింగ్ ప్రపంచ కప్



స్విఫ్ట్ కౌర్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): భారత యువ షూటర్ స్విఫ్ట్ కౌర్, తెలంగాణ స్టార్ ఇషా సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో పతకాలతో సత్తా చాటారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో స్విఫ్ట్ కౌర్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో కౌర్ ఫస్ట్ నీలింగ్ పొజిషన్‌లో అనిటా మ్యాన్‌గోల్డ్ (జర్మనీ) కంటే 7.2 పాయింట్లు వెనుకంజలో నిలిచినా.. ఆఖర్లో అదిరే ప్రదర్శన చేసింది. కౌర్ మొత్తం 458.6 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మ్యాన్‌గోల్డ్ రజతం, అరీనా అల్టుకొవా (కజకిస్థాన్) కాంస్యం దక్కించుకొన్నారు. ఇక, మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా రజతం సాధించింది. ఫైనల్స్‌లో ఇషా 35 పాయింట్లతో రెండోస్థానంలో నిలవగా.. చైనా షూటర్లు యూజీ సన్ (38), సిజువాన్ ఫెంగ్ (30) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలను అందుకున్నారు.



ఇషా సింగ్

ఫైనల్లో జమ్వాల్

బాక్సింగ్ వరల్డ్ కప్



న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న బాక్సింగ్ వరల్డ్‌కప్‌లో భారత యువ బాక్సర్ అభినాష్ జమ్వాల్ ఫైనల్‌కు చేరుకొని కనీసం రజతం ఖాయం చేశాడు. పురుషుల 65 కిలోల సెమీస్‌లో జమ్వాల్ 5-0తో గియాన్‌లుగి మలంగ (ఇటలీ)ను మట్టికరిపించాడు. ఫైనల్లో యూరీ రీస్ (బ్రెజిల్)తో అభినాష్ తలపడనున్నాడు. కాగా, 55 కిలోల సెమీస్‌లో మనీష్ రాథోడ్ 0-5తో నూర్‌సుల్తాన్ అంటెన్‌బెక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు.

హ్యాట్రిక్

రాణించిన రాహుల్

25 పరుగులతో సూపర్‌కింగ్స్ చిత్తు

విజయాల్లో ఢిల్లీ.. ఓటముల్లో చెన్నై

చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగిస్తూ ఈ ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయం అందుకుంది. మరోవైపు చెన్నై సూపర్‌కింగ్స్ ఓటములలో హ్యాట్రిక్ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో క్యాపిటల్స్ 25 పరుగులతో చెన్నైని ఓడించింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 183/6 స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ (51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 77) సొగసైన హాఫ్ సెంచరీ చేశాడు. అభిషేక్ పోరెల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 33) సత్తా చాటాడు. స్టబ్స్ (24), కెప్టెన్ అక్షర్ పేటల్ (21) పర్వాలేదనిపించారు. ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 158/5కే పరిమితమైంది. విజయ్ శంకర్ (54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 69 నాటౌట్), ధోనీ (26 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్సర్‌తో 30 నాటౌట్) మాత్రమే రాణించారు. విప్రాజ్ 2 వికెట్లు తీశాడు. కేఎల్ రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

మారని సీఎస్‌కే బ్యాటింగ్: మరోసారి చెన్నై బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ రచిన్ (3)తోపాటు జట్టులోకి వచ్చిన కాన్వే (13), కెప్టెన్ రుతురాజ్ (5) విఫలం కావడంతో పవర్ ప్లేలో 46/3తో నిలిచిన సీఎస్‌కే ఆపై ఏ దశలోనూ పోటీలోకి రాలేకపోయింది. శివమ్ దూబే (18), జడేజా (2) నిరాశపరిచారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన ధోనీ, విజయ్ శంకర్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 84 పరుగులు చేయడం ఓటమిలో చెన్నై జట్టుకు ఒకింత ఊరట.

కేఎల్ క్లాస్ ఇన్నింగ్స్: టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా..కేఎల్ రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రెండు అర్ధ శతక భాగస్వామ్యాలతో జట్టు ఇన్నింగ్స్‌కు వెన్నుముకలా నిలిచాడు. అభిషేక్ పోరెల్‌తో కలిసి రెండో వికెట్‌కు 54 పరుగులు, సమీర్ రిజ్వీ (20)తో కలిసి నాలుగో వికెట్‌కు 56 రన్స్ జోడించాడు.



కేఎల్ రాహుల్ (77)

15 2010 తర్వాత..అంటే 15 ఏళ్ల అనంతరం తొలిసారి చెన్నై వేదికగా సూపర్ కింగ్స్‌పై ఢిల్లీ గెలిచింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ మెక్‌గర్క్ (సి) అశ్విన్ (బి) ఖలీల్ 0, కేఎల్ రాహుల్ (సి) ధోనీ (బి) పథిరన 77, అభిషేక్ పోరెల్ (సి) పథిరన (బి) జడేజా 33, అక్షర్ (బి) నూర్ అహ్మద్ 21, రిజ్వీ (సి) జడేజా (బి) ఖలీల్ 20, స్టబ్స్ (నాటౌట్) 24, అశుతోష్ (రనౌట్) 1, విప్రాజ్ నిగమ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 183/6; వికెట్ల పతనం:** 1-0, 2-54, 3-90, 4-146, 5-179, 6-180; **బౌలింగ్:** ఖలీల్ 4-0-25-2, ముకేశ్ చౌదరి 4-0-50-0, అశ్విన్ 3-0-21-0, జడేజా 2-0-19-1, నూర్ అహ్మద్ 3-0-36-1, పథిరన 4-0-31-1.

చెన్నై: రచిన్ (సి అండ్ బి) ముకేశ్ కుమార్ 3, కాన్వే (సి) అక్షర్ (బి) విప్రాజ్ 13, రుతురాజ్ (సి) ఫ్రేజర్ (బి) స్టార్క్ 5, విజయ్ శంకర్ (నాటౌట్) 69, శివమ్ దూబే (సి) స్టబ్స్ (బి) విప్రాజ్ 18, జడేజా (ఎల్బీ) కుల్దీప్ 2, ధోనీ (నాటౌట్) 30, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 158/5; వికెట్ల పతనం:** 1-14, 2-20, 3-41, 4-65, 5-74; **బౌలింగ్:** స్టార్క్ 4-0-27-1, ముకేశ్ కుమార్ 4-0-36-1, మోహిత్ 3-0-27-0, విప్రాజ్ నిగమ్ 4-0-27-2, కుల్దీప్ 4-0-30-1, అక్షర్ 1-0-5-0.

మహీ.. మెరుపు వేగంతో..



అశుతోష్‌ను రనౌట్ చేస్తున్న ధోనీ

43 ఏళ్ల ధోనీ వికెట్ల వెనుక ఎంత చురుగ్గా ఉంటాడో ఈ ఐపీఎల్‌లో కళ్లు మూసి తెరిచేలోపు రెండు స్టంపింగ్‌లు చేయడం ద్వారా చూశాం. అలాగే ఢిల్లీతో మ్యాచ్‌లో అశుతోష్ శర్మ (1)ను అంతే వేగంగా రనౌట్ చేశాడు. పథిరన వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్ మూడో బంతిని ఢిల్లీ బ్యాటర్ అశుతోష్ డీప్ స్క్వేర్ లెగ్ దిశగా కొట్టి మొదటి పరుగు తీశాడు. అతను రెండో పరుగుకోసం వస్తుండగా బంతిని ఫీల్డ్ చేసిన జడేజా వికెట్ కీపర్ వైపు విసిరాడు. అప్పటికి వికెట్లకు దూరంగా ఉన్న ధోనీ మెరుపు వేగంతో కదిలాడు. జడేజా విసిరిన బంతిని అందుకొని క్షణాల్లో వికెట్లను గిరాటేశాడు. దాంతో అశుతోష్ రనౌట్‌గా వెనుదిరిగాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	4	1	3	0	2	0.108
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	4	1	3	0	2	-1.612

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

గెలుపే లక్ష్యంగా..

నేడు టైటాన్స్‌తో హైదరాబాద్ పోరు

హైదరాబాద్: హ్యాట్రిక్ ఓటములతో డీలా పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదివారం సొంత మైదానంలో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అటు వరుసగా రెండు విజయాలతో జోరు మీదున్న గుజరాత్ టైటాన్స్ జట్టు కమిన్స్ సేనకు సవాల్ విసరనుంది. బలంగా భావించిన బ్యాటింగ్ ఆర్డర్ వైఫల్యంతోనే రైజర్స్ తన మ్యాచ్‌లను ఓడుతూ వస్తోంది. ఆరంభ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన వీరంతా ఆ తర్వాత ప్రత్యర్థి జట్ల బౌలర్లకు దాసోహమయ్యారు. దీంతో జట్టు వరుసగా 190, 163, 120 స్కోర్లకే పరిమితమై, పట్టికలోనూ అట్టడుగున కొనసాగుతోంది. జట్టులో క్లాసెన్ మాత్రమే నిలకడగా రాణిస్తున్నాడు. 300 స్కోరు కోసం కాకుండా హెడ్, అభిషేక్, ఇషాన్, నితీశ్ జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడాలి. అటు బౌలింగ్‌లోనూ యువ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఒక్కడే ఆశాకిరణంలా మారాడు. పేసర్లు కమిన్స్, షమి సహా మిగతా బౌలర్లంతా పరుగులిచ్చుకుంటున్నారు. టైటాన్స్ తొలి మ్యాచ్‌లో ఓడినా ఆ తర్వాత రెండు విజయాలతో నిలిచింది. ఓపెనర్ సాయిసుదర్శన్, గిల్, బట్లర్, రూథర్‌ఫోర్డ్, మిల్లర్, తెవాటియాలతో బ్యాటింగ్ పటిష్ఠంగా ఉంది. పేసర్ రబాడ స్వదేశానికి వెళ్లడంతో అతడిస్థానంలో ఫిలిప్స్, కొట్జీలలో ఒకరిని ఆడించే చాన్సుంది.



ప్రాక్టీస్‌లో సిరాజ్, ఇషాన్

ఐపీఎల్‌లో నేడు | వేదిక హైదరాబాద్

సన్‌రైజర్స్ x గుజరాత్ | రా.7.30

పంజాబ్‌కు ఝలక్



- రాజస్థాన్ ఘన విజయం
- జైస్వాల్ హాఫ్ సెంచరీ
- కట్టడి చేసిన బౌలర్లు

జైస్వాల్ (67)

1 రాజస్థాన్‌కు ఎక్కువ విజయాలు (32) అందించిన కెప్టెన్‌గా శాంసన్. వార్న్ (31)ను అధిగమించాడు.

చండీగఢ్: ఐపీఎల్‌లో జోరు మీదున్న పంజాబ్ కింగ్స్‌కు గట్టి షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (45 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 67) సీజన్‌లో తొలిసారి మెరవగా.. పేసర్ ఆర్చర్ (3/25) పదునైన బౌలింగ్‌తో దెబ్బతీశాడు. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రాజస్థాన్‌కిది రెండో గెలుపు కాగా.. పంజాబ్‌కు మూడు మ్యాచ్‌ల్లో తొలి ఓటమి. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 43 నాటౌట్), సంజూ శాంసన్ (26 బంతుల్లో 6 ఫోర్లతో 38) రాణించారు. ఫెర్గూసన్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 రన్స్ చేసి ఓడింది. నేహల్ వధేరా (41 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 62), మ్యాక్స్‌వెల్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 30) ఆకట్టుకున్నారు. సందీప్, తీక్షణలకు రెండేసి వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఆర్చర్ నిలిచాడు.

తొలి ఓవర్‌లోనే షాక్: భారీ ఛేదనలో పంజాబ్ బ్యాటర్ నేహల్ వధేరా మాత్రమే పోరాడాడు. మ్యాక్స్‌వెల్ కాస్త సహకరించినా మిగతా వారంతా తీవ్రంగా నిరాశపరిచారు. పేసర్ ఆర్చర్ బుల్లెట్ లాంటి బంతులతో తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ప్రియాన్ష్ (0), కెప్టెన్ శ్రేయాస్ (10)లను బౌల్డ్ చేశాడు. కాసేపటికే స్టొయినిస్ (1)ను సందీప్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో పంజాబ్ 26/3 స్కోరుతో కష్టాల్లో పడింది. అటు బంతికో పరుగు చొప్పున సాధించిన మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (17) ఏడో ఓవర్‌లో వెనుదిరగగా.. నేహల్, మ్యాక్స్‌వెల్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. అయితే మధ్య ఓవర్లలో రాయల్స్ బౌలర్లు కట్టడి చేశారు. పదో ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ 6,4, నేహల్ 6తో 19 రన్స్ వచ్చాయి. ఈ జోడీ అడపాదడపా బౌండరీలు సాధించడంతో పంజాబ్ విజయంపై ఆశలు పెట్టుకుంది. 33 బంతుల్లో ఓ సిక్సర్‌తో నేహల్ హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. కానీ వరుస ఓవర్లలో మ్యాక్స్‌వెల్‌ను తీక్షణ.. నేహల్‌ను హసరంగ అవుట్ చేశారు. వీరి మధ్య ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. అప్పటికి చివరి 4 ఓవర్లలో 70 రన్స్ కావాల్సి ఉండడంతో పంజాబ్‌కు పరాజయం తప్పలేదు.

జైస్వాల్ అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ అదరగొట్టింది. అలాగే రియాన్ పరాగ్ డెత్ ఓవర్లలో వేగం కనబర్చడంతో జట్టు స్కోరు 200 దాటింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఈసారి స్థాయికి తగ్గట్టుగా ఆడాడు. మరో ఓపెనర్ శాంసన్ సైతం రాణించడంతో ఆరంభంలో పంజాబ్ బౌలర్లు ఇబ్బందిపడ్డారు. నాలుగో ఓవర్‌లో జైస్వాల్ రెండు సిక్సర్లతో 19 రన్స్ సమకూరాయి. అలాగే ఈ సీజన్‌లో వికెట్ కోల్పోకుండా రాజస్థాన్ పవర్‌ప్లేలో 53 పరుగులతో నిలిచింది. చక్కగా కుదురుకున్న శాంసన్‌ను 11వ ఓవర్‌లో ఫెర్గూసన్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చాహల్ ఓవర్‌లో జైస్వాల్ 4,6తో 40 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ తర్వాత 13వ ఓవర్‌లో జైస్వాల్ 6,4, పరాగ్ 4తో 17 రన్స్ వచ్చాయి. కానీ వరుస ఓవర్లలో రాజస్థాన్.. జైస్వాల్, నితీశ్ రాణా (12) వికెట్లను కోల్పోయింది. ఇక చివరి ఐదు ఓవర్లలో వేగం పెంచిన పరాగ్‌కు హెట్‌మయెర్ (20) జత కలిశాడు. అర్ష్‌దీప్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించిన పరాగ్.. జాన్సెన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో చెలరేగాడు. అయితే అదే ఓవర్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను జాన్సెన్ అందుకోలేకపోయాడు. 19వ ఓవర్‌లో హెట్‌మయెర్ అవుటైనా.. చివరి ఓవర్‌లో పరాగ్ 6. జురెల్ (13 నాటౌట్) 6,4 కారణంగా 19 రన్స్ రావడంతో రాజస్థాన్ భారీ స్కోరందుకుంది.

స్కోరుబోర్డు



ఆర్చర్ 4-0-25-3

రాజస్థాన్: జైస్వాల్ (బి) ఫెర్గూసన్ 67, శాంసన్ (సి) శ్రేయాస్ (బి) ఫెర్గూసన్ 38, రియాన్ పరాగ్ (నాటౌట్) 43, నితీశ్ రాణా (సి) మ్యాక్స్‌వెల్ (బి) జాన్సెన్ 12, హెట్‌మయెర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ 20, జురెల్ (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 205/4; వికెట్ల పతనం:** 1-89, 2-123, 4-138, 4-185; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-1, జాన్సెన్ 4-0-45-1, ఫెర్గూసన్ 4-0-37-2, మ్యాక్స్‌వెల్ 1-0-6-0, చాహల్ 3-0-32-0, స్టొయినిస్ 4-0-48-0.

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (బి) ఆర్చర్ 0, ప్రభ్‌సిమ్రన్ (సి) హసరంగ (బి) కార్తికేయ 17, శ్రేయాస్ అయ్యర్ (బి) ఆర్చర్ 10, స్టొయినిస్ (సి అండ్ బి) సందీప్ 1, నేహల్ వధేరా (సి) జురెల్ (బి) హసరంగ 62, మ్యాక్స్‌వెల్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, శశాంక్ సింగ్ (నాటౌట్) 10, సుయాన్ష్ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 2, జాన్సెన్ (సి) హెట్‌మయెర్ (బి) తీక్షణ 3, అర్ష్‌దీప్ (సి) హసరంగ (బి) ఆర్చర్ 1, ఫెర్గూసన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 155/9; వికెట్ల పతనం:** 1-0, 2-11, 3-26, 4-43, 5-131, 6-131, 7-136, 8-145, 9-151; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-25-3, యుధ్‌వీర్ 2-0-20-0, సందీప్ శర్మ 4-0-21-2, తీక్షణ 4-0-26-2, కుమార్ కార్తికేయ 2-0-21-1, హసరంగ 4-0-36-1.

ధోనీ కోసం.. ప్రత్యేక అతిథులు



చెన్నై: చెన్నై-ఢిల్లీ మ్యాచ్ ఓ అరుదైన దృశ్యానికి వేదికైంది. ప్రత్యేక అతిథులతో సందడిగా మారింది. ధోనీ తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకీ దేవి ఈ మ్యాచ్‌కు హాజరయ్యారు. 2008 నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ ఆడుతున్నా..తమ కుమారుడి మ్యాచ్‌ను వీక్షించేందుకు పాన్ సింగ్, దేవకీ దేవీ స్టేడియానికి రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ధోనీ భార్య సాక్షి, కూతురు జీవా కూడా మ్యాచ్‌కు హాజరయ్యారు. అయితే ఎన్నడూ మ్యాచ్‌లకు రాని ధోనీ తల్లిదండ్రులు.. ఈసారి స్టేడియంలో దర్శనమివ్వడంతో మహీకిదే చివరి ఐపీఎల్ అన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆఖరిసారి తమ కుమారుడి వికెట్ కీపింగ్, బ్యాటింగ్ నైపుణ్యాలను కళ్లారా వీక్షించేందుకే ధోనీ తల్లిదండ్రులు వచ్చారంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

కివీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ పాక్ చిత్తు

మౌంట్ మాంగనుయ్: పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మైదానంలో చిత్తడి కారణంగా 42 ఓవర్లకు కుదించిన మూడో, ఆఖరి వన్డేలో కివీస్ 43 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత న్యూజిలాండ్ 264/8 స్కోరు చేసింది. బ్రేస్‌వెల్ (59), రైస్ (58) అర్ధ శతకాలు సాధించారు. అకిఫ్ జావెద్ 4 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో పాక్ 40 ఓవర్లలో 221 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజమ్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. బెన్ సీర్స్ 5 వికెట్లతో పాక్ వెన్నువిరిచాడు. టీ20 సిరీస్‌ను కూడా పాక్ 1-4తో కోల్పోయిన సంగతి తెలిసిందే.

పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా

దిగ్వేష్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత



లఖ్‌నవూ: ముంబైతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. లఖ్‌నవూ బౌలర్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన దానికంటే ఓ ఓవర్ వెనుకబడ్డారు. దీంతో ఆఖరి ఓవర్‌లో రింగ్ వెలుపల ఓ ఫీల్డర్‌ను తగ్గించాల్సి వచ్చింది. ఇదే తొలి తప్పిదం కావడంతో సారథి పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించినట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, లఖ్‌నవూ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ రెండోసారి ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించడంతో అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. నమన్ ధిర్ అవుటైన తర్వాత కూడా అతడు మరోసారి నోట్‌బుక్ సెలబ్రేషన్స్ చేసుకొన్నాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఫీజులో సగం కోతతోపాటు రెండు డీమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో చేరాయి.



1996 వరల్డ్‌కప్ విజేతలతో మోదీ

కొలంబో: శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. 1996 వరల్డ్‌కప్ నెగ్గిన శ్రీలంక క్రికెట్ జట్టు సభ్యులను కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆ జట్టు సభ్యులైన కుమార ధర్మసేన, అరవింద డిసిల్వ, సనత్ జయసూర్య, చమింద వాస్, ఉపుల్ చందన, ఆటపట్టు.. మోదీకి జ్ఞాపికను బహూకరించారు. ప్రపంచకప్ ఫైనల్లో అర్జున రణతుంగ కెప్టెన్సీలోని లంక ఏడు వికెట్లతో ఆస్ట్రేలియాను ఓడించింది. '1996 వరల్డ్‌కప్ విజేత లంక జట్టును కలుసుకొన్నందుకు ఆనందంగా ఉంది' అని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు. వాళ్లతో దిగిన ఫొటోలను షేర్ చేశారు.

TATA CAPITAL

టాటా క్యాపిటల్ రూ.17,000 కోట్ల ఐపీఓ

కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు

టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ.. టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ఈ నెల 4న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ దాదాపు 200 కోట్ల డాలర్లు (సుమారు రూ.17,000 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా టాటా క్యాపిటల్ విలువను 1,100 కోట్ల డాలర్లు (రూ.93,500 కోట్లు)గా లెక్కగట్టినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు కొంత మంది వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) రూపంలో తమ వాటాలను విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో టాటా క్యాపిటల్ వెల్లడించింది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎ్‌ఫసీ సంస్థలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 92.83 శాతం వాటా ఉంది. రెండేళ్ల వ్యవధిలో టాటా గ్రూప్ నుంచి వస్తున్న రెండో ఐపీఓ ఇది. 2023లో టాటా టెక్నాలజీస్ స్టాక్ మార్కెట్లో లిస్టయిన సంగతి తెలిసిందే.

పర్సనల్ లోన్.. తనఖా రుణం ఏది బెటర్!



ఎంపిక ఎలా..?

వ్యక్తిగత రుణానికి తాకట్టు అవసరం లేదు. రుణమూ త్వరగానే లభిస్తుంది. కానీ, వడ్డీయే కాస్త ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తనఖా రుణాలపై వడ్డీ తక్కువ. పెద్ద మొత్తంలో రుణం తీసుకోవచ్చు. కాకపోతే, ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టాల్సిందే. పైగా ప్రహసనంతో కూడిన ప్రక్రియ. మరి ఏది సరైనది..? అంటే, మీ అవసరం, పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత రుణం తీసుకోవాలా..? తనఖా రుణం కోసం ప్రయత్నించాలా..? అనే సందిగ్ధ స్థితిలో ఉన్నవారు సరైన ఎంపిక చేసుకోవడానికి పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం..

వ్యక్తిగత రుణాలతో పాటు తనఖా రుణాలకూ కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం కూడా. ఈ రెండింటి ప్రత్యేకతలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే, ఎంపిక సులభమవుతుంది. అలాగే, మీ ఆర్థిక అవసరాన్ని, క్రెడిట్ స్కోర్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

వ్యక్తిగత రుణం

ఇది తనఖారహిత రుణం. అంటే, ఈ రుణం కోసం ఏమీ తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ఈ రుణాలను మీ క్రెడిట్ స్కోర్, హిస్టరీ ఆధారంగా మంజూరు చేస్తారు. ఇందులో రుణదాతకు రిస్క్ ఎక్కువ. అందుకే, అధిక వడ్డీ వసూలు చేస్తారు. తాకట్టు అవసరం అవసరం లేకపోవడం, త్వరితగతిన రుణ మంజూరు, తీసుకున్న సొమ్మును ఏ అవసరానికైనా ఉపయోగించుకోగలిగే వెసులుబాటు ఈ రుణ అనుకూలతలు. మిగతా రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రతికూలమే. మీ ఆదాయం, పరపతి స్థాయి, క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మీకు ఎంత రుణం మంజూరు చేయవచ్చనే అంశాన్ని రుణదాత నిర్ణయిస్తారు. ఆదాయం తక్కువగా ఉంటే మీరు ఆశించినంత రుణం లభించకపోవచ్చు. క్రెడిట్ స్కోర్ అంత బాగా లేని పక్షంలోనూ అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైగా, రుణ మొత్తంలోనూ రాజీ పడాల్సిందే.

తనఖా రుణం

ఇది తాకట్టుపై లభించే రుణం. ఇందుకోసం రుణగ్రహీత తనకు చెందిన ఏ ఆస్తినైనా తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సాధారణంగా ఏదైనా స్థిరాస్తి కొనుగోలుకు లేదా ప్రస్తుత ప్రాపర్టీని తాకట్టు పెట్టి నిధులు సమీకరించేందుకు ఈ రుణాన్ని ఎంచుకుంటారు. దీని సానుకూలత విషయానికొస్తే, ఇందులో రుణదాతకు నష్ట భయం తక్కువ. కాబట్టి వ్యక్తిగత రుణంతో పోలిస్తే కాస్త తక్కువ వడ్డీకే లభిస్తుంది. ఆస్తి విలువ ఆధారంగా రుణమిస్తారు కాబట్టి, అధిక మొత్తంలో సొమ్ము లభించే అవకాశం ఉంటుంది. పైగా, తనఖా రుణాల తిరిగి చెల్లింపులకూ చాలా సంవత్సరాలు సమయం లభిస్తుంది. తద్వారా తక్కువ మొత్తంలో నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో సుదీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ప్రతికూలతల గురించి ప్రస్తావించాలంటే, రుణం కావాలంటే ఏదైనా ఆస్తిని తప్పనిసరిగా తాకట్టు పెట్టాల్సిందే. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో రుణదాత మీ ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రుణ దరఖాస్తు ప్రాసెసింగ్, మంజూరుకూ కొంత సమయం పడుతుంది. ప్రాసెసింగ్ చార్జీలూ అధికమే. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కూడా ప్రహసనంతో కూడిన ప్రక్రియ.

ఉద్దేశం: ప్రాపర్టీ కొనుగోలుకైతే తనఖా రుణం మేలు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి లేదా ఏదైనా ఆర్థిక అత్యయిక పరిస్థితుల నుంచి బయటపడేందుకైతే వ్యక్తిగత రుణం మెరుగైన ప్రత్యామ్నాయం.

సమయం: తక్షణమే నిధులు కావాలంటే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కాస్త సమయం పట్టినా పర్వాలేదు, పెద్ద మొత్తంలో నిధులు కావాలంటే తనఖా రుణం కోసం ప్రయత్నించవచ్చు.

వడ్డీ రేటు: తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు అధిక వడ్డీ అయినా పర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. తక్కువ వడ్డీయే మీ ప్రాధాన్యమైతే, తక్షణ అవసరం కాని పక్షంలో తనఖా రుణాన్ని ఎంచుకోండి.

క్రెడిట్ స్కోర్: ఈ రెండింటిలో మీ అవసరానికి సరిపోయే రుణాన్ని ఎంచుకోవడంలో క్రెడిట్ స్కోర్, హిస్టరీ చాలా కీలకం. ఎందుకంటే, రుణం ఇవ్వాలా..? వద్దా..? అనే విషయంలో క్రెడిట్ స్కోరే మీ అర్హతను నిర్ణయిస్తుంది. అంతేకాదు, మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే రుణ దాత ఎంత వడ్డీ వసూలు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తాడు. కాబట్టి, తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను మరింత పెంచుకోవచ్చు. తద్వారా భవిష్యత్‌లో తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశముంటుంది.

బిజినెస్ ప్లస్

- హెచ్‌డీఎ్‌ఫసీ మ్యూచువల్ ఫండ్.. వాట్సాప్ ఆధారిత 'టాప్2ఇన్వెస్ట్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేవైసీని పూర్తి చేసుకున్న ప్రస్తుత ఇన్వెస్టర్లు ఎంఎఫ్ పథకాల్లో నేరుగా పెట్టుబడులు పెట్టడంతో పాటు చెల్లింపులు చేసేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని హెచ్‌డీఎ్‌ఫసీ ఎంఎఫ్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	440
వరంగల్	407	గోదావరి	440
చిత్తూరు	470	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	120
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	95
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	114	అనంతపురం	100
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,660 ▼	83,100 ▼	1,03,000 ▼
విజయవాడ	91,500 ▼	86,000 ▲	90,700 ▼
విశాఖపట్నం	89,340 ▲	81,900 ▲	87,700 ▼
రాజమండ్రి	90,650 ▼	83,100 ▼	95,200 ▼
ప్రొద్దుటూరు	91,150 ▼	83,860 ▼	91,200 ▼
ముంబై	91,014 ▲	83,369 ▲	92,910 ▼

30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

6 వేల మంది సిబ్బందితో పటిష్ఠ ఏర్పాట్లు

డెహ్రాడూన్, ఏప్రిల్ 5: ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత చార్‌ధామ్ యాత్ర ఈనెల 30న ప్రారంభం కానుంది. అదే రోజు గంగోత్రి, యమునోత్రి దేవాలయాలు కూడా తెరుచుకోనున్నాయి. కేదార్‌నాథ్ ఆలయం మే 2న, బద్రీనాథ్ ఆలయం మే 4న తెరుచుకుంటాయి. దీంతో చార్‌ధామ్ యాత్రను ప్రారంభించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్ర మార్గాన్ని 15 సూపర్ జోన్‌లు, 41 జోన్‌లు, 137 సెక్టార్లుగా వర్గీకరించారు. భద్రత, రవాణా ఏర్పాట్లు పర్యవేక్షించడానికి 6 వేల మందికి పైగా పోలీసు, ఇతర సిబ్బందిని నియమించనున్నారు. ఈ విషయాన్ని గర్వాల్ ఐజీ స్వరూప్ శనివారం మీడియాకు తెలిపారు. ప్రతి సెక్టార్ 10 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంటుందని, భద్రతా సిబ్బంది 24 గంటలూ పెట్రోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. రేంజ్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక చార్‌ధామ్ సెల్ ఏర్పాటు చేస్తున్నారు. సీసీటీవీ నిఘా పెంచారు. ట్రాఫిక్ వ్యవస్థకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. యాత్రికుల కోసం వికాస్‌నగర్‌లో బస ఏరాట్లు చేస్తున్నారు. సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక అధికారిని నియమించనున్నారు.

ఆస్ట్రేలియా కదిలొస్తోంది..!

ఇండియా ఇరుగుపొరుగు దేశాలను ప్రస్తావిస్తూ ఆస్ట్రేలియా పేరు చెబితే ఎలా ఉంటుంది. అదేమిటి ఎక్కడో సముద్రాల మధ్యలో ఉన్న ఆస్ట్రేలియా మనకు పొరుగుదేశం ఏమిటన్న సందేహం వస్తోందా? నిజంగా నిజమే.. కాకపోతే కొన్ని కోట్ల ఏళ్ల తర్వాత ఆ చాన్స్ రానుంది. ఆస్ట్రేలియా ఖండం ఉన్న టెక్టానిక్ ప్లేట్ మెల్లమెల్లగా ఆసియా ఖండం వైపు కదులుతూ వస్తుండటమే దీనికి కారణం. నిజానికి భూమి ఉపరితలం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. నీటిపై తేలుతున్న ఆకుల్లా.. మాగ్మా (ద్రవరూప శిలాద్రవం)పై టెక్టానిక్ ప్లేట్లు కదులుతూ ఉంటాయి. సగటున ఏడాదికి 1.5 సెంటీమీటర్ల వేగంతో ఈ కదలిక ఉంటుంది. అదే ఆస్ట్రేలియన్ ప్లేట్ ఏటా ఏడు సెంటీమీటర్ల వేగంతో కదులుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది అత్యంత స్వల్పం కావడం వల్ల మనకు తేడా ఏమీ ఏర్పడదు. కానీ మనం నావిగేషన్ కోసం వినియోగించే జీపీఎస్‌లో మాత్రం పెద్ద తేడా వచ్చేసింది. ఆస్ట్రేలియా 1994లో గుర్తించిన అక్షాంశ, రేఖాంశాల కోఆర్డినేట్స్‌నే జీపీఎస్‌లో వాడుతూ వచ్చింది. కానీ 2017లో పరిశీలించినప్పుడు సుమారు ఆరు అడుగుల (1.8 మీటర్లు) తేడా వచ్చింది. అంటే ఆస్ట్రేలియా ఈశాన్య దిశగా అంత దూరం కదిలిందన్న మాట. దీనితో ఆ దేశం జీపీఎస్ కోఆర్డినేట్స్‌ను మార్చుకోవాల్సి వచ్చింది.

జెలెన్‌స్కీ సొంత నగరంపై రష్యా దాడి

9 మంది చిన్నారులు సహా 18 మంది మృతి

- యుద్ధాన్ని ఆపే ఆలోచన రష్యాకు లేదన్న జెలెన్‌స్కీ
- కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగలో తొక్కిన రష్యా




కీవ్, ఏప్రిల్ 5: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవి రిపై రష్యా జరిపిన దాడిలో 9 మంది చిన్నారులు సహా 18 మంది చనిపోయారు. 61 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. సాధారణ జనావాసాలే లక్ష్యంగా క్షిపణి దాడులు జరిపారని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఎక్కడ దాడులు జరుపుతున్నామనేది తెలిసే రష్యా దాడులు జరిపిందన్నారు. యుద్ధాన్ని ఆపే ఆలోచన రష్యాకు లేదనే విషయం ఈ దాడితో తేటతెల్లమైందన్నారు. అమెరికా, యూరప్, ఇతర దేశాలు రష్యాపై ఒత్తిడి తెచ్చి యుద్ధాన్ని ఆపేలా చూడాలని జెలెన్‌స్కీ కోరారు. మరోవైపు తమ దాడిలో 85 మంది ఉక్రెయిన్ సైనికులు హతమయ్యారని రష్యా ప్రకటించుకుంది. అమెరికా ప్రతిపాదించిన నెల రోజుల కాల్పుల విరమణకు రష్యా-ఉక్రెయిన్ అంగీకరించినా దాడులు కొనసాగుతున్నాయి. తాజా దాడితో కాల్పుల విరమణ ఒప్పందాన్ని రష్యా తుంగలో తొక్కినట్లైంది.

పోలవరం పూర్తే చంద్రబాబు లక్ష్యం: సుజాత



అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయనున్నట్లు మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు నీరందించాలనేది చంద్రబాబు లక్ష్యం. రాష్ట్ర విభజన సమయంలో కన్నా వైసీపీ పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది 2014-19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టుకు సుమారు రూ.11,762 కోట్లు ఖర్చు చేస్తే జగన్ పాలనలో కేవలం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నీటిపారుదల శాఖపై అవగాహన లేని వారిని మంత్రులుగా చేసిన ఘనత జగన్‌దే' అని సుజాత ఎద్దేవా చేశారు.

ముస్లింల గొంతు కోసిన వైసీపీ: దీపక్‌రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముస్లింల అభ్యున్నతి కోసం పనిచేసే పార్టీ టీడీపీ అని సీడ్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ మతం పేరుతో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుంది. వక్ఫ్ బిల్లులో ముస్లింల హక్కుల కోసం మూడు సవరణలను ప్రతిపాదించిన ఒకే ఒక్క పార్టీ టీడీపీ. వైసీపీ ముస్లింలను నమ్మించి గొంతుకోసింది. గతంలో సీఏఏకు అనుకూలంగా ఓటేసిన జగన్.. నేడు వక్ఫ్ బిల్లుపై స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ద్వంద్వ వైఖరి అవలంబించారు. వైసీపీపై ముస్లింలు తిరుగుబాటు చేయాలి. వైసీపీలోని ముస్లిం నేతలంతా ఆ పార్టీని వీడాలి' అని దీపక్ రెడ్డి సూచించారు.

మూడోసారీ పోలీసుల విచారణకు

హాజరు కాని కునాల్ కమ్రా

ముంబయి, ఏప్రిల్ 5: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాండ్‌అప్ కమేడియన్ కునాల్ కమ్రా మూడోసారి కూడా పోలీసుల విచారణకు హాజరు కాలేదు. శనివారం తమ ఎదుట హాజరు కావాలంటూ ముంబయి పోలీసులు ఇచ్చిన సమన్లను విస్మరించారు. ప్రస్తుతం ఆయన తమిళనాడులో ఉంటున్నారు. ఈ నెల ఏడో తేదీ వరకు ఆయనను అరెస్టు చేయకూడదని ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. తొలుత పోలీసులు ముంబయిలోని ఆయన నివాసానికి వెళ్లి సమన్లు అందజేయడానికి ప్రయత్నించారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో వాట్సాప్ ద్వారా పంపించారు. అంతకుముందు రెండుసార్లు సమన్లు పంపినా వాటికి స్పందించలేదు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర రాజకీయాలపై వ్యాఖ్యలు చేసిన కమ్రా...షిండే పేరు పెట్టకుండానే 'మోసగాడు' అంటూ విమర్శలు చేశారు. దీనిపై శివసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పలు చోట్ల కేసులు పెట్టారు.



రేయి లోలోతుల..


రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శనివారం రష్మిక పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమా నుంచి పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల'ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రష్మిక చేతిలో కత్తి పట్టుకొని, నడుమున గన్‌తో శక్తిమంతంగా కనిపిస్తున్నారు. 'రేయి లోలోతుల' పాటకు హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించడంతో పాటు విజయ్ దేవరకొండ, చిన్మయి శ్రీపాదతో కలసి ఆలపించారు.

విచారణకు భయపడం

- మల్లిక సుకుమారన్



'నా కొడుకు ఏ తప్పూ చేయలేదు. ఎలాంటి విచారణనైనా ఎదుర్కోవడానికి మేము సిద్ధం. భయపడాల్సిన అవసరం మాకు లేదు' అని మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక సుకుమారన్ స్పష్టం చేశారు. మార్చి 29 ఆదాయపు పన్ను శాఖ అధికారులు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు నోటీసులు జారీ చేయగా, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో దీనిపై మల్లిక స్పందిస్తూ పైవిధంగా వ్యాఖ్యానించారు. కాగా, 2022లో పృథ్వీరాజ్ నటించిన మూడు చిత్రాలు 'కడువ', 'జనగణమన', 'గోల్డ్' విడుదలయ్యాయి. ఈ చిత్రాలకు సహనిర్మాతగా కూడా వ్యవహరించిన పృథ్వీరాజ్ నటుడిగా ఎలాంటి పారితోషికం తీసుకోలేదు. అయితే ఆ వివరాలను ఈనెల 29వ తేదీలోగా తెలియజేయాలంటూ ఐటీ అధికారులు నోటీసులు ఇచ్చారు.



వినసొంపైన మెలోడీ

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్, భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్‌లో రూపొందింది. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషించారు. ఈనెల 11న విడుదలవుతోంది. తాజాగా, ఈ చిత్రం నుంచి 'ప్రియమారా మౌనాల చాటు మాటలే తెలియదా' అంటూ సాగే వినసొంపైన మెలోడీని మేకర్స్ విడుదల చేశారు. రాకేందు మౌళి పాటను రచించగా, శరత్ సంతోష్, లిప్సిక భాష్యం ఆలపించారు. రధన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: ఎమ్ఎన్ బాలరెడ్డి.

ఘంటసాల రవికుమార్ కన్నుమూత



దివంగత దిగ్గజ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కుమారుడు ఘంటసాల రవికుమార్ (72) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం మధ్యాహ్నం కార్డియాక్ అరెస్టుకు గురయ్యారు. ఆ వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారని ఆయన ఏకైక కుమారుడు మొహీందర్ ఘంటసాల 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఘంటసాల రవికుమార్ సౌండ్ రికార్డిస్టుగా ఉన్నారు. దూరదర్శన్‌తో పాటు సన్ టీవీ, జయా టీవీల్లో ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేశారు. కాగా, తన కుటుంబ సభ్యులు విదేశాల నుంచి నగరానికి రావాల్సి ఉందని, అందువల్ల అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం జరుగుతాయని మొహీందర్ వెల్లడించారు. ఘంటసాల రెండవ భార్య కుమారుడే రవికుమార్.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

చిత్రజ్యోతి

SINCE 1965



రామాయణం.. అమితాబ్ గొంతుతో

శ్రీరామనవమి సందర్భంగా అమితాబ్ బచ్చన్ రామకథను వినిపించబోతున్నారు. ఓటీటీ వేదిక డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ఆదివారం ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ రామాయణంలోని ఏడు కాండాలను ప్రేక్షకులకు వివరించనున్నారు. ఈ లైవ్ స్ట్రీమ్‌లో అయోధ్య, భద్రాచలం, పంచవటి, చిత్రకూట్ వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాల్లోని పూజా కార్యక్రమాలను, వేడుకలను ప్రసారం చేస్తున్నారు. అలాగే కైలాష్ కేర్, మాలినీ అవస్థీ, పాలక్ ముచ్చల్ వంటి గాయకులు తమ ప్రదర్శనతో ఆకట్టుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ లైవ్‌స్ట్రీమ్ ప్రసారం కానుంది.



స్వచ్ఛమైన ప్రేమకథ

రాజేశ్ కొంచాడా, శ్రావణి శెట్టి జంటగా స్వామి పట్నాయక్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కౌసల్య తనయ రాఘవ'. అడపా రత్నాకర్ నిర్మాత. ఈనెల 11న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో రాజేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. అందరూ చూసి ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ 'నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు' అని చెప్పారు. నిర్మాత రత్నాకర్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని స్వామి పట్నాయక్ అద్భుతంగా తెరకెక్కించారు' అని ప్రశంసించారు.

మహాకాళి చిత్రంలో అక్షయ్ ఖన్నా



'హను-మాన్' చిత్రం ఘన విజయం తర్వాత ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న చిత్రం 'మహాకాళి'. ఆర్‌కేడీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో పౌరాణిక ఇతివృత్తంతో సూపర్‌హీరో జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా చిత్రబృందం ఆసక్తికర అప్డేట్‌ను పంచుకుంది. 'ఛావా' చిత్రంలో ఔరంగజేబ్‌గా పాత్రోచిత నటనతో ఆకట్టుకున్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్‌ఖన్నా. ఇప్పుడు ఆయన 'మహాకాళి' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ శనివారం ప్రకటించారు.

విదేశీ డిగ్రీకి దేశీయ పట్టా

» యూజీసీ కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా విదేశాలతో భారత్ అకడమిక్ రంగంలో భాగస్వామ్యం కుదుర్చుకున్న రీత్యా విదేశీ డిగ్రీలను గుర్తించేందుకు యూజీసీ తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. అంతర్జాతీయ విద్యార్హతలతో తిరిగి వచ్చే విద్యార్థులను భారతీయ ఉన్నత విద్యావ్యవస్థలో భాగం చేసేందుకు వీలుగా ఎలాంటి జాప్యం లేకుండా వారి డిగ్రీలను సమీక్షించేందుకు ఒక ప్రామాణికమైన వ్యవస్థను ఏర్పర్చేందుకు నిబంధనలు రూపొందించామని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్ శనివారం వెల్లడించారు. ఉన్నత విద్యాసంస్థలు, పాఠశాలల నుంచి పొందిన విదేశీ అర్హతలను గుర్తించేందుకు పారదర్శకమైన, సాంకేతికతతో కూడిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించాలంటే వారి డిగ్రీలను గుర్తించేందుకు సక్రమమైన యంత్రాంగం అవసరమన్నారు. తాజా నిబంధనల ప్రకారం విదేశీ విద్యాసంస్థల నుంచి పొందిన డిగ్రీలకు సమానంగా ఈక్వివాలెన్స్ సర్టిఫికెట్ పొందేందుకు యూజీసీ ఏర్పాటు చేసిన పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కమిషన్ నియమించిన స్టాండింగ్ కమిటీ పదిరోజుల్లో ఈ దరఖాస్తులను పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఈ సర్టిఫికెట్ పోర్టల్‌లోనే లభ్యమవుతుంది. కమిటీలో ఉన్నత విద్యారంగానికి చెందిన నిపుణులు ఉంటారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాల పట్ల కమిటీ సంతృప్తి చెందకపోతే 15 రోజుల్లోపు అదనపు సమాచారాన్ని సమర్పించాల్సిందిగా కోరుతుంది. దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలో 30 పనిదినాల్లో నిర్దిష్ట ఫీజు చెల్లించి పునఃపరిశీలన కోరవచ్చు. దానిని ప్రత్యేక రివ్యూ కమిటీ తిరిగి పునఃపరిశీలించి పది రోజుల్లో తన నిర్ణయాన్ని తెలుపుతుంది.

భారతీయ విద్యావ్యవస్థ అంతర్జాతీయాకరణ

భారతీయ విద్యా వ్యవస్థ అంతర్జాతీయాకరణ అయ్యిందని యూజీసీ చైర్మన్ తెలిపారు. విదేశాల్లో భారతీయ యూనివర్సిటీల బ్రాండ్‌ను ఏర్పర్చడంతో పాటు, విదేశీ యూనివర్సిటీలతో అకడమిక్, రీసెర్చ్ రంగాల్లో ఒప్పందాలు ఏర్పరచుకున్నామని చెప్పారు. సంయుక్తంగా డిగ్రీలను ప్రదానం చేయడంపై యూజీసీ ఈ నిబంధనలను నోటిఫై చేసిందన్నారు. ఒక గ్లోబల్ పౌరుడి దృక్పథంతో ఈ మార్గదర్శకాలను రూపొందించామని తెలిపారు. జాతీయ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ ద్వారా పాఠశాల విద్య, ఉన్నత విద్య, స్వచ్ఛంద, నైపుణ్య విద్యారంగాల్లో క్రెడిట్‌ను సమ్మేళనం చేసి అర్హతలను గుర్తించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. మెడిసిన్, ఫార్మసీ, నర్సింగ్, లా, ఆర్కిటెక్చర్ రంగాల్లో విదేశీ విద్యాసంస్థలు ప్రదానం చేసే డిగ్రీలకు ఇది వర్తించదని, వాటిని గుర్తించేందుకు ఇప్పటికే చట్టబద్ధమైన కౌన్సిళ్లు ఉన్నాయని ఆయన చెప్పారు

మావోయిస్టులారా ఆయుధాలను వదలండి: షా



బస్తర్‌లో అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న అధికారులు

దంతెవాడ, ఏప్రిల్ 5: ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బస్తర్ పాండూమ్' వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2026 మార్చి నాటికి మావోయిస్టుల బెడదను పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. "బస్తర్‌లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగిసిపోయాయి. ఆయుధాలను అడ్డం పెట్టుకొని గిరిజన సోదరులు, సోదరీమణుల అభివృద్ధిని మావోయిస్టులు ఆపలేరు' అని అమిత్ షా పేర్కొన్నారు. గత 50ఏళ్లగా బస్తర్ అభివృద్ధికి నోచుకోలేదని, బస్తర్ ప్రజలు తమ ఇళ్లను, ఊళ్లను నక్సలైట్ రహితంగా మార్చాలని బలమైన నిర్ణయం తీసుకుంటేనే అభివృద్ధికి బాటలు పడతాయని స్పష్టం చేశారు.

రాజకీయ నాయకులుగా ఎదిగేందుకు ఫెలోషిప్

» మన్మోహన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యక్రమం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: కొత్త తరం రాజకీయనాయకులను తయారుచేసే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరుతో ఒక ఫెలోషిప్ ప్రోగ్రాం ప్రారంభించింది. వివిధ వృత్తిపరమైన నేపథ్యాల నుంచి వచ్చిన 50 మంది నిపుణులను ప్రతిభావంతులైన ప్యానెల్ ఓ ప్రత్యేకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. వారికి రాహుల్ గాంధీ, శశిథరూర్, అజయ్ మాకెన్ వంటి ప్రముఖులు మెంటార్స్‌గా వ్యవహరిస్తారని ఏఐసీసీ తెలిపింది. ఆధునిక, ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని పేర్కొంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఏఐసీసీ నేతలు ప్రవీణ్ చక్రవర్తి, కొప్పుల రాజు ఈ ఫెలోషిప్ వివరాలను వెల్లడించారు. ఫెలోషిప్ దరఖాస్తుకు విద్యార్హతలేమీ అవసరం లేదని, కానీ అభ్యర్థులకు ఏదో ఒక వృత్తిలో 10 ఏళ్ల అనుభవం ఉండాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలపై దాడే: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 : వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలపై దాడేనని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ శనివారం అన్నారు. భవిష్యత్‌లో దేశంలో ఇతర మతాలపై జరగనున్న దాడులకు ఇదో ఉదాహరణ వంటిదని పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు ఆమోదం తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ క్యాథలిక్ చర్చి భూములపై దృష్టి సారించిందని పేర్కొంటూ వచ్చిన ఒక వార్తా కథనాన్ని దానికి జోడించారు. ఇక క్రిస్టియన్లపై దృష్టి సారించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎంతో సమయం పట్టదని రాహుల్ తన పోస్టులో వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ పత్రికలో క్యాథలిక్ చర్చికి ఉన్న ఆస్తులకు సంబంధించి ఇటీవల వచ్చిన కథనం దాని(ఆర్‌ఎస్‌ఎస్) నిజ స్వరూపాన్ని బయట పెట్టిందని కేరళ సీఎం విజయన్ అన్నారు. వక్ఫ్ బిల్లు.. నల్ల చట్టాలు, అటవీ చట్టాల కంటే ప్రమాదకరమైందని ఆల్ ఇండియా ఉలేమా బోర్డు జాతీయ అధ్యక్షుడు హసనీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, వక్ఫ్ సవరణ బిల్లును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మరో రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

నిమిషాల్లోనే ఘటనాస్థలికి చేరే 'ద్రిష్టి'

» గుజరాత్ పోలీసుల వినూత్న ప్రయోగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ప్రమాదం లేదా నేరాలు జరిగినప్పుడు నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకునేలా గుజరాత్ పోలీసులు 'జీపీ-ద్రిష్టి' అనే పేరుతో డ్రోన్ ఆధారిత వ్యవస్థను రూపొందించారు. ఇది పీసీఆర్ (పోలీస్ కంట్రోల్ రూమ్) వాహనాలకు సహకారాన్ని అందిస్తుందని డీజీపీ వికాస్ సహాయ్ తెలిపారు. ప్రమాద స్థలానికి సరైన సమయంలో చేరుకుని, వారికి విచారణలో ఉపకరించే విధంగా ఈ వ్యవస్థను రూపొందించారు. ఘటన జరిగినప్పుడు ఈ డ్రోన్లు ప్రత్యక్ష పరిస్థితిని చిత్రీకరించి వాటిని పోలీసులకు చేరవేస్తాయి. పదిరోజుల పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మొదట సూరత్, అహ్మదాబాద్‌లో ప్రయోగించగా పీసీఆర్ వాహనాలతో పోలిస్తే సగం సమయంలోనే ఈ డ్రోన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. కొన్నిసార్లు కేవలం రెండు మూడు నిమిషాల వ్యవధిలోనే చేరుకున్నాయని వివరించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు సక్సెస్ కావడంతో మరిన్ని డ్రోన్లను వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.

10 లక్షల ఇరాన్ రియాళ్లకు ఒక్క డాలర్

టెహ్రాన్, ఏప్రిల్ 5: మామూలుగా ఒక్క డాలర్‌కు మన కరెన్సీ ఎంత వస్తుంది. ఇప్పటి లెక్క ప్రకారం సుమారు 86 రూపాయలు. కానీ ఒక్క డాలర్‌కు ఏకంగా పది లక్షలకుపైనే అయితే!? ఇరాన్ కరెన్సీ రియాల్. శనివారం అంతర్జాతీయ మార్కెట్లో ఒక డాలర్‌కు రికార్డు స్థాయిలో 10 లక్షల 43 వేల రియాల్‌లకు విలువ పడిపోయింది. ఈ దెబ్బకు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని కరెన్సీ మార్పిడి కేంద్రమైన ఫిర్దౌసీ స్ట్రీట్‌లో ట్రేడర్లు కరెన్సీ మార్పిడి విలువల డిజిటల్ బోర్డులను ఆఫ్ చేసేశారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ వేగంగా పడిపోతోంది.

ట్రంప్ సృష్టించిన టారిఫ్‌ల కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో ఇప్పటికే ధరాఘాతం మొదలైంది. చాలా వరకు సూపర్ మార్కెట్లు, గ్రోసరీల నిర్వాహకులు పనిలో పనిగా సరుకుల ధరలను పెంచేశారని అక్కడి మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధిక సుంకాలతో కూడిన సరుకులు ఇంకా రాకున్నా, ఇప్పటికే ఉన్న పాత స్టాకు ధరలను కూడా సుంకాలకు అనుగుణంగా పెంచేసినట్టు పేర్కొంటున్నాయి.

ఎందుకీ ధరల భయం.. ఎంత ప్రభావం?

అమెరికా పౌరులు వినియోగించే వాటిలో 90శాతం వరకు దిగుమతులపై ఆధారపడినవే ఉంటాయి. తయారీ రంగం మొత్తం చైనా, ఇతర దేశాలకు తరలిపోయింది. చివరికి టిష్యూ పేపర్లు కూడా చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. అందుకే ట్రంప్ టారిఫ్‌లతో అమెరికన్ల జీవన వ్యయంపై గట్టి ప్రభావం పడుతోంది. దిగుమతులపై ఆయా దేశాలను బట్టి 25 శాతం నుంచి 52 శాతం వరకు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా ఆయా ఉత్పత్తుల ధరలు పెరిగిపోవడం ఖాయం. ఇది సగటు అమెరికన్లతోపాటు అక్కడ నివసిస్తున్న విదేశీయులలోనూ కలకలం రేపుతోంది. ఉదాహరణకు సుమారు 500 డాలర్లతో నెల రోజులు గడిపేసేవారు... సుంకాలు అమల్లోకి వచ్చి ధరలు పెరిగితే, నెలకు 650 డాలర్ల నుంచి 700 డాలర్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా. అంటే నెలవారీ బడ్జెట్‌పై 30-40 శాతం వరకు అదనపు భారం పడుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వాల్‌మార్ట్ ఒక్కటి చూసినా...

అమెరికన్ సమాజంలో సుంకాల దెబ్బ తీవ్రత అంచనా కోసం ఒక్క వాల్‌మార్ట్ స్టోర్లను పరిశీలిస్తే చాలని నిపుణులు చెబుతున్నారు. మనకు జిల్లాలు ఉన్నట్టుగా అక్కడ కౌంటీలు ఉంటాయి. ప్రతి కౌంటీలో ఓ భారీ వాల్‌మార్ట్ హైపర్ మార్కెట్ ఉంటుంది. చాలా మంది అందులోనే నిత్యావసరాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఈ స్టోర్లలో 90 శాతం వరకు దిగుమతి అయిన వస్తువులనే విక్రయిస్తుంటారని.. ఇప్పుడు టారిఫ్‌ల ధరాఘాతంతో అందరిపైనా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

జీవన శైలిలోనే మార్పు తప్పదా?

అమెరికన్ల జీవన విధానం చాలా విభిన్నమని, పొదుపు చేయడాన్ని ప్రత్యేకంగా చూడని విశ్లేషకులు చెబుతున్నారు. అంతేగాకుండా అక్కడ నెలవారీగా కాకుండా వారాంతపు వేతనాలు ఉంటాయని.. ఏవారం వేతనాలను ఆ వారం ఖర్చు పెట్టేసే తరహా జీవన శైలి ఉంటుందని వివరిస్తున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా 30 శాతం వరకు వ్యయం పెరిగితే.. ఖర్చులు తగ్గించుకోవడం, పొదుపు చేయడం ద్వారా వారి జీవనశైలినే మార్చుకోవాల్సిన పరిస్థితి తప్పదని అంటున్నారు.



వివిధ దేశాలపై విధించే ప్రతీకార సుంకాలను బోర్డు పట్టుకొని వివరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్(ఫైల్)

అప్పుల పాలవుతున్న అమెరికన్లు!

సుంకాల ధరాఘాతం నుంచి తప్పించుకునేందుకు ఎగబడి సరుకులు, వస్తువులు కొనుగోలు చేస్తున్న అమెరికన్లు.. ఇందుకోసం అప్పులు కూడా చేస్తున్నారని అక్కడి ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలలో వాహనాల విక్రయాలు ఏకంగా 11.2 శాతం పెరిగాయని, ఏప్రిల్ మొదటి వారంలోనూ భారీగా నమోదయ్యాయని చెబుతున్నారు. భవిష్యత్తులో తీర్చుకోవాలనుకున్న కోరికలను కూడా.. ధరలు అడ్డగోలుగా పెరుగుతాయన్న ఉద్దేశంతో ఇప్పుడే తీర్చేసుకుంటున్నారని... తాహతుకు మించి ఖర్చు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు, ఖరీదైన ఫోన్లు వంటివి కొంటున్నారని వివరిస్తున్నారు. సుంకాల ఆందోళనతో అనవసరమైన, తాహతుకు మించిన ఖర్చులు చేయవద్దని అమెరికన్లను హెచ్చరిస్తున్నారు.

(అమెరికాలోని డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి ఇన్‌పుట్స్‌తో..)

అక్కడి భారతీయులపై మరింత భారం



ట్రంప్ సుంకాల ధరాఘాతం అక్కడ ఉద్యోగాలు చేస్తున్న, చదువుకుంటున్న భారతీయులపై గణనీయంగానే ప్రభావం చూపనుంది. ఇప్పటికే విదేశీ విద్యార్థులు తాత్కాలిక (పార్ట్‌టైమ్) ఉద్యోగాలు చేయకుండా ట్రంప్ ఆంక్షలు విధించడంతో... భారతీయ విద్యార్థులకు ఆ మాత్రం ఆదాయం లేకుండా పోయింది. ఇండియా నుంచి కుటుంబ సభ్యులు పంపే డబ్బే దిక్కవుతోంది. ఇప్పుడు అక్కడ ఖర్చులు పెరగడంతో... ఇక్కడి నుంచి మరింత ఎక్కువ సొమ్ము పంపక తప్పదు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతుంది. మరోవైపు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులపైనా ప్రభావం గణనీయంగానే ఉండనుంది. అక్కడ జీవన వ్యయం పెరగడంతో మనవాళ్ల పొదుపునకు కోత పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏమేం కొని పెట్టుకుంటున్నారు?

ట్రంప్ సుంకాల ప్రభావం దాదాపు అన్ని రకాల ఉత్పత్తులపై కనిపించనుంది. కానీ కొన్ని ఉత్పత్తులు చాలా వరకు విదేశాల నుంచే వస్తుండటంతో వాటి ధరలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని అంచనా. ఇందులో అమెరికన్లు ఏయే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారన్నదానిపై అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం...



విదేశాల నుంచి దిగుమతి అయ్యే గ్రోసరీ వస్తువులు, కాఫీ, చిరుతిళ్లు (స్నాక్స్) వంటి వాటి ధరలు పెరిగే అవకాశం ఉండటంతో వీలైనంతగా కొని పెట్టుకుంటున్నారు.



అమెరికాలో తయారయ్యే ఎలక్ట్రానిక్ పరికరాల్లో వాడే విడిభాగాలు చాలా వరకు చైనా, తైవాన్ దేశాల నుంచే దిగుమతి అవుతాయి. సుంకాలతో ధరలపై ప్రభావం పడి వాటి ధరలు పెరగడం ఖాయమనే ఉద్దేశంతో ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, కిచెన్ అప్లయెన్సెస్ వంటివి ఎక్కువగా కొంటున్నారు.



అమెరికాకు చాలా వరకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, వాటి విడిభాగాలు చైనా, తైవాన్‌ల నుంచే వస్తాయి. ఇందులో తైవాన్‌పై 32శాతం, చైనాపై 52శాతం సుంకాలను ట్రంప్ ప్రకటించారు. దీనితో ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు కొనాలని భావిస్తున్న వారంతా.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టుగా వాటికోసం బారులుతీరుతున్నారు.



'గ్యాప్, హెచ్ అండ్ ఎం' వంటి పెద్ద బ్రాండ్లు సహా అమెరికాలో వినియోగించే దుస్తులు, ఫుట్‌వేర్‌లో చాలా వరకు వియత్నాం(21% పన్ను), భారత్, ఇండోనేషియా, బంగ్లాదేశ్ (37% పన్ను) నుంచి రావాల్సిందే. దీనితో ధరలు పెరుగుతాయని జీన్స్, బూట్లు కొనడానికి అమెరికన్లు క్యూ కడుతున్నారు.



కొత్త కార్లు ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇక రేబాన్ కళ్లజోళ్లు, సౌందర్య ఉత్పత్తులు, ఆస్పత్రుల్లో వాడే పరికరాలు, బెడ్లు, ట్రెడ్‌మిల్స్, మసాజ్ చైర్లు, ఇతర జిమ్ పరికరాలు, డైపర్లు, బొమ్మలు, స్త్రోలర్లు తదితర ఉత్పత్తులకూ డిమాండ్ పెరిగింది.



అమెరికాలో వ్యవసాయం ఎక్కువే. కానీ అందుకు అవసరమైన పరికరాలు చైనా నుంచి, ట్రాక్టర్ల విడిభాగాలు జర్మనీ నుంచి, ఎరువులేమో కెనడా, రష్యాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. దీనితో స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరుగుతాయి.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ట్రంప్ సంప్రదింపులు

న్యూఢిల్లీ, వాషింగ్టన్, ఏప్రిల్5: ఈ నెల 9 నుంచి ప్రతీకార సుంకాలు పూర్తి స్థాయిలో అమల్లోకి రానున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సంప్రదింపుల ప్రక్రియ వేగిరం చేశారు. భారత్‌తో పాటు ఇజ్రాయెల్, వియత్నాంతో కూడా చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా, కెనడా తరహాలో దూకుడుగా స్పందించకుండా భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. నిజానికి 10 రోజుల క్రితమే అమెరికా వాణిజ్యమంత్రి భారత్‌లో పర్యటించారు. రెండు దేశాలకు పరస్పర ప్రయోజనకరంగా ఉండేలా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందామన్న భారత ప్రతిపాదనపై లోతుగా చర్చించారు. ప్రతీకార సుంకాలపై అమెరికాతో సహా ప్రపంచ దేశాల్లో భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్.. భారత్, ఇజ్రాయెల్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సంప్రదింపులు జరపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల 7న అమెరికా వెళ్లనున్నారు. ట్రంప్‌తో ప్రతీకార సుంకాల అంశంపై చర్చించనున్నారు. ఈ నెల రెండున ట్రంప్ ఇజ్రాయెల్‌పై 17%, భారత్‌పై 26%, వియత్నాంపై 46% సుంకాలు విధించారు. శనివారం నుంచి పది శాతం సుంకాలు అమల్లోకి వచ్చాయి.

ఆధునిక రామ సేతు!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నారు. 'రామసేతు' పౌరాణికమైతే.. 'పాంబన్ వంతెన' నేటి ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతం. శ్రీలంక పర్యటన ముగించుకుని ప్రధాని ఆదివారం ఉదయం 11 గంటలకు భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లో తమిళనాడులోని మండపం చేరుకుంటారు. ఈ సందర్భంగా ఆయన కొత్త రైలుబ్రిడ్జిని, కొత్త లిఫ్ట్‌ను, రామేశ్వరం-తాంబరం రైలును వర్చువల్‌గా ప్రారంభిస్తారు. అనంతరం రామేశ్వరంలోని రామనాథస్వామివారి ఆలయానికి వెళతారు. శ్రీరామనవమి సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మోదీ అక్కడి నుంచి పాంబన్ వంతెన ప్రారంభోత్సవ సభ జరిగే రామేశ్వరం బస్‌స్టేషన్ వద్ద రోడ్‌షో నిర్వహిస్తారు. ఆ తరువాత అదే వేదికపై నుంచి ప్రసంగించనున్నారు. అక్కడి నుంచే నాలుగు రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన కూడా చేయనున్నారు. ప్రధాని రాక సందర్భంగా రామేశ్వరం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

ఎక్కడుందీ పాంబన్?

భారతదేశం కింది ప్రాంతంలో తమిళనాడుకు అనుకుని కుడివైపున కన్నీటి చుక్కలా శ్రీలంక కనిపిస్తుంది. ఆ శ్రీలంకకు-భారత్‌కు మధ్య ఉన్న పాక్ జలసంధిలో పాంబన్ దీవి ఉంటుంది. మన దేశం నుంచి కాస్త విసిరేసినట్లుగా ఉండే ఆ దీవిని దేశ ప్రధాన భూభాగంలోని రైలు నెట్‌వర్క్‌తో అనుసంధానించేదే పాంబన్ రైలు వంతెన. సముద్రంపై నిర్మితమైన 'వర్టికల్ లిఫ్ట్' ఉన్న వంతెన ఇది. దేశంలో ఇలాంటి వంతెనను నిర్మించడం ఇదే ప్రథమం. తమిళనాడులోని రామనాథపురం జిల్లా మండపం ప్రాంతం నుంచి పాంబన్ దీవికి 2.07 కి.మీ పొడవున నిర్మించిన ఈ వంతెనను 'రామసేతు'కు వారధిగా అభివర్ణిస్తున్నారు.

బ్రిటిష్ కాలంలో తొలి వంతెన

మండపం ప్రాంతం నుంచి పాంబన్ దీవికి మీటర్ గేజ్ రైలు వంతెనను బ్రిటిష్ కాలంలో 1914లో నిర్మించి ప్రారంభించారు. నాడు ఈవంతెన నిర్మాణానికి రూ. 20 లక్షలు ఖర్చయింది. సముద్రంలో ఓడలు, నౌకలు వెళ్లే సమయంలో ఈ వంతెన మధ్యలో రెండుగా విడిపోయి పైకి లేచేలా (డబుల్ లీఫ్ బేస్క్యూల్ బ్రిడ్జి) రూపొందించారు. ఇక్కడ వంతెన మధ్య నుంచి ఓడలు వెళ్లేలా మార్గం లేకపోతే అవి మన దేశ చివరి భూభాగమైన ధనుష్కోటి అవతలి నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి. అంటే ఒక్కో ఓడ సుమారు 150 కి.మీ అదనంగా చుట్టి రావాల్సి ఉంటుంది. అందుకే పాంబన్ వంతెన మధ్యభాగం కింది నుంచి ఓడలు కూడా వెళ్లేలా నాటి పాలకులు ప్రణాళికలు రూపొందించారు. 1962లో ధనుష్కోటి ప్రాంతంలో సంభవించిన తుఫాను సమయంలో పాంబన్-ధనుష్కోటి ప్యాసింజర్ రైలుతో సహా ఆ రైలు మార్గం కూడా ధ్వంసమైంది. తుఫాను ధాటికి దెబ్బతిన్న పాంబన్ వంతెనకు మరమ్మతులు చేశారు. 2013 జనవరి 13న నావికా దళానికి చెందిన 'బార్జ్' వంతెనను ఢీకొట్టింది. 2022 డిసెంబరులో ఈ వంతెనపై రైళ్ల రాకపోకల్ని పూర్తిగా నిలిపేశారు. పాంబన్ పాత వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 మార్చి 1న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) పనులు మొదలు పెట్టింది. వంతెన పూర్తయ్యేనాటికి వ్యయం రూ. 535 కోట్లు. విజయనగరం జిల్లాకు చెందిన రైల్వే సీనియర్ ఇంజనీర్ నడుపూరు చక్రధర్ ఈ వంతెన నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించడం విశేషం.

ఆసక్తిగా ఎదురు చూస్తున్నా: ప్రధాని

పాంబన్ బ్రిడ్జి ప్రారంభానికి వస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఏప్రిల్ 6, ఆదివారం పవిత్రమైన శ్రీరామనవమి. ఆ రోజున తమిళనాడులోని నా సోదర సోదరీమణులను కలుసుకొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. కొత్త పాంబన్ రైలు వంతెన ప్రారంభించబోతున్నాం." అని తెలిపారు.



ఒక్క బోల్టు వాడకుండా

- వర్టికల్ లిఫ్ట్‌కు ఒక్క బోల్టు కూడా వాడకుండా వెల్డింగ్‌తోనే సిద్ధం చేశారు.
- వంతెనలో 99 దిమ్మెలున్నాయి. ఇవి పటిష్టంగా ఉండేలా, సముద్రం అడుగున గట్టి నేల తగిలే వరకు 25-35 మీటర్ల లోతున పునాదులు వేశారు. వంతెన నిర్మాణానికి మొత్తం 62వేల టన్నుల స్టీల్, 3.38 లక్షల బస్తాల సిమెంట్, 25వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వాడారు.
- వర్టికల్ లిఫ్ట్ స్పాన్‌ను తీరం నుంచి 600 మీటర్ల దూరంలోని ప్రతిపాదిత చోటుకు తీసుకెళ్లేందుకు 5 నెలలు పట్టింది.
- సముద్రపు అలలకు కొత్త వంతెన తుప్పు పట్టకుండా జింక్, 200 మైక్రాన్ల ఆప్రోక్సీ సీలెంట్, 125 మైక్రాన్ల పాలీ సిలోక్సేన్‌తో కూడిన ట్రిబుల్ కోటింగ్ పూత పూశారు.

తమిళ జాలర్లపై మానవత చూపండి

» వారిని విడుదల చేయండి

» శ్రీలంకను కోరిన మోదీ

» శ్రీలంకతో రక్షణ ఒప్పందం

కొలంబో, ఏప్రిల్ 5 : శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ తమిళ జాలర్ల సమస్యను ప్రస్తావించారు. తమిళ మత్స్యకారుల విడుదల, వారి బోట్లను వెనక్కి ఇచ్చే విషయాన్ని మానవత్వంతో పరిశీలించాలని లంక పాలకులకు విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీలంక అధ్యక్షుడు అసుర కుమార దిసనాయకేతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ చర్చల సందర్భంగా భారత్, శ్రీలంక తొలి సారి చరిత్రాత్మక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్యుత్, ఇంధనం, డిజిటల్ సహా ఏడు ప్రధాన అంశాలపైనా ఇరుదేశాల అధినేతల సమక్షంలో ఎంవోయూలు ఖరారయ్యాయి. అరబ్ ఎమిరేట్స్‌ను కూడా కలుపుకొని ట్రింకోమలీలో ఎనర్జీ హబ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. భారత ప్రయోజనాలకు భిన్నంగా తమ భూభాగాన్ని వాడుకోనీయబోమని శ్రీలంక అధ్యక్షుడు అసుర కుమార దిసనాయకే పునరుద్ఘాటించగా, శ్రీలంకకు ఢిల్లీ సాయం ఇక ముందు కూడా కొనసాగుతుందని భారత్ ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. శ్రీలంకలోని తమిళ జాతీయులకు న్యాయం, గౌరవం దక్కాలని భారత్ బలంగా కోరుకుంటోందని లంక పాలకుల దృష్టికి ఆయన తెచ్చారు. రాజకీయ ప్రక్రియలో లంక తమిళులను భాగం చేస్తూ ప్రొవెన్షియల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించే అంశాన్ని ప్రస్తావించారు. లంక తూర్పు ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం 2.4 బిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించారు. ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడటానికి గతంలో శ్రీలంకకు ఇచ్చిన రుణాలపై వడ్డీ రేటును తగ్గిస్తున్నట్టు చెప్పారు. చర్చల అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో ఇరువురు నేతలు మాట్లాడారు. ఇరుదేశాల రక్షణ ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉన్నాయని మోదీ స్పష్టం చేశారు. 2019లో ఉగ్రవాద దాడి, కొవిడ్ కాలం, ఇటీవలి ఆర్థిక సంక్షోభం.. ఇలా ప్రతి కష్టంలోనూ శ్రీలంకకు అండగా నిలిచామన్నారు. రక్షణ ఒప్పందంలో భాగంగా.. పరస్పర సహకారంతో కొలంబో రక్షణ సదస్సు నిర్వహించాలని, హిందూ మహాసముద్ర జలాల్లో రక్షణపరంగా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో ఇదే కీలకమని చెప్పారు. భారత ప్రయోజనాలకు దిసనాయకే పెద్ద పీట వేయడం సంతృప్తి కలిగిస్తోందని మోదీ అన్నారు. కాగా, గ్రిడ్‌ల అనుసంధానంతో పవర్ ట్రేడ్‌కు ఊపు తీసుకువచ్చే ఎంవోయూపై నేతలు సంతకం చేశారు. శ్రీలంకతో డిజిటల్ సొల్యూషన్స్‌ను పంచుకోవాలని భారత్ నిర్ణయించింది. శ్రీలంక ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ, పొరుగుదేశమే ఫస్ట్' పాలసీని, మహాసాగర్ విజన్‌ను మోదీ ప్రకటించారు. అంతకుముందు.. థాయ్‌లాండ్‌లో బిమ్‌స్టెక్ సదస్సు ముగించుకున్న నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రికి కొలంబో చేరుకున్నారు. శనివారం ఉదయం లంక రాజధానిలోని ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద శ్రీలంక ప్రభుత్వం ఆయనకు ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆయన అధ్యక్షుడు దిసనాయకేతో భేటీ అయ్యారు.



మోదీకి 'మిత్ర విభూషణ'

శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అక్కడి ప్రభుత్వం 'మిత్ర విభూషణ' అవార్డును ప్రదానం చేసింది. విదేశీ అధినేతలకు శ్రీలంక ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం ఇది. ఈ పురస్కారానికి మోదీ పూర్తిగా తగినవారని అధ్యక్షుడు దిసనాయకే కొనియాడారు. దీనిని తాను వ్యక్తిగతంగా కాకుండా, 140 కోట్లమంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తానని మోదీ తెలిపారు. బౌద్ధ వారసత్వాన్ని కలిసి పంచుకోవడం, సౌభాగ్యం, విలువ కట్టలేని స్నేహం, కాలాతీత మిత్రత్వాలకు గుర్తుగా..పురస్కార చిహ్నంలో ధర్మచక్రం, పూర్ణ కలశం, నవరత్నాలు, సూర్యచంద్రులను పొందుపరిచారు.



కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు నిధులు ఇస్తానని చంద్రబాబుకు హామీ పత్రం అందజేస్తున్న ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్

పీ4తో 'కొమ్మమూరు లిఫ్ట్'

- రూ.10 కోట్లు ఇవ్వనున్న ప్రసాద్ సీడ్స్ అధినేత
- తీరనున్న ఐదు గ్రామాల రైతుల సాగునీటి వెతలు
- సస్యశ్యామలం కానున్న 5,315 ఎకరాలు

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అట్టడుగున ఉన్న పేదల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు తలపెట్టిన పీ4 కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. తన సొంతూరులో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడం ప్రముఖ విత్తన తయారీ సంస్థ ప్రసాద్ సీడ్స్ ఛైర్మన్ కారుమంచి ప్రసాద్‌ను కదిలించింది. సీఎం ఇచ్చిన పిలుపుతోపాటు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచన మేరకు పీ4 ద్వారా ఈ సమస్యను పరిష్కరించడానికి ఆయన ముందుకు వచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వంతో భాగస్వామ్యమవుతానని కారుమంచి ప్రసాద్ సీఎంను కలిసి వివరించారు. కొమ్మమూరు లిఫ్టు ఇరిగేషన్ పథకం నిర్మాణానికి రూ.10 కోట్లు భరిస్తానని, తద్వారా తమ సొంతూరు కాకుమానుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సాగు నీటి సమస్య పరిష్కారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మరింత మందికి స్ఫూర్తి: సీఎం

ప్రసాద్ సూచించిన విధంగా కొమ్మమూరు ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి డీపీఆర్ సిద్ధం చేసి, త్వరగా అనుమతులు ఇవ్వాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రసాద్ అందించే ఆర్థికసాయం ద్వారా లిఫ్ట్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. గ్రామంలోని రైతులకు మేలు చేసేందుకు పెద్దమనసుతోప్రసాద్ ముందుకు రావడాన్ని సీఎం అభినందించారు. ప్రసాద్ వంటి వారు మరింత మందికి స్ఫూర్తినిస్తున్నారని కొనియాడారు.

మూడు దశాబ్దాలుగా ప్రసాద్ చేయూత..

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమానుకు చెందిన కారుమంచి ప్రసాద్ 1995 నుంచి ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు సాయం చేస్తూ వస్తున్నారు. పెదనందిపాడు లిఫ్ట్ స్కీంను పూర్తి చేయడానికి 1995లో ఆయన ఆర్థిక సాయం చేశారు. కాకుమాను వద్ద కొమ్మమూరు కాల్వపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మిస్తే కాకుమాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొండపాతూరు గ్రామాల్లోని సుమారు 5,315 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. కాకుమాను మండలంలోని ప్రజల తాగునీటి సమస్య తీరుతుంది.



నందిగామ నియోజకవర్గంలోని ముప్పాళ్లలో నిర్వహించిన ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం

గురుకుల పాఠశాలను సందర్శించిన చంద్రబాబు

ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను తిలకించి, తొమ్మిదో తరగతి విద్యార్థినులు వెన్నెల, కార్తీకలతో ముచ్చటించారు. వారిని వెంటబెట్టుకొని తరగతి గదులు, పరిసరాలు, వంటశాల, వసతి గదులు, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫొటోలు దిగారు.

జన్మభూమిలా పీ4

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలు, పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. గ్రామంలో మొత్తం 41 బంగారు కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేసే బాధ్యతను ఐదుగురు మార్గదర్శులకు అప్పగించే కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా బంగారు కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడించారు. తమ సమస్యలను ఏకరువు పెట్టి, సాయం చేయాలని కోరారు. అనంతరం చంద్రబాబు మార్గదర్శులతో మాట్లాడించారు. క్రెక్స్ బయోటెక్ అధినేత రవిచంద్ర మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం గర్వంగా ఉందన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న తాను తృప్తిగా ఉన్నానని, బంగారు కుటుంబాలకు సాయం చేస్తే మరింత తృప్తి చెందుతానన్నారు. గ్రీన్‌వే గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత తోటకూర శ్రీనివాసరావు, అంబా కోచ్ బిల్డర్ అధినేత రామకృష్ణ, కేసీపీ, సెంథినీ ప్రతినిధులు సీఎం చంద్రబాబు ఆలోచనలను కొనియాడారు. బంగారు కుటుంబాలకు సాయం అందిస్తామని ప్రకటించారు. కంపెనీల ప్రతినిధులు కొందరికి సాయం అందించేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందించారు. సమాజం మనకు ఎంత ఇచ్చిందో మనం కూడా సమాజానికి అంత అందించాలని, మొక్కుబడిగా ఎవరూ సాయం చేయాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం మార్గదర్శులను సీఎం సత్కరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కోరారు.

పాడి గేదెలు కొనివ్వండి

నా భర్త కూలి పనికి వెళతారు. ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. రెండు, మూడు పాడి గేదెలు కొనిస్తే ఆర్థికంగా ఎదుగుతాను. పిల్లలను చదివించుకోగలుగుతాను.

- రమాదేవి(బంగారు కుటుంబం)

ఉపాధికి సహకరించాలి

నా భర్త కూలి పనులు, నేను కుట్టు పనులు చేసుకుంటున్నాం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కష్టపడి వారిని చదివించుకుంటున్నాం. సొంత ఇల్లు, ఇంటి స్థలం కూడా లేవు. నా భర్తకు ఆటో, నాకు కుట్టుమిషన్ ఇప్పిస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఇంటి స్థలం, ఇల్లు ఇప్పించాలి.

- పగడాల నాగరత్నం (బంగారు కుటుంబం), ముప్పాళ్ల

చదువు ఖర్చు.. ఆటో, కుట్టు మిషన్

పగడాల నాగరత్నం కుటుంబానికి నేను పూర్తి సహకారం అందిస్తాను. ఆమె భర్తకు ఆటో ఇప్పించడంతో పాటు పని కూడా నేనే కల్పిస్తాను. ఆమెకు కుట్టు మిషన్ ఇప్పిస్తాను. అన్నిటికంటే ముఖ్యంగా ఇద్దరు పిల్లలు స్థిరపడే వరకూ చదివిస్తాను. తద్వారా 15 ఏళ్ల తరువాత ఆ ఇద్దరు పిల్లలు నాలా మార్గదర్శులుగా మారుతారు.

- గోగినేని రవిచంద్ర, క్రెక్స్ బయోటెక్ అధినేత (మార్గదర్శి)



విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే సౌమ్య, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

అద్భుత అవకాశంగా భావిస్తా

పీ4 కార్యక్రమం చూడగానే నాకు ఆశ్చర్యం వేసింది. ఇటువంటి కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదు. చంద్రబాబు దార్శనికత వల్లే ఇది ఆవిష్కృతమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేను బంగారు కుటుంబాలను ఆదుకుంటాను. నా మిత్రులు, ఇతర పారిశ్రామిక వేత్తలను కూడా ఇందులో భాగస్వాములను చేస్తా.

- తోటకూర శ్రీనివాసరావు, గ్రీన్‌వే గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత

కాఫీలు అందించిన చంద్రబాబు

పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముప్పాళ్లలోని ఒక బంగారు కుటుంబంతో కొద్దిసేపు గడిపారు. కోండ్రు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నివాసానికి వెళ్లి ఆయన సతీమణి వెంకట్రావమ్మ, ఇద్దరు పిల్లలతో మాట్లాడారు. పీ4 ద్వారా ఏ సహాయం చేస్తే బాగుపడతారని వారిని అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వరరావు తల్లిదండ్రులతో ముచ్చటించారు. వంటగదికి వెళ్లి స్వయంగా కాఫీ పెట్టిన చంద్రబాబు.. వారికి అందజేశారు. వారితో కలిసి ఆయన కూడా కాఫీ తాగారు. ముఖ్యమంత్రి రాకతో వెంకటేశ్వరరావు కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది.

దళితుల సంక్షేమం కోసం..

తన ఆలోచనలు ఎప్పుడూ 30 ఏళ్ల ముందు చూపుతో ఉంటాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దళితుల్లో 30 ఏళ్ల క్రితం చాలా సమస్యలు ఉండేవన్నారు. దళితుల్లో వర్గీకరణ అవసరమని ఆనాడే గుర్తించామన్నారు. ఎస్సీలను ఏ, బీ, సీ, డీగా వర్గీకరించాలని ఆలోచించానని చెప్పారు. తాను తీసుకున్న నిర్ణయం సరైనదేనని సుప్రీంకోర్టులోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పును ఇచ్చిందన్నారు. తిరిగి తానే సీఎంగా ఉన్నప్పుడు ఆ నిర్ణయాన్ని అమలు చేస్తున్నానని చెప్పారు. దళిత యువకుల కోసం స్టడీ సెంటర్లు, పోటీ పరీక్షలకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 16.44 లక్షల దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్తును అందజేస్తున్నామన్నారు. 20 లక్షల దళిత కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద 11.38 లక్షల మంది దళితులకు పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. దళితులకు రూ.862 కోట్ల రుణాలు ఇప్పించామన్నారు.

మే నుంచి తల్లికి వందనం

మే నెల నుంచి 'తల్లికివందనం' కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తామన్నారు. రైతులకు అన్నదాత కింద రూ.14 వేలను మూడు విడతలుగా ఇస్తామన్నారు. మత్స్యకారులకు రూ.20 వేలు చొప్పున జీవనోపాధికి ఇస్తామని తెలిపారు. వైసీపీ పాలకులు రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లిపోయారన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాలని, సంక్షేమ కార్యక్రమాలకు నిధులను కేటాయించాలని, దీనితోపాటు అమరావతి, పోలవరం నిర్మించాలని చెప్పారు.





పిఠాపురం మండలం కుమారపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తదితరులు

పల్లె పండుగ రోడ్లకు ప్రారంభోత్సవాలు

- పిఠాపురంలో రెండోరోజు ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన
- టీడీపీ నేతల 'జై వర్మ' నినాదాలు

పిఠాపురం/ పిఠాపురం రూరల్/ గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో రూ.3.70కోట్లతో నిర్మించిన 21 రహదారులను ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు శనివారం ప్రారంభించారు. పిఠాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రెండోరోజు నియోజకవర్గంలోని 8గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కాగా, కుమారపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు 'జై టీడీపీ, జై వర్మ' అంటూ నాగబాబు ఎదుటే నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో టీడీపీ కార్యకర్తలు నాగబాబు కాన్వాయ్ వెళుతుండగా 'జై వర్మ' నినాదాలు చేశారు. జనసేన నాయకుడు మొయిళ్ల నాగబాబు మోటరు సైకిల్ అద్దాలు పగులగొట్టారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నాగబాబు రెండు రోజుల కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ హాజరు కాలేదు.

వక్ఫ్‌బిల్లుపై వైసీపీ డ్రామా

- ముస్లింల మతపరమైన స్వేచ్ఛలో కేంద్రం తలదూర్చలేదు
- కాంగ్రెస్‌ది రాజకీయం: పురందేశ్వరి
- బాబూ జగ్జీవన్‌రామ్‌కు బీజేపీ అధ్యక్షురాలి నివాళి

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డులో మాత్రమే సవరణ చేసిందని, ముస్లింల మతపరమైన స్వేచ్ఛలో తలదూర్చలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. అల్లా మీద విశ్వాసంతో దాతలిచ్చే భూమి వక్ఫ్ అవుతుందని, ఆ భూమిని సక్రమంగా వినియోగిస్తే మైనార్టీల ఇబ్బందులు దూరం చేయవచ్చని అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక సమానత్వం కోసం జీవితకాలం పోరాటం చేసిన జగ్జీవన్ రామ్ బడుగుల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం గత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన వివక్షను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370, పౌరసత్వ బిల్లు, వక్ఫ్ సవరణ చేసిందని వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలంటూ జేపీసీకి రిఫర్ చేసిన కేంద్ర ప్రభుత్వం 92 లక్షలకు పైగా వినతులు పరిశీలించి 25రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులతోపాటు 1.25కోట్ల అభిప్రాయాలు తీసుకుని చేసిన సిఫారసులకు అనుగుణంగా సవరణ



బీజేపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న పురందేశ్వరి తదితరులు

చేసిందని వివరించారు. ఇవేవీ అర్థం చేసుకోండా సోనియా, రాహుల్, ప్రియాంక చర్చలో పాల్గొనకుండా మతపరమైన అంశంపై అవాకులు, చవాకులు పేలుతూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్, వైసీపీ లాంటి పార్టీలు డ్రామాలాడుతుంటే మైనార్టీల అభివృద్ధి, ఆ వర్గాల్లోని మహిళల హక్కుల కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్లమెంటులో బిల్లును వ్యతిరేకించిన వైసీపీ ఆ తర్వాత రాజ్యసభలో మద్దతివ్వడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా పురందేశ్వరి అభివర్ణించారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

బాబూ జగ్జీవన్‌రామ్ అసాధారణ శక్తి

బాబూ జగ్జీవన్‌రామ్ ఒక సాధారణ కుటుంబంలో పుట్టి దేశంలోనే అసాధారణశక్తిగా ఎదిగారని సీఎం చంద్రబాబు కొనియాడారు. విద్యార్థి దశలోనే ఆయన అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముప్పాళ్ల గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ రక్షణ మంత్రి, ఉపప్రధానిగా పదవులకు న్యాయం చేశారని కొనియాడారు. 30 ఏళ్లు కేంద్రంలో మంత్రిగా ఉన్నారన్నారు. దేశంలో తొలిసారిగా ఆయన విగ్రహాన్ని ఎన్టీఆర్ హయాంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డు వచ్చిందన్నారు. దళితుల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి ఈ సంఘటనలు నిదర్శనమన్నారు.

కొలికపూడిని పట్టించుకోని సీఎం

- తిరువూరు ఎమ్మెల్యేపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నారని ప్రచారం



చందర్లపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వరుస వివాదాలు సృష్టిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ముప్పాళ్ల గ్రామంలో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు శనివారం చంద్రబాబు విచ్చేశారు. ఆయనకు మంత్రులు, జిల్లాలోని ఎమ్మెల్యేలు హెలిప్యాడ్ వద్ద ఎదురేగి స్వాగతం పలికారు. వారిలో కొలికపూడి శ్రీనివాసరావును చంద్రబాబు పట్టించుకోలేదు. పలుమార్లు కొలికపూడి సీఎం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేదు. కొలికపూడి ఎదురుగా వచ్చినా ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. అక్కడి నుంచి పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలలో ఒకరి ఇంటికి చంద్రబాబు వస్తున్న సమాచారంతో ఆ ఇంటి వద్ద కొద్ది సేపు వేచి ఉన్న కొలికపూడి అక్కడ ఉన్న ఇతర నేతలతో కలవకుండా దూరంగా ఉన్నారు. చంద్రబాబు రాక ఆలస్యం కావడంతో ప్రజాదర్బార్ వేదిక వద్దకు వెళ్లారు. అక్కడ కూడా చంద్రబాబును కొలికపూడి కలిసినట్లు కనిపించలేదు. దీంతో కొలికపూడి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కసిరెడ్డికి 'సిట్' పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలకు ముందు జగన్‌తో కలసి పనిచేసిన రాజ్ కసిరెడ్డి... వైసీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఐటీ సలహాదారుగా నియమితులయ్యారు. ఆ పదవిలో ఉంటూనే తెరవెనుక మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించారు. అప్పట్లో ప్రభుత్వమే నిర్వహించిన మద్యం షాపులకు 'జే' బ్రాండ్ల సరఫరాలో ఈయన ఆదేశాలు కీలకంగా పనిచేశాయి. కమీషన్లు చెల్లించిన కంపెనీల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్లకు తగ్గకుండా వసూలు చేసి దాదాపు రూ.3వేల కోట్ల వరకూ తాడేపల్లి ప్యాలెస్ పెద్దలకు చేర్చినట్లు రాజ్ కసిరెడ్డిపై సిట్ ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. లంచాల నెట్‌వర్క్‌ను రూపొందించడంతో పాటు వైసీపీ ప్రభుత్వంలో పెద్దరెడ్డిగా పేరున్న నాయకుడితో కలసి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకొని దందా నిర్వహించినట్లు ఆధారాలు లభించాయి. ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత సరుకు కొనుగోలు చేయాలో.. ఏ రోజు, ఏ బ్రాండ్లు ఎంత మేరకు విక్రయించాలో రాజ్ కసిరెడ్డే నిర్ణయించేవారని సమాచారం.

మూడుసార్లు నోటీసులు జారీ

కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివసించే జర్నలిస్టు కాలనీలోని ఇంటికి సిట్ అధికారులు మార్చి 25న మొదటిసారి నోటీసులు పంపారు. అదే నెల 28న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో పనివాళ్లకు ఇచ్చారు. రెండోసారి హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉంటున్న ఆయన తల్లికి 26న నోటీసులు అందజేశారు. అందులో మార్చి 29న విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న సిట్ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో ఈ-మెయిల్ సందేశం పంపిన కసిరెడ్డి... వివరాలు చెబితేనే విచారణకు వస్తానంటూ మెలిక పెట్టారు. సాక్ష్యం చెప్పేందుకు రావాలని సిట్ బదులివ్వడంతో ఇందులో తనకు ఏ సంబంధం లేదంటూ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈ నెల 4న విచారణ జరిపిన హైకోర్టు... సిట్ నోటీసులకు చట్టబద్ధత ఉందని, విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దీంతో శనివారం సిట్ అధికారులు కసిరెడ్డికి మూడోసారి నోటీసు ఇచ్చారు.

సాయిరెడ్డి వ్యాఖ్యలతో కలకలం

దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు... ఏడంచెల వ్యవస్థ ఏర్పాటు చేసుకున్న రాజ్ కసిరెడ్డి రూ.వేల కోట్లు తాడేపల్లి బాస్ చెప్పిన చోటికి చేర్చినట్లు తెలుస్తోంది. ఆర్డర్లు పొందిన మద్యం కంపెనీల నుంచి సేకరించిన లంచాల మొత్తం మొదట క్యాష్ హ్యాండ్లర్లకు, ఆ తర్వాత ఒకరిద్దరు నమ్మకస్తుల ద్వారా రాజ్ కసిరెడ్డికి చేరేది. విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తాయని, వాటిపై ప్రశ్నిస్తే ఇబ్బందులు తప్పవని గ్రహించిన రాజ్ కసిరెడ్డి... తాను తెలంగాణలో ఉన్నానని, సీఐడీ ఆధ్వర్యంలోని సిట్‌కు రాష్ట్రం బయట పరిధి లేదని, నోటీసును కొట్టివేయాలని కోర్టును ఆశ్రయించి భంగపడ్డారు. మరోవైపు వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నుంచి సీఐడీ, సిట్ అధికారులు కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఇటీవల విజయవాడలో వేరే కేసులో విచారణకు హాజరైన ఆయన రాజ్ కసిరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణానికి పాత్రధారి, సూత్రధారి కసిరెడ్డే అని మీడియా ముందు ప్రకటించారు. అవసరమైనప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తానని విజయసాయి చెప్పడం కలకలం రేపింది. ఈ వ్యాఖ్యలతో అప్రమత్తమైన సీఐడీ అధికారులు.. మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి పాత్రపై కీలక సమాచారాన్ని సేకరించి, ఆయన్ను ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు.

హౌసింగ్ గోడౌన్లలో తనిఖీలు

- గత వైసీపీ సర్కారులో పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో భారీఎత్తున అవినీతి, అక్రమాలు
- జిల్లాల నుంచి ఫిర్యాదులతో తనిఖీలు చేసి.. నెలలోపే నివేదికలివ్వాలని సర్కారు ఆదేశాలు
- అక్రమాలు బయటపడకుండా సిబ్బంది సర్దుబాట్లు!

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పేదల ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, స్టీల్, ఇతర నిర్మాణ సామగ్రిని నిల్వ చేసే హౌసింగ్ గోడౌన్లతోపాటు బల్క్ ఇసుక డిపోల్లో తనిఖీలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ తనిఖీలకు సంబంధించిన మార్గదర్శకాలను నిర్దేశిస్తూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ పద్మనాభన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల హౌసింగ్ హెడ్‌లకు ఇటీవలే ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఒక డివిజన్ హెడ్ మరొక డివిజన్‌లోని గోడౌన్లను తనిఖీలు చేసి.. లోపాలుంటే ఆయా జిల్లాల హౌసింగ్ హెడ్‌లకు నివేదించాలని ఆదేశించారు. దీంతో ఈనెల ఒకటో తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ గోడౌన్లు, బల్క్ ఇసుక డిపోల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. గడచిన ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా మార్చి 31వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హౌసింగ్ గోడౌన్ల వారీగా నిల్వలకు సంబంధించి ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేసిన వివరాలకు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తనిఖీల్లో గుర్తించిన ముగింపు బ్యాలెన్సు నిల్వలకు మధ్య వ్యత్యాసాలను ధ్రువీకరిస్తూ రిపోర్టులు రూపొందించేలా తగిన కార్యాచరణ ప్రణాళికను అందజేశారు. తనిఖీల నివేదికల ఆధారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన గోడౌన్ల ఇన్‌చార్జిలు, బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో అక్రమాలకు పాల్పడినవారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అక్రమాలు బయటపడకుండా ముందుగానే సర్దుబాటు చేసుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది! గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో భారీఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయి. వీటిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జగనన్న లే-అవుట్లకు భూ సేకరణ, మెరక పనుల్లో వైసీపీ నేతల దోపిడీ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. హౌసింగ్ అధికారులు, సిబ్బంది కూడా గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు అవినీతి, అక్రమాల్లో భాగస్వాములయ్యారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్స్ సరఫరా వరకు ప్రతి దశలోనూ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన సిమెంట్, స్టీలు, ఇతర నిర్మాణ సామగ్రితోపాటు లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఇసుకను సైతం పక్కదారి పట్టించి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. ఈ అవినీతి సొమ్మును హౌసింగ్ గోడౌన్ల ఇన్‌చార్జిలు, ఏఈలు, డీఈలు, డీఈఈలు, డీహెచ్‌హెచ్‌లు అందరూ వాటాలుగా పంచుకుని రూ.కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తుండటంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. కాగా, ఈ తనిఖీలను హౌసింగ్ అధికారులే నిర్వహిస్తున్నందున వారి అవినీతి, అక్రమాలను వారు బయటపెట్టుకునే అవకాశం ఉంటుందా? అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని హౌసింగ్ బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

నిండాముంచిన అకాల వర్షం

- కోస్తాలోని పలు జిల్లాల్లో జోరు వాన
- పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులు
- తడిసిన వరి పనలు.. నేల రాలిన మామిడి
- అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం
- కాకినాడ జిల్లాలో అత్యధికంగా 56.25 మి.మీ.వర్షపాతం
- మరో రెండు రోజులు మోస్తరు వర్షాలు
- అదే సమయంలో వేడి పెరిగే అవకాశం
- జాగ్రత్తగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ


కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

విశాఖపట్నం/అమరావతి/పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షం కోస్తా ప్రాంతంలోని రైతులను నిండా ముంచింది. అనూహ్యంగా వచ్చిన వానతో పలు చోట్ల ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. మామిడికాయలు నేలరాలాయి. మొక్కజొన్న పంట నేలనంటింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకళ్లెదుటే వర్షార్పణం అవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మధ్య మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా ఉత్తర తమిళనాడు వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. దీనికి తోడు శనివారం రాష్ట్రంలో అనేక చోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. అదే సమయంలో సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీచాయి. వీటన్నింటి ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని కోస్తాలో పలుచోట్ల ప్రధానంగా ఉత్తరకోస్తాలో శనివారం మధ్యాహ్నం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి. అక్కడక్కడా వడగళ్లు పడ్డాయి. ఈదురుగాలులకు పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. జీడిమామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

తడిచిన ధాన్యం రాశులు..

కాకినాడ జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలో వీచిన ఈదురుగాలులకు చెట్లు పడిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ధాన్యం రాశులు నీటిలో తడిచి ముద్దయ్యాయి. మిల్లులకు తరలించాల్సిన పంట కళ్లెదుటే వర్షార్పణం అవ్వడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, ఉప్పాడ ప్రాంతాలు సహా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వెంబడి ధాన్యాన్ని ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల్లో వరి పనుల నీట మునిగాయి. కిర్లంపూడిలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలన్నీ ఉప్పొంగాయి. కాకినాడ జిల్లా వేలంకలో 56.25, ఏలేశ్వరంలో 48.5, కిర్లంపూడిలో 46.8, కోటనందూరు 45.25, అనకాపల్లి, నర్సీపట్నంలో 44.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో 20 మిల్లీమీటర్లకు పైగా వాన పడింది.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

వాతావరణ అనిశ్చితి, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఆది, సోమవారాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ హెచ్చరించాయి. అకాల వర్షాలు, పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మరోవైపు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది. శనివారం అనకాపల్లి జిల్లా మాడుగులలో 39.8, నంద్యాల జిల్లా గోనవరం, శ్రీకాకుళం జిల్లా పొందూరులో 39.7, పల్నాడు జిల్లా రావిపాడులో 39.6, చిత్తూరు జిల్లా నగరి, కర్నూలు జిల్లా సాతనూరు, ప్రకాశం జిల్లా పునుగోడు, కడప జిల్లా వేమనపురంలో 39.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కోర్టుకు రండి!

- పీసీబీ మెంబర్ సెక్రెటరీ, శ్రీకాకుళం కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం
- లిఖిత పూర్వకంగా వివరాలను సమర్పించకపోవడంపై అసంతృప్తి
- వీడియో కాన్ఫరెన్స్ హాజరుకు అనుమతి

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) బోర్డు సభ్య కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట పరిధిలో నివాసప్రాంతంలో వాయికాలుష్యానికి కారణమవుతున్న 'కేరళ టైర్స్' సంస్థపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ దాఖలైన వ్యాజ్యంలో లిఖిత పూర్వక వివరాలు సమర్పించాలని ధర్మాసనం గతంలో ఆదేశించింది. అయితే.. ఈ ఉత్తర్వులను అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తదుపరి విచారణలో తమ ముందు హాజరుకావాలని ఇద్దరు ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. అయితే, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు వెసులుబాటు ఇచ్చింది. విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. నరసన్నపేట పరిధిలోని నివాస ప్రాంతంలో అనధికారికంగా రబ్బర్ టైర్లు, ట్యూబ్‌లు రీబటనింగ్, రీబిల్డింగ్ చేస్తూ కేరళ టైర్స్ పర్యావరణాన్ని కాలుష్యం చేస్తోందని గరీబ్ గైడ్ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జి. భార్గవి, ఉపాధ్యాయుడు పి. అప్పారావు ఫిర్యాదు చేశారు. అయితే.. దీనిపై అధికారులు నివేదిక సమర్పించినా.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ వారు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా ఈ వ్యవహారంపై లిఖిత పూర్వక వివరాలు సమర్పించాలని అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్ ఈ నెల 2న మరోసారి విచారణకు రాగా ప్రభుత్వ న్యాయవాదులు స్పందిస్తూ లిఖిత పూర్వక వివరాలు అందలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం తదుపరి విచారణలో తమ ముందు హాజరు కావాలని పీసీబీ మెంబర్ సెక్రెటరీ, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.